UNIVERSAL
LIBRARY
OU_204633

UNIVERSAL
LIBRARY

Osmania University Library

T 816 / A59R Accession No T 2465

book should be returned on or before the date la
ow

# రుక్మిణీకల్యాణము

P ANJANEYA KAVI

All Rights Reserved.

గ్రంథకర్త,

కవితావిశారద


పంతం ఆంజనేయకవి.

సర్వస్వామ్యయములు
కవిగారివి.

వెల-రూ 1-0-0

కొండా వీరయ్య అండ్ సన్స్ గారి శ్రీ భారతీ ప్రెస్‌లో
ముద్రింపఁబడియె సికిందాబాద్.

500 ప్రతులు.



కృతికర్త

కవితావిశారద

పంతం ఆంజనేయకవి,

హైదరాబాదు.

# విజ్ఞాపనము.

పాఠక మహాశయులారా!

అనంత కల్యాణగుణాభరణుండగు పరమేశ్వరుని లీలా కృత్యంబుల నభివర్ణించుట వేరతరము. తొల్లి తపోవంతులగు ఋష్యాదులు దీర్ఘకాలము తపస్సంపన్నులై తుదకు తెలిసీ తెలియనివారలై యా దయామయుని పాదారవింద భజనానంద మగ్నమానసులైరి. చతుర్ముఖుండంతటివాఁడు సహస్రదివ్య వర్షంబులు పరిశోధించి భగ్నచిత్తుండై తదంఘ్రిసేవయే ముఖ్యంబని చతుర్ముఖంబులనుగ్ఘోషించెను. అట్టిచో నేనెంతటివాఁడను. భగవత్సన్నిధానమున ప్రహ్లాదుండు.

“ మ॥ తపముం వంశముఁ దేజముం శ్రుతముసౌం ♦ దర్యంబు
నుద్యోగముం, నిపుణత్వంబుఁ, బ్రతాపపౌరషములుం
నిష్ఠాబలప్రజ్ఞలుం. ♦ జపహోమంబులుఁజాల వీశ్వరభ
వత్సంతుష్టికై దంతియూ ♦ థపుచందంబున భక్తి సేయవ
లయుం ♦ దాత్పర్యసంయుక్తుఁడై ॥”

అని ప్రార్థించెను. కావున నేనా విషయలోలుఁడను, తాపత్రయైషణాత్రయములఁజిక్కుకొని యపారంబగుసంసారసముద్రంబునఁ గొట్టుకొనిపోవుచుండెడి యల్పజ్ఞుఁడను. ఇట్టిసంకటంబులనుంచి విడువంబడు వేరొండుమార్గంబుఁగానక దయామయుని చరిత్రంబులకీర్తి నాయల్పవిద్యాగీతంబుల గానంబుఁ జేయ మొదలి

డితిని. ఈరుక్మిణీకల్యాణము భగవానుండైన వ్యాసమహాబుసి పరమపవిత్రమైన గీర్వాణభాషరచియించెను. తరువాత యపర వ్యాసుండో యనిపరమభక్తాగ్రేసరుండగుపోతనామాత్యుడాంధ్ర భాషయందు, జీవకళలుట్టిపడ వ్రాసెను. పిమ్మట ప్రాజ్ఞుండగు కూచి మంచితిమ్మకవి యీచరిత్రమును ప్రౌఢభాషలో బోషించెను. ఇట్టిమహోన్నతదశయందు వెలింగెడిచరిత్రంబును మరల నాచేరచియింపంబడుటకు కారణము వీరలబ్రతిఘటించిమించి వెలుంగంజేయు సంకల్పమునకాదు. వారికిని నాకును హస్తిమశకాంతరము. రామా! అనుభగవన్నామము నుచ్చరించుటయెట్లు పునరుక్తిదోషమున పరిగణింపంబడదో యట్లే యీవిశ్వంభర మూర్తిదివ్యచరిత్రంబెందరెన్ని పర్యాయములురచియించినను చర్వితచర్వితాతి చర్వితము కాదనితలంచి నాశక్త్యాను సారముగా నీచరిత్రంబును రచియించితినని నా మనవి.

ఒకచోట ప్రహ్లాదుడు బోధకుండై యిట్లువచియించెను.

"గురుశుశ్రూషయు, సర్వలాభసమర్పణంబును, సాధుజనసంగమంబును, నీశ్వర ప్రతిమా సమారాధనంబును, హరికథాతత్పరత్వంబును, వాసుదేవునియందలి ప్రీతియు, నారాయణగుణనామకీర్తనంబును, వైకుంఠచరణకమలధ్యానంబును, విశ్వంభరమూర్తి విలోకనపూజనంబులును, పొందదగిన విజ్ఞాన వైరాగ్యలాభసాధనంబులైన భాగవత ధర్మంబులపై రతిగలిగి

సర్వభూతంబులయందు నీశ్వరుండు భగవంతుండాత్మగలండని సమ్మానంబుసేయుచుఁ గామ క్రోధ లోభ మోహ మదమత్స రంబులఁ గెలిచి యింద్రియవర్గంబును బంధించి భక్తిసేయుచుండ నీశ్వరుండయినవిష్ణుదేవునియందలిగతిసిద్ధించు" కావున బుద్బుద ప్రాయంబునగు నీతనువును తదనుకూలంబులగు విషయంబుల నిజస్థితి నెఱింగి శాశ్వతానందమునకు మూలంబగు శ్రీహరిచరణారవింద భజనానందమే ప్రశస్తమని తలంచినవాఁడనని యెఱుంగనగు. నాకవిత్వము భక్తిమార్గానుకూలముగ వీక్షింపవలయుఁగాని ప్రౌఢభాషాప్రకటనంబునకై రచియింపంబడినదని తలఁపవలదు. నేనందఱివలె గురువులచెంత జరింపక స్వతస్సిద్ధముగ పాండిత్యంబించుక శ్రీహరికరుణాకటాక్షమువలనఁబొందితినని చెప్పసాహసించెదను. కడుంగడు బాల్యంబుననుండియే నాకుభాగవత పరనాపేక్షమెండు. ఇతరకావ్యము లెన్నినిచదివినను భాగవతములోఁగొంతభాగము నిత్యముజదివినఁగాని, నాచిత్తమునకు హాయిగలుగదు. ఇదినాకొక పిచ్చియో! లేక భగవచ్చింత నాయత్తమైన చిత్తచాంచల్యమో! వివరింపఁజాలను. ఇప్పటికిని యిదియెనాకు నిత్యపారాయణయోగ్యమైన పారమార్థిక గ్రంథమైయున్నయది.

అస్మద్గురువర్యులగు బ్ర॥శ్రీ॥ మహామహోపాధ్యాయ, కళా ప్రపూర్ణ, కవిసార్వభౌమ, ఆంధ్ర వ్యాసులగు శ్రీపాద

కృష్ణమూర్తిశాస్త్రిగారు శ్రీనాథప్రోక్తమగు నైషధమును బఠించి తద్గ్రంథకర్తయగు శ్రీనాథకవిసార్వభౌముని తమ గురువుగా నెల్లుభావించి తమగ్రంథములలోఁ జెప్పుకొనియుండిరో యట్లే శ్రీమదాంధ్రభాగవత గ్రంథకర్తయు భక్తాగ్రేసరుఁడునగు బమ్మెరపోతనామాత్యుఁడే నాకుపరమగురువనియు, నాకవిత్వమునకు శ్రీ భాగవతమే కారణమనియు నిరాటంకలముగా జెప్పసాహసించెదను.

ఇటీవల బ్ర॥శ్రీ॥ శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రిగారివద్దనే గాంచిన కవితాశిక్ష గూడనాకవిత్వమునకు వన్నె దెచ్చినదని మనవిఁ జేయుచున్నాఁడను.

నేను కవిత్వము మొదలిడి నేటివరకు వ్రాసినగ్రంథములన్నియు ననన్యవాత్సల్యమున వేసరక బరిశీలించి పొడమిన కొరంతలఁజూపుచు, కథాకల్పనాసూచనంబులఁబ్రసాదించుచు నా యీకవిత్వమును బ్రశంసార్హమగు మార్గమునఁ ద్రిప్పిన విమర్శకాగ్రేసరులును, సంస్కరణీయ భాషాసిద్ధులును, నాకు పరమ మిత్రులునగు బ్ర. శ్రీ. డాక్టర్ పిశుపాటి వేంకటరమణయ్యగారిని యస్మద్దేశికేంద్రులుగా భావించుచువారికి కృతజ్ఞతా పూర్వకముగా వందనము లర్పించుచున్నాఁడను.

భగవద్భక్తియే ప్రాముఖ్యముగాఁ గొని వ్రాయు నా కవిత్వమునకుమెచ్చి " ఆంధ్రభారతీ తీర్థము " యొక్క

ప్రథమాధ్యక్షులగు ఘనతవహించిన జయపూరు మహారాజు (**His Highness Maha Rajaha of Jaipur, Chancellor of Andhra Research University**) గారు నాకు "కవితావిశారద" బిరుదమునొసంగిరి. ఇయ్యది నాకు భరింపరాని భారమయ్యును భరింపవలసిన విధియై యున్నది. పరాధీనవృత్తియందుననుండియు వీలుననుసరించిమాతృభాషా సేవజేసెడి నాకు మున్ముందు నీ బిరుదమునకైనలయు భాషాభివృద్ధియు, గ్రంథరచన చేయుటకై కొంతకాలమువిని యోగింపవలసినపనినాకు తప్పనిసరియైయున్నయది. సర్వేశ్వరుని సంకల్పమెట్లున్నదో తెలియదు. నాయెడసానుభూతిఁగనబరచిన శ్రీభారతీ తీర్థముయొక్క ప్రథమాధ్యక్షులగు జయపూరు మహారాజుగారికిని, తదధ్యక్షులగు బ్రి. శ్రీ. ఆచార్యబుర్రా శేషగిరిరావు **M.A. PH: D., M.S.A.** గారికినికృతజ్ఞతాపూర్వకముగా వందనము లర్పించుచున్నాఁడను.

ధార్మికచిత్తులును, సత్యవచోధురంధరులును, ఉత్తమోత్తములును, రాట్కులసంజనితులును, భాషాత్రయపారంగతులును ప్రత్యేకించి మాతృభాషాభిమానులునగులింగన్నపేట సంస్థానాధీశులగు మ॥రా॥శ్రీ॥ గోరంటవేంకటనరసింగరావు సర్దేశాయిభూపాలురీ రుక్మిణీకళ్యాణము భక్తితోవిని నన్నుసత్కరించి యిద్దానినంకితముగా స్వీకరించి, యీగ్రంథ

మనతి కాలములో వ్యయప్రయాసములకులోనై ముద్రింపఁజేసి సారస్వతలోకమున కందజేసిన వీరికి సర్వదాయాయురారోగ్య సత్సంతానైశ్వర్యాభివృద్ధిగోరుచు కృతజ్ఞతావందనములర్పించు చున్నాడను. ఈయుద్యమమున వీరినుత్సాహపరచిన వీరిమామ గారగు దొంతిసంస్థానభూపాలురగు శ్రీరాజా వేంకట గోపాల రెడ్డి భూపాలురకును మ॥రా॥శ్రీ॥ విద్యావార్థియగు బూరుగపల్లి కనకారెడ్డిగారికిని కృతజ్ఞతాపూర్వకముగా వందనములర్పించు చున్నాఁడను.

ఈ ప్రబంధమును రచియించుటకిదియే ప్రథమప్రయత్నము గావున సాంగోపము లేగాక ముద్రణాలోపములుగూడ నుండకపోవు. "నడచుచునుండువాని చరణంబులకేగద రాళ్లత్రాకుసుల్" అను న్యాయముననుసరించి యిందుబొడమిన తప్పిదములు సహృదయులగు పండితకవిలోకము క్షమింపఁగలరని నా ప్రార్థన.

ఇట్లు

బుధజన విధేయుఁడు

గ్రంథకర్త.

## Letter from Sir K. V. Reddy Naidu Garu, Ex: Governor of Madras.

Kurma House,
Thyagaraya Nagar,
**Madras, 17th Oct: 1938.**

*Dear Mr. Naidu,*

I am in receipt of your letter dated 20th Septr: 1938 and the enclosures. I have read your "Rukmini Kalyanam." I am exceedingly glad that you have been able to write such a high class book. It is really entertaining. The style is classical and at the same time pure and simple.

Yours sincerly,
*K. V. Reddy.*

## —: గురునమస్కారము :—

గీ॥ సరస కవిలోక పాలనా ♦ చక్రవర్తి
నాంధ్ర వ్యాసుని వేద వే ♦ దాంగ విదుని
శ్రీపదాన్వయుఁ గృష్ణాఖ్యు ♦ శ్రితసుపూజ్యు
మద్గురోత్తము స్మరియింతు ♦ మహితభక్తి.

ఓం

# పీఠిక.

యే నామ కేచిది హ నః ప్రథయం త్యవజ్ఞామ్ ।
జానంతి తే కిమపి తాన్ప్రతి నైష యత్నః ।
ఉత్పత్స్యతే మమతు కోఽపి సమానధర్మా ।
కాలోహ్యయం నిరవధిర్విపులాచపృథ్వీ ॥

భవభూతి.

పరిదృశ్యమాన ప్రపంచరంగమునందు, సృష్ట్యాదినుండియు కవిత్వము మానవునికి సహజలక్షణముగా గానుపించెడిది. పలనన, మానవుని శైశవదశయందే, వేదకాలపునాటి యార్యులు తొలిపల్కులగు ఋక్కులను గానము జేసిరి. ఆదికావ్యమగు రామాయణమును పాడి 'వాల్మీకి కోకిల' యమరత్వమును బొందెను. పంచమవేదంబనబడు 'భారతామ్నాయము' ను రచియించి వ్యాసమహర్షి భగవానుడయ్యె. పుణ్యభూమియగు నార్యావర్తమునందేగాక, పురాతననాగరికతగల గ్రీకుదేశములో గూడ, 'హోమరు' **(Homer)** మొదలైన మహాకవులుద్భవిల్లి, 'ఒడస్సి, ఇలియడ్' **(Odyssey and Iliad)** మొదలైన విఖ్యాతిపురాణరాజముల వ్రాసి జగత్ప్రసిద్ధినిబడసిరి. ఇంతేగాక ప్రాచీనకవుల వాఙ్మయములలో కనబడు సౌష్టవము మాధురీగరిమ, ఆవేశము **(Inspiration)** నాగరికతాభివృద్ధియైన కొలదిని పూజ్యమగుచుండెనను కొందరివాదము సత్యదూరము కాదు.

లోకములో కవిత్వమబ్బుట చాలాదుర్లభము. అందువలననే మనపూర్వులు.—

శ్లో॥ శక్తిర్నిపుణతాలోక శాస్త్రకావ్యాద్యవేక్షణం
కావ్యజ్ఞశిక్షయాఽభ్యాసఇతిహేతు స్తదుద్భవే ॥

అనికవిత్వమబ్బుట కిన్నిలక్షణములుండవలెనని నుడివియున్నారు.

కవిత్వమనునది యొకరిసొత్తుకాదు, ప్రాకులాడినరానేరదు; బహుజన్మతపఃఫలము, పూర్వసుకృతసంచయము, వరప్రసాదలబ్దము. అందువలననే, “**Poets are born and not made**” అన్ననుడువుసత్యము. కవిత్వమును చెప్పువారందరు కవులనిపించుకొనరు. కవిత్వమురసాశ్రయము, రసపిపాసాజిఘృక్షువులగు ముముక్షువులకుగాని సామాన్యులకు కవిత్వగుణమగోచరము. కవియన్ననో నిరంకుశుఁడు, రారాజుకన్నమిన్నయగుమేటిమానసి, రవిగాననిచో కవిగాంచును. ప్రకృతియొక్క మూలమూలలనుండుసమస్తస్థూల, సూక్ష్మ, జంగమ, స్థావరప్రదేశములన్నియునన్వేషించును, ప్రకృతిదేవతోపాసకుఁడుకవి, ప్రకృతియొక్కగాఢభక్తుఁడు. కవియే ప్రకృతి, ప్రకృతి యేకవి.

అందువలననే సూరణప్రభావతి ప్రద్యుమ్నములో కవిత్వలక్షణములు నీక్రింది విధమున పేర్కొనియున్నాడు.

"సీ॥ శబ్దసంస్కారమె ♦ స్పటను జారఁగనీక
పదమైత్రియగ్గసం ♦ పదలఁబొగలఁ
దలఁపెల్లనక్లిష్ట ♦ తనుపరిదీపితముగాఁ
బునరుక్తిదోషంబు ♦ పొంతఁబోక
యాకాంక్షితస్ఫూర్తి ♦ యాచరించుచును శా
ఖాచంక్రమక్రియఁ ♦ గడవఁజనక
పరిష్కృతార్థభావంబు ♦ సాదుశోనదుకుచు
నుపపత్తినెందు న ♦ త్యూర్జితముగ

గీ॥ నొకటుబూర్వోత్తరవిరోధ ♦ మొదవకుండ
దత్తదశయవవాక్యతా ♦ త్పర్యభేద
ములుమహావాక్యతాత్పర్య ♦ మునకునొనరఁ
బలుకనేర్చుట బహుతపః ♦ ఫలముగాదె"

ఇంతేగాక కవిప్రవేశించని రంగములేదు, ప్రదేశము లేదు. రాచకీయములలో పాల్కొని జాతీయ నిర్మాణకుఁడని (Nation Builder) పించుకొనినాడు. ఫరాసుదేశములో, వాల్టేరు రూసోని' (Voltairre And Roussoean) యనువారల కావ్యరచనలు ఫరాస విప్లవమునకు కారణమయి (French Revolution) విశ్వమానవ సౌభ్రాతృత్వము నొకప్పుడు (Liberty, Equality, Fraternity) స్థిరపరచినవి. అలాగు ననే కొలదివత్సరములక్రిందట, రుష్యా (Russia) దేశములో టాల్స్టాయి: లెనిను (Tolstoy and Lenin) రచయితలవాఙ్మయమభివృద్ధిపొంది, అపూర్వమయిన మార్పులు

(**Innovations**) దెచ్చిపెట్టుటయేగాక' నెన్నడువిని, కనివెరుగని సంస్కారములజొనిపి, నవ్యనుజాతికేగాక, ప్రపంచ మానవజాతికందరికిని, ఒకనూత్నవికాసము, నూత్నపరిజ్ఞానము నూత్ననిశ్చయము, నూత్నక్రమమును(**New Social order**) ప్రవేశపెట్టి, భూగోళమునంతయు సాఘింక విప్లవముతో గలవరబెట్టుచున్నది.

ఇటులనే, ఆంధ్రవాఙ్మయమహోదధి తరచినయెడల ఆంధ్రులుకూడ వేదకాలమునుండియు ఆంధ్రజాతివికాసమునకు దోడ్పడినారనుట సందియముకాదు. మరియు ఆంధ్రవాఙ్మయ చరిత్ర పరిశీలించినచో, ఆంధ్రకవిత్వము ఒకనన్నయతో ప్రారంభముగాక (**1020 A.D. To 1150 A.D.**) చంద్రవంశపు రాజగు, ఆంధ్రవిష్ణువుకాలమునుండియు విజృంభణలో నున్నట్లు గోచరమగును, ఐతరేయ బ్రాహ్మణమునందును, శతప్రధ బ్రాహ్మణమునందును ఆంధ్రులుపేర్కొనబడుటచే, సూత్రకాలమునుండియు ( **Age of Sutras**) ఆంధ్రకవిత్వకాలనిర్ణయముచేయవలసినదియైయుండగా, ఒకనన్నయకాలములోనే, ఆంధ్రకవిత్వముహఠాత్తుగా ప్రత్యక్షమయినదనిచెప్ప సాహసించుట, కొందరిమతములోనెంతయు సమంజసముకానేరదు.

ఏదియెట్లున్నను, నన్నపార్యుడే కవిబ్రహ్మగా పెక్కురు పూర్వకవులచే బేర్కొనబడినాడు. అందువలననే:—

మ॥ మహిమన్ వాగనుశాసనుండు సృజియిం ♦ పన్ గుండలేంద్రుండు త
న్మహనీస్థితిమూలమై నిలుప శ్రీ ♦ నాథుండు బ్రోవన్ మహా
మహులౌ సోముఁడు భాస్కరుండు వెలయిం ♦ పన్ సొంపువాటిల్లు నా
బహుళాంధ్రోక్తిమయప్రపంచమున త ♦ త్ప్రాగల్భ్యమూహించెదన్.

అని, రామరాజభూషణుఁడు పూర్వకవిస్తుతిఁ జేసి, ఆంధ్ర వాఙ్మయచరిత్ర" నంతయు నొక్క పద్యములో సంక్షిప్తముగా నిమిడ్చినాడు.

నన్నయభట్టు కుంజరము ప్రప్రథమమునుండియు రాజరాజనరేంద్రుని యుద్యానవనమున స్వేచ్ఛగా విహరించుచు మహానదియగు గోదావరిగట్టెక్కి, వైరిభూరుహశాఖా నాశనమొనర్చి, "శ్రీవాణీగిరిజా" యనుచు ఘీంకారనాదమొనరించి, ఆంధ్రులందరికి ప్రథమదర్శనమునొనర్చినది. తరువాత కుండలీంద్రుండగు తిక్కన నెల్లూరునందు మనుమసిద్ధి భూపాలుని నాశీర్వదించి, అమాత్యశేఖరుఁడయి, లౌక్యవైదికముల రెంటిని సమన్వయించి, హరిహరనాథభక్తుఁడై, "కిమస్థిమాలా! కిముకౌస్తుభం వా!" "నవతాదూర పురాణతానుపగతా!" యనుచు నద్వైతభావపరంపర సర్వదిశల వెదజల్లుచు, "కులబ్రాహ్మణుఁడు" అరణ్యపర్వశేషము మునహావదలినభాగము నంతయు సృష్టియొనర్చి, ఆంధ్రభాషావధూటికి మూలమై నిలచి మేటికీర్తి దిగంతముల వ్యాపింపజేసినాడు. తరువాత, ఏరూర్చి ప్రబంధపరమేశ్వరుఁడా భాషామతల్లికి నూతనాలంకారము

జేయించి మరింత యపూర్వశోభనుకల్పించినాడు. తరువాత, సోముఁడు, భాస్కరుఁడు, శ్రీనాథుఁడు, సూరన, పెద్దన, రామరాజభూషణుఁడు, ముక్కుతిమ్మన, ధూర్జటిమొదలైన మేటికివాటములగు కవులుద్భవిల్లి, పురాణయుగమునుండి, ఆంధ్రభాషామతల్లిదృష్టినిమరల్చి, ప్రబంధనిర్మాతలై నూతన సృష్టియొనర్చి, ప్రబంధయుగమను పేరనొకనూత్నశకమును ఆంధ్రవాఙ్మయచరిత్రలోకల్పించి, రారాజులకీర్తి మన్ననల బడసినారు. ఈయుగములోనే కవులకు చక్రవర్తులుసహితము దాసులయి నీరాజనములిచ్చినారు, రత్నాంబరములిచ్చి కేలూర్చినారు. "భువనవిజయ" రత్నసింహాసనమున నధిష్ఠింపజేసినారు. కనకాభిషేకములలో కవులనుముంచెత్తినారు. "మూరరాయరగండ డం"తటివాడు, ఆంధ్రపితామహుండాశీర్వదించుచు సేసలు జల్లుచుండగా, బోయిరాజై, ఆంధ్రవాణినిదనకేల బల్లకిదండనెత్తి, ఆంధ్రసరస్వతిని వేవిధములపూజించినాడు

అటులాదర్శప్రాయమైన ప్రబంధయుగమును వదలి నేటియాధునిక కవులు, పాశ్చాత్యనాగరికతా సమ్మోహనమునను, పూర్వాచారమును వదలి తెలుగువాణిని నూత్నమార్గములను, నూత్నశోభలతో, నూత్నసృష్టికిగడంగుచు, "భావకవిత్వమను పేర నవ్యసాహిత్య కవితాసృష్టికి గడంగుచు "పాలతరఁగలు" "వెన్నముద్దలు" "నీటిబుడగలు" "జల

పుష్పములు" మొదలుగాఁగల చిత్రవిచిత్ర నామములతోఁ జేర్చి, ఆంధ్రవాఙ్మయములో నూతనాధ్యాయమును నిర్మించుచున్నారు. ఈ భావకవిత్వధోరణులలో కొందరు, "కొత్తిమెరు కవిత్వము" లేక (**Lyric Poetry**) అని ప్రయోగించియున్నారు

భారత, భాగవత, రామాయణాది యుత్కృష్ట కల్పభూరుహసంభరితాంధ్రోద్యానవనమున, నీకవిత్వమునకు స్థానము బొత్తిగా లేదని కాబోలు వారియభిప్రాయము. ఆంధ్రకవితామహుడు చెప్పినట్లు "ఖిలముఁ గాకుండునది కావ్యము" గనుక నిందలి సత్యాసత్యములు భావికాలమునకే వదలివేయుట సమంజసము.

అయినను, పూర్వాచారమునే ప్రధానముగ జేసుకొని "ప్రబంధకవిత్వము" నాదర్శముగా జేసుకొనుచు, ఆంధ్రభాషామతల్లికి భాషాసేవయొనర్పఁదలచిన వారలలోకిం కవీంద్రఘటాపంచానన బిరుదాంకితులును, శతావధానులునైన తిరుపతికవులు ముఖ్యులు తరువాత వారలలో మన 'పంతం ఆంజనేయ' కవిగారు ప్రశంసనీయులు.

ఈయనప్రస్తుతము రచియించినది రుక్మిణీకళ్యాణమను నయిదాశ్వాసముల ప్రబంధరాజము. దాని నిదివరలో, భక్తాగ్రేసరుఁడగు పోతన, కూచిమంచితిమ్మకవి మొదలైన మహాకవులు భక్తిరసముట్టిపడ ప్రబంధరచనయొనర్చినారు. అయినప్పటికి, "రాఘవేశ్వరుచారిత్రము లెందరెన్ని విధముల్ వర్ణిం

చిరఁ గ్రాలదే'' అనియన్నాఁడు పాపరాజు. పరమేశ్వరుని చారిత్రము నొందరెన్ని సార్లు రచియించినను చర్వితచర్వణమనిపించుకొనదు కాని యెల్లెడలను ఆంధ్రభూమి నానాభంగుల భావకవిత్వ రంగత్తరంగములం దోలాయమానమగుచుండఁగా, వర్తమానయుగములో ప్రబంధరచయితలకు, వాఙ్మయచరిత్రలో నేస్థానముండునని హ్రస్వదృష్టిగల వక్రమానవులగు విమర్శకులధిక్షేపించుట సహజము. కవికిని, విమర్శకునకుఁ జుక్కెదురే! సుకవికవిత్వము తార్కికదృష్టితోఁ జూడ విమర్శకుల తీవ్రకోపానల జ్వాలల కాఁగ నేరదు. అంశుకనియే పిల్లనసుచరిత్రయను ఖ్యాతిగాంచిన విజయవిలాస''గ్రంథకర్తయగు, చేమకూర వేంకటపతియంతటివాఁడు, ఏ గతిరచియించెనేని సమకాలమువారలు మెచ్చరే గదా'''యని ఒక్కసారి నిట్టూర్పువిడచి యూరకున్నాఁడు.

మరియు, ఆంగ్లవాఙ్మయచరిత్ర తిలకించినచో నిట్టిసాదృశ్యములు పెక్కులుగానవచ్చుచున్నవి. కీట్సు (**Keats**) మహాకవి (**A thing of beauty is a joy for ever**) అని ఘనవిపంచిక మీటుచు మృదుకుహూస్వరముతో గానము జేయుచు, ప్రకృతి యారాధన మృదుమధురములగుశబ్దజాలములలో (**Endymion**) కావ్యమును శిల్పమొనరించి సమకాలపువారలలో మిన్నయనిపించుకొన్న లలితకవిరాజు (**Edinborough and Quarterly Reviews**) మొదలైన పత్రిక

లలో విమర్శకుల నిశితబాణ పరంపరలకుగురియైబెంగపెట్టుకొని మిగుల బాల్యమునందుననే స్వర్గస్థానమలంకరించి ఆంగ్లసాహిత్యమునకుతీరనినష్టముగావించినాడు. ఇంకనుజీవించినయెడల (Shakespeare) మహాకవినికూడ మించకలుగునేమోయని పలువురియభిప్రాయమైయున్నది.

ఈ ప్రబంధమును వ్రాయుటకు కారణము, కవిగారే యీక్రిందిపద్యమున నొకవిధముగా సమర్థించుచున్నారు.

ఉ॥ "చాలఁగ గావ్యముల్ మిగుల ♦ శ్రావ్యతరంబుగ వ్రాయనేర్చినన్
బాలశశాంకమౌళియును ♦ పంకజనాభులఁగూర్చి సత్కృపా
లీలపరిశంసలన్ విడచి ♦ లేశముభక్తియులేక మూఢులై
పేర్మిలులైయనర్హమగు ♦ వెఱ్ఱికవిత్వముఁజెప్పఁబాడియే."

ఏదియెట్లున్నను ఒకగ్రంథములోని గుణదోషములను లెక్కించుటకు కాలముకంటెయెక్కువ విమర్శకుఁడుండబోడు. "The Test of Greatness is the page of History" అనియొకయాంగ్లకవీశ్వరుఁడు వ్రాసినుడు వెంతయునుసత్యము. పైసందియమునకు కూడ సరియగుసమాధానమిచ్చును.

ఈకవిగారు, ఇదివరలో "దివాంధము, పాండురంగ శతకము" మొదలైన పద్యప్రబంధములురచియించి యాంధ్ర మహాజనులమన్ననలకు పాత్రులయినారు. ఈయనకు రచనా పాటవముసహజముగాగలదు. శబ్దపరిచితియందు మేటి, కవిత్వములలితపదభూయిష్టమై, ధారాళమై, మృదుమధురశైలి

నొప్పుచున్నయది, లాక్షిణికులమతమున, దృశ్యాదృశ్యముగా వ్యాకరణలోపములెందేని గానపడినను, రసనాస్ఫూర్తి ప్రౌఢకవి రచనాసామర్థ్యమునకేమాత్రమును దీసిపోవుటలేదు. శైలి "గంగాలహరివలేనవిచ్ఛిన్నముగా ప్రవహించుచున్న"దని యిదివరలో మామిత్రులగు కురుగంటి సీతారామయ్య **M. A** గారు సెలవిచ్చినదెంతయు సమంజసమేగాక, వారిజోస్యము "కవిగారుప్రయత్నించుచో విపులమగు పౌరాణికగ్రంథమును రచియింపసమర్థులనితోచుచున్నది.. భోజరాజీయాదులబోలి యున్నది" నేటికిరుజువయినదని చెప్పుటకెంతయు సాహసించుచున్నాడను.

మరియు నిప్రబంధరాజము ప్రాచీన ప్రబంధ కవుల పోకడలననుకరించుచు, రగడలతోను, స్తవరాజములతోను దండకములతోను, కమ్మనిసీసపద్యములతోను మాటిమాటికి రసముప్పతిల్లుచు, సరసపదగంభీరమై, గంభీర వృత్తబాధురమై, నూతనభావాన్వితమై, ఝురీవేగతుల్యమగు ధారతో నెంతయు గ్రాలుచురమ్యముగానున్నది. సీసపద్యములన్నినో మంచియమకముగలిగి, శైలిమృదుమధురము, సందర్భోచితమగు రసస్ఫూర్తిగలిగి, అంత్యప్రాసనియమములతో, ముక్తపదగ్రస్తములతో నొప్పారుటయేగాక యేపద్యమెన్నిసారులు చదివినను మరలనొక్కమారు చదువుదమన్నయభిలాషను

కలిగించును, నూత్నాయానందమును, నూత్నశోభను వెల్లి
విరియుచున్నది.

ఈప్రబంధములో కావ్యమునకు వలయుగుణసంపత్తి పూర్తిగాగలదు. పురవర్ణన, సంభోగవర్ణన, యుద్ధవర్ణన, భక్తి వర్ణన మొదలైవర్ణనలన్నియు నుండుటవలన, యొకప్రౌఢకావ్యమైయున్నది. ఇందలి యితివృత్తము సర్వజనవిదితమగుట వలన పునరుక్తిదోషము లేకుపోను. కొలదిమార్పులున్ననుసమంజసమే. మరియునిందలిపద్యములగమనిక, యందచందములు పరిశీలించినయెడల నీతఁడాంధ్రవాఙ్మయమున నష్టదిగ్గజములని పేర్కొనబడిన, పెద్దనతిమ్మన, రామకృష్ణుఁడు, రామరాజభూషణుఁడు, ధూర్జటి, రామభద్రుఁడు, మొదలైన కవిరాజుల కావ్యముల బాగుగా చదువుకొని, వారియూహల బెక్కింటిని, తనబొజ్జయందిముడ్చుకొనియీగ్రంథమునురచియించి నాడాయనునట్లు, చదివినకొలదిరసమూరుచు, వారిపోకడలను పెక్కుచోట్లపోలియున్నది. మరియు నీకవికి భక్తాగ్రేసరుఁడగు పోతనయందు భక్తియపారము, పోతనానుకరణములు పెక్కులీ ప్రబంధరాజమునందు జూపియున్నారు. వానిలోగొన్నిటి బరిశీలింతము:—

సీ॥ మందారమకరంద మాధుర్యమునఁదేలు ♦ మధుపంబువోవునె మదనములకు
నిర్మలమందాకినీవీచికలఁదూఁగు ♦ రాయంచ సనునె తరంగిణులకు
లలితరసాలపల్లవఖాదియైచొక్కు ♦ కోయిల సేరునె కుటజములకు

బూర్ణేందుచంద్రికాస్ఫురితచకోరకం ♦ బరుగునే సాంద్రనీహారములకు
గీ॥ నంబుజోదరదివ్యపాదారవింద ♦ చింతనామృతపానవిశేషమత్త
చిత్తమేరీతినితరంబుఁజేరనేర్చు ♦ వినుతగుణశీలమాటలు వేయునేల.

(పోతన)

సీ॥ విమలమానసరోవిహారణంబులఁగోరు ♦ మదహంసచేరునే మడుగులకును
ఘనమేఘములనీరుఁగాంక్షించుచాతకం ♦ బరుగునే క్షారవహావారిఁగోరి
నరవిందమకరందమాసించురోలంబ ♦ మిక్షురసంబునైనిచ్చఁగొనునె
మాకందఫలములమాధుర్యముంజొక్కు ♦ రాచిల్క పెనువేపరసముగొనునె
గీ॥ పద్మదళనేత్ర! భవదీయపాదపద్మ♦చింతనమునందుఁజొక్కిచిత్తము ను
జేరనెంచునెనిత్య సుస్థిరతనొందఁ♦భక్తమందార! గోవింద! పరమపురుష.

(ఆంజనేయకవి)

సీ॥ వీఁడటే రక్కసివిగతజీవఁగఁజన్నుఁ ♦ బాలుద్రావిన మేటిబాలకుండు
వీఁడటేనందుని వెలఁదికిజగమెల్ల ♦ ముఖమందుఁజూపినముద్దులాడు
వీఁడటేమందలో వెన్నలుదొంగిలి ♦ దర్పించి మెక్కినదాఁపకీడు
వీఁడటే యెలయించి వ్రేతలమానంబు ♦ సూరలాడినలోకసుందరుండు
గీ॥ వీఁడులేకున్న పురమటవీస్థలంబు ♦ వీనిబొందనిజన్మంబువిగతఫలము
వీనిఁబలుకనివచనంబువిహగరుతము♦ వీనిఁజూడచూడ్కులువృథలువృథలు.

(పోతన)

సీ॥ పసిబాలుఁడైయుండి బండిరాకాసుని నీడ్చితన్నిన నాతఁడితఁడుకాఁడె
కాళీయఫణిఁగాలఁ గజ్జెలందెలు మ్రోయ నృత్యమాడినయాతఁడితఁడుకాఁడె
వ్రేతలఁజిత్తముల్ ప్రీతితోహరియించి నేనుగాననునాతఁ డితఁడుకాఁడె
గోగోపకులఁబ్రోవ గోవర్ధనము వ్రేలనెత్తిన మహనీయుఁడితఁడుకాఁడె

గీ॥ బ్రహ్మవిద్యకునిమ్మైటి పట్టుఁగొమ్మ నిఖిలపురుషార్థహేతువై నెగడునితని
మగనిఁగాఁగోరు రుక్మిణీమగువనోము ఫలమువర్ణింపఁదరమా నెబ్రహ్మకైన.

(ఆంజనేయకవి)

సీ॥ బొమ్మపెండ్లిండ్లకుఁ బోనొల్లనుబాల రణరంగమునకెట్లు రాఁదలంచె
మగవారిఁగనినఁదా మఱుఁగుఁజేరెడునింతి పగవారిఁ గెల్వనే పగిదిఁజూచెఁ
బసిఁడియుయ్యెలలెక్క భయమందుభీరువు ఖగపతిస్కంధ మేకడిది నెక్కె
సఖులకోలాహల స్వనములోర్వనికన్య పటుహభాంకృతులకెబ్బంగినోర్చె
గీ॥ నీలకంఠములకు నృత్యంబుఁ జెప్పుచు నలసితలఁగిపోవు నలరుఁబోడి
యేవిధముననుండె నెలమి నాలీఢాది మానమునను రిపుల మానమడప.

(పోతన)

సీ॥ అక్కజంబుగపాన్పు నెక్కనేరనిబాల యీఁకప్పురపుదిప్పలెట్టులెక్కె
విరిదిగెసోకిన వెరపునొందెడికన్య మీరియీపొదరిండ్ల దూరెనెటుల
వీణవాయింపంగ వినలేనిసుకుమారి శుకపికరవములేచొప్పువినెనొ
వింజామరముగీవ విసుగునొందెడిలేమ రోఁగిలిసుడిగాడ్పు కెటులనిలచె
గీ॥ పిల్లలాటలఁద్రవ్విన పిల్లకాల్వదాట వెరగొందుచుండెడి తలిరుబోణి
మేటిగాజంగిపూనీటి యేటికాల్వదాటునోయెను చిత్రంబుబోటులార.

(ఆంజనేయకవి)

సీ॥ కంజాక్షునకుగాని కాయంబు కాయమే పవనగుంఫితచర్మభస్త్రిగాక
వైకుంఠుఁబొగడని వక్త్రంబువక్త్రమే ఢమఢమధ్వనితోడి ఢక్కగాక
హరిపూజనములేనిహస్తంబు హస్తమే తరుశాఖనిర్మిత దర్విగాక
కమలేశుఁజూడని కన్నులుకన్నులే తనుకుడ్యజాలరంధ్రములుగాక
గీ॥ చక్రిచింతలేని జన్మంబుజన్మమే తరళిసలిలబుద్బుదంబుగాక
విష్ణుభక్తిలేనివిబుధుండు విబుధుఁడే పాదయూగముతోడిపశువుగాక.

(పోతన)

సీ॥ శ్రీకృష్ణముఖపద్మ సీమఁ జూడఁగలేని నయనోత్పలంబులే నయముఁ గాంచు
యదువంశరుచిర కరాలంబనము లేక హస్తాంబుజాతమే హాయిఁ గనును
మధుసూదనుని పేర్మి మధురవాహిని లేక గాఢతాపాగ్నియే కరణిసడఁగు
కాళింగమథనసంగతి లేక నాకును సౌభాగ్యబ్ధినిండేలు సరణియెట్లు
గీ॥ భూసురోత్తమ! నీవేగి పురుషసింహు భువన మోహను సురవర్యు బూతచరితు
నాత్మఁ దోపఁగ నేఁ బడునట్టి గతులు విన్నవింపుము బుద్ధిసంపన్న నీవు

(ఆంజనేయకవి)

సీ॥ తరుణార్కకబళనోద్ధతిఁ జూపె నెవ్వాఁ డురుచులచే ఫలమోహరుచులచేత
నకలంకరామముద్రికఁ బూనె నెవ్వాఁడు శయముచే హృత్కుశేశయము చేత
మున్నీరు పల్వలంబుగ దాఁటె నెవ్వాఁడు జవముచే గుణగణార్ణవము చేత
నక్షశిక్షాప్రౌఢి నలరారె నెవ్వాఁడు రణముఁ జేనియమధారణము చేత
గీ॥ ధరణి నెవ్వాఁడు దానవద్విరదదళన విహృతిఁ దనకేసరికి శౌర్యవృత్తిఁ దెలిపె
నతనిమతాౄవ్యభవ్యవాగమృతఘుటనమంజులస్వామి హనుమంతు మదిఁ దలంతు

వసుచరిత్ర (రామరాజభూషణుఁడు)

సీ॥ రామనామాంకిత రమణీయముద్రిక జనకజ కిచ్చెనే సత్వశాలి
భూజాత వరశిరోభూషణంబును దెచ్చి రఘుపతికొసఁగెనే రమ్యమూర్తి
అనిలోనమూర్ఛిల్లి నట్టి లక్ష్మణుఁ గూర్చి తెచ్చెనోషధుల నేదివ్యతేజి
పంక్తికంఠునియుఁ బట్టి యురస్థలిఁ బట్రగుద్ది మెఱసనే బల్లిదుండు
గీ॥ నట్టి బలవంతు హనుమంతు నరికృతాంతు భక్తినుతియింతు నిరతంబు భవ్యచరితు
రక్షఁ జేయుత శ్రీరాజరాజవర్య రమ్యగుణధాము నరసింగరాయనృపుని.

(ఆంజనేయకవి)

శా॥ అంధుండెక్కడ చంద్రుఁ డెక్కడ తదీ ♦ యంబైన యావర్ణ నా
బంధం బెక్కడ నిట్టి చింతగలదే ♦ భావింప నెచ్చోటనై
నం ధాత్రిం దుర్గిందు మాకు నిర్వారకు నం♦ దంబొప్పనవ్యోత్స్న హ్మా

త్సంధానంబగునంచు సేతునిటులన్ ♦ జర్చింపవేరున్నదే!

(బిల్హణీయము)

మ॥ హరిణాంబాకమలాక్షి నేత్రముల సా♦మ్యంబందఁగా లేక దు
ష్కరమై వెల్గు వనప్రదేశముల ని ♦ చ్ఛారీతిగాఁ జొచ్చియున్
దిరుగంజాలక యాసుధాకరుని బొం ♦ దెన్ గానిలేకున్న నా
హరిణంబెక్కడ చంద్రుడెక్కడ ♦ తదీయాంకుండు వాఁడెట్లగున్.

(ఆంజనేయకవి)

మరియు నిట్టివి పెక్కులుఁగలవు. ఈప్రబంధమునందలి పద్యములు చదివినకొలఁదియువిసుగుజనించక భావబంధురములై రసభరితములై చదువరలకు మిగులనానందమునుసమగూర్చునను మాట లతిశయోక్తి కానేరదు. మచ్చునకై కొన్నిపద్యములీ క్రిందపేర్కొనబడినవి రసగ్రహణపారీణులగు సరసకవిరాజుల కు నీప్రబంధరాజము కావ్యదృష్టితో బరికించినయడల నవీనాంధ్రవాఙ్మయచరిత్రలో నేస్థానము నీయదగునో విజ్ఞులగు బుధజనులకే వదలి వేసెదను.

(I) ఉ॥ గొల్లలయిండ్లఁబాల్పెరుగుఁ గొల్లలుగాఁగడుపారఁద్రావిమ
త్తిల్లి......... ............
......... .. ...........త్వాదృశులైన వారికిన్. p. 65

(II) క॥ తగునిది తగదని యెదలో
.................
నిగమార్చితు తోడఁ బోరి ♦ నిలువంగలవే!............ p. 69

(III) సీ॥ చలువపన్నీటిలో స్నానంబుజేయవు
గంధంబుఁబూయవు ♦ గడుసుదనమొ

.................... ...............

మమ్మనిటుఁజూచిభాషించు ♦ మంజువాణి. p. 83

సూర్యాస్తమయవర్ణన.

(iv) గీ॥ పశ్చిమాశాసీమరత్నాల ♦ ఫలకమువ్వ

.......... ...............

అరుణముం జెందెఁబద్మాప్తుఁ ♦ డపరదిశను. p. 84

చంద్రోదయ వర్ణన.

(v) సీ॥ ప్రాచీమహేంద్రసంతసమొంది ♦ పద్మాక్షుఁనింగూర్చి
కంపినరత్నాల ♦ ఫలకమనఁగ

... ..... ... . ... .....

గీ॥ చెలువుమీఁజీనయోగీంద్రి ♦ చిత్తమట్ల
చంద్రబింబంబుఁబొడసూపె ♦ చల్లగాను. p. 85

సూర్యోదయ వర్ణన.

(vi) మ॥ బిసినీకాంతమనోవ్యథల్గలిగి త ♦ ద్భ్రతాహతీచింతనా

. . . . . . .

రసపింధూరపుటుండగాదనరెమా ♦ ర్తాండుండుపూర్వాద్రిపై p. 94

(vii) గీ॥ అబ్జములుఁజేరి భ్రమరము ♦ లలరిమధుర

. . . . . . . . .

ప్రేమయఁదొడఁగెను కుముదముల్ ♦ మొగముమడవ. p. 94

విరహ వర్ణన.

(viii) సీ॥ నిట్టూర్పులెంతయో ♦ నివిడమైజనియింప
హామాధవాకృష్ణ ♦ యంచుబలుక

. . . . . . . . .

గీ॥ దలఁపునిల్చినభీతిచే ♦ తత్తరిల్లు p. 110

(ix) శా॥ బృందారణ్యతరుప్రదేశముల గో ♦ విందుండు సానందుఁడై

. . . . : . . .

విందుల్ గూర్చినమాధవాంఘ్రియుగముల్ ♦ వీక్షింపఁగా నేర్తునే! p106

(x) సీ॥ భృంగంబులన్నియు ♦ సింగమ్ములై దోఁచె

గాలిబాలకునకు ♦ కీలలయ్యె

. . . . , . . . .

గీ॥ భాసురాంగికి శ్రీకృష్ణ ♦ ప్రణయమందు p.111

(xi) మ॥ సనకాదుల్ కనలేని మాధవుహరిన్ ♦ జక్రిన్ ఘనున్ దుర్లభున్

వనితా తెచ్చితి

వనజాక్షుండువరించిచేకొనునుభ ♦ వ్యంబయ్యెనీజన్మమున్ p. 127

(xii) సీ। భువినుండఁగాసిగ్గు ♦ బొందగావలెనంచు

చదలబ్రాకదొడంగె ♦ జంద్రుఁడకట

గీ॥ వనగఁగను పెట్టె ముఖకాంతి ♦ యబ్జనేత్రి

మధ్యమంబును తనులతా ♦ మహితదివ్య

కళలనానాతిగమనసం ♦ గతులుజూడ

సుమములేవెవ్వి పృథ్విలోఁ ♦ జర్చసేయ p. 123

(xiii) ఉ॥ సారసవైరియూథబల ♦ చారుముఖద్యుతిఁబోలు తేజమున్

గోరి............... .....................నీ

తీరుకళంకుఁడైనిశలఁ ♦ దెంపరియై తిరుఁగాడఁజొచ్చెడిన్. p. 122

గీ॥ నందసుతుతోడ శార్ఙ్గంబు ♦ నందకమ్ము

గదయుఁజక్రంబు శంఖంబు ♦ కౌతుకమున

వెంటఁబోవఁగ మింటను ♦ వేల్పులంత

కృష్ణ! తుభ్యంనమోయంచుఁ ♦ గేలుమోడ్చె. p. 153

ఇటుల నెన్నియో పద్యములఁజూపవచ్చును. మరియు నిట్టికృతులసమాదరణ జేసిప్రోత్సహించుభూజానులుపూర్వకాలమునందేమి, వర్తమానమునందేమి కొలదిగానున్నారు. అందువలననే, ఆంధ్రవాఙ్మయమునందేము, ఆంగ్లవాఙ్మయమునందేమి యుద్భవిల్లినకవులు పెక్కురు మిగుల దారిద్ర్యము ననుభవించుచున్నారనుట జగద్విదితము.

ఈకొరంతఁదీర్చుటకోయన, ప్రస్తుతకాలమందు, ఆంధ్రభాషయందపరిమితభక్తిఁగలిగి, చక్కనిసాహిత్యజ్ఞానము స్వయంకృషిచేనలవడఁజేసుకొని, ఆంధ్రజ్ఞానమునభివృద్ధిసేయ సంకల్పించిన నృపపుంగవులలో మిగుల ముఖ్యులు పీఠికాపురి సంస్థానాధీశులొకరు. తరువాత పుయ్యూరు యస్టేటు జమీందారులగు మ॥రా॥శ్రీ మేకా వేంకటాద్రి అప్పారావు బహద్దుర్ జమీందారువారు ప్రశంసనీయులు.

ఇక్కడ నిజాంరాష్ట్రములో నీకృతిసమర్పణపొందిన శ్రీశ్రీలింగన్నపేట భూపాలురగు Sir శ్రీ వేంకటనరసింగరావు దేశాయిగారుకూడ ఆంధ్రభాషయందత్యంతాదరణము గనుపరచి, ఆంధ్రాభ్యుదయమును సదాకాంక్షించుచు దేశభాషలయందు చక్కనిజ్ఞానము సముపార్జించుకొని, పూర్వరాజుల యశోకీర్తులఁబొందుచున్నారని వ్రాయుటకెంతయుసంతసమగుచున్నది. వారివంశానుక్రమణికకవిగారు ప్రథమమున విపులము

గానుమూరు 180 గద్యపద్యములలో నామూలాగ్రముగా వర్ణించి పెద్దనరామరాజభూషణుల పోకడల బోయివున్నారు.

పూర్వకవుల సాంప్రదాయములలో నిట్టికృతిసమర్పణ బొందుట మిగుల శ్రేయస్కరముగాన, నిట్టికృతులఁ బెక్కులు వ్రాయునట్లుగా దమకవిగారికి ప్రోత్సహింపఁగలరనినమ్ముచు శ్రీనరసింగరావు భూపాలునకు నాశీర్వాదములిడుచున్నాడను.

ఈకవిగారురచియించిన "శ్రీరుక్మిణీకళ్యాణ ప్రబంధ రాజము, నవీనాంధ్రచరిత్రములో నొకప్రాముఖ్యస్థానము వహించి, చిరకాలము నాచంద్రార్కగా వర్ధిలుగాతయని యాశీర్వదించుచు కవిగారింకను నెన్నియోవిపులమగు పురాణ గ్రంథములనుకూడరచించి ఆంధ్రభాషాయోషకు కీర్తి తేగల రని నమ్ముచున్నాను.

ఇట్లు,

**298. B. Cement Block**
**Malkpet, Hyderabad**
**Deccan.**

క్రొవ్విడి వేంకటరత్నశర్మ **B.A**

మంగళంమహాశ్రీశ్రీశ్రీ.

**VICE CHANCELLOR ANDHRA UNIVERSITY**

**C. R. REDDY** **WALTAIR.**

**M. A. CANTAB:** *17th Sept: 1938.*

## RUKMINI KALYANAM
## BY
## P. ANJANEYULU NAIDU

Amongst the books written in the old Prabhandha style, the Rukmini Kalyanam of Mr P Anjaneyulu Naidu is entitled to a high rank. The theme is the oft-repeated marriage of Rukmini and in his descriptions he is true to our Prabhandha spirit and has given very fine expression to the usual topics.

The most remarkable thing about the book is that an Andhra of the Nizam's Dominions should have reached such a high standard in scholar ship and in talent for poetical composition I can strongly recommend this book to those who wish to see the classical types of literature continued

One of the vital features of this Rukmini Kalyanam is the note of devotion to God which it strikes so impressively.

I hope the author will be able to deal with more modern themes in due course.

C. R. Reddy.

## Sri Padha Krishnamurthy Sastry. Maha Mahopadhyaya, Kavi Sarva Bhowma, Kala Prapurna and Andhra Vyasa.

శ్రీ ర స్తు.

శ్రీమద్భాగ్యనగరాధి వాసుఁడును, నైజామునర్కారువారి పర్సనల్ టైపిష్టును, నాకుశిష్యప్రాయుఁడునగు చిరంజీవి పంతం ఆంజనేయకవి రచించిన శ్రీకృష్ణలీలాతరంగిణి యందుమూఁడవభాగముగా నెన్నఁబడిన "రుక్మిణీకళ్యాణ" మను గ్రంథమునే నామూలాగ్రముగాఁజదివి యానందించితిని. ఆంజనేయకవి మోక్షసాధని, పాండురంగశతకము, దివాంధములోనగు పెక్కుకృతులురచించి పేరుఁగాంచియున్నవాఁడు. ఈ "రుక్మిణీకళ్యాణము" శ్రీరాజాగోరెంట వేంకటనరసింగరావు సర్దేశాయి లింగన్నపేట సంస్థానాధీశులకంకితము చేయఁబడినది. సర్దేశాయిగారి వంశావతారమతిపవిత్రమై విస్తరించియున్నది. అది మాఆంజనేయకవి మిక్కిలిశ్రమచేసి విపులముగా రసవంతముగా వర్ణించియున్నవాఁడు. గ్రంథరచనయందు "కృత్యాద్యవస్థ" అనుటంబట్టి కృత్యాదియేకష్టతరమని మనవిచేయుచున్నాను.

భాగవతములోనిరుక్మిణీకళ్యాణమునకంటె దీనియందుఁ గొన్నిమనోహరములైన మార్పులుకథకవిరోధముగాఁబ్రస్తుత

కాలానుకూలముగాఁ జేయఁబడినవి. అవిసమంజసములు. ఇందలికవిత్వము నాతికఠినమ్ము సుమధుర శైలిం దగిలి మనోహర మైయున్నది. పద్యములుగాని గద్యములుగాని చదువునప్పుడు కుంటువడక ధారాశుద్ధిగలిగి చదువరులనాకర్షించునదియై యున్నది. దీనింగృతినొందిన సర్దేశాయిగారియశస్సు వారివంశ ప్రతిష్ఠాధికమును రామాయణమున రామునివంశాదికముంబ లె భూమిగలంతకాలము విరాజిల్లుచుండుననియు. సర్దేశాయి గారిట్టి సత్కృతులు పెక్కులుస్వీకరించి కవులనాదరించి భాషా పోషకులై దిగంతవిశ్రాంత యశోవిశాలురై విరాజిల్లుచుందు రు గాకయని కోరుచున్నాను.

ఇందలి శైలిం దెలుపుటకు రెండుపద్యములుదాహరించుచున్నాను

ఉ॥ గొల్లలయిండ్లఁ బాల్వెరుగు ♦ కొల్లలు గాఁగ డు పారఁ దాౘివి మ
త్తిల్లి యరణ్య మందెపుడుఁ ♦ ద్రిమ్మరుచుండెడి గొల్లబోయినిన్
బల్లిదుఁడంచు వీరలిటు ♦ బల్కఁగఁ గర్ణ రసాయనంబుగా
నుల్లమునందుఁ గోరి వినుఁ ♦ డొప్పునె త్వాదృశులైన వారికిన్.

చ॥ అతదురితక్రియా భరతుఁ ♦ డైనమదీయ సహోదరుండు న
న్మతిచెడి చేదిపాలునకు ♦ మానినిఁ గానొనఁగూర్చ నెంచి యా
క్షితిపతిఁ బిల్వనంపె నికఁ ♦ జేయువిధంబది యెట్టులౌనొ, మ
ద్గతియగు వాసుదేవుపద ♦ కంజయుగంబును జూడనొప్పునో.

రాజమహేంద్రవరము
19-3-1937

శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి.

**Baron B. Seshagiri Row,**
**M.A;P.H:D;M.S.A.,**
**Professor, Maharajah's College Vizianagaram**
**13-9-1938.**

శ్రీపంతము ఆంజనేయకవిగారికి,

శే॥ బుర్రా శేషగిరిరావు అనేకఆశీర్వచనములు ॥త॥ మావిజయనగరీయులైన తమరు ఘనతవహించిన శ్రీనిజాం వారి దర్బారులో శ్రీవారిసన్నిధాన వర్తిత్వపు మహోపదవిని తమచాకచక్యముచేతనేగాక గుణాతిశయముచే సంపాదించి యుండుటవిని నేనుచాలాసంతోషించుచున్నాను. అందులోనూ తమరునిత్యహిందూస్తాని భాషామయమగు పరిస్థితులలోనుండియు, నాంధ్రభారతిని కృతిరూపములగు సేవలుచేయగల్గుచుండుట మీతలిదండ్రుల తపఃఫలమనియే నమ్మదగియున్నది. మీరుపంపిన గ్రంథములు చదివితిని. ఇతరగ్రంథములలోని రచనకొన్నివిధములచేతనీ "రుక్మిణీకళ్యాణము" లో పరిణతికి వచ్చుచున్నదని నాకుతోచినది, తమది భక్తిరసప్రధానమైన ప్రకృతిగనుకనే తమకవిత్వములోకూడా భక్తిరసమే ప్రధాన రసముగానున్నది. శృంగారమును భక్తిరసపరిణామముగా వర్ణించుటలోనే జీవితపరమార్థముకలదు. అదియాప్రబంధము ననేచ్చటజూచినను స్ఫురించుచున్నది. కవిత్వమునకు కాంతిగ

లిగించుచున్నది. మీపద్యములు చదువునప్పుడు పూర్వకవిపుంగవులగతులెన్నేని స్ఫురించుచున్నవి. ఇదిమనపూర్వకవులాంధ్రరచనలలో గుణవిశేషముగా నెన్నినయంశము. కవిత్వము తేటగాను, ధారగాను, నాగరికముగాను నడుచుచున్నది. తామిట్లు నిరంతరమును ఉపాసించుచున్న శ్రీభారతీదేవి మీకితోధికభాగ్యభోగ్యములు ప్రసాదించి, తమ యేలికలకు ప్రేమపాత్రనిజేసి యాశీర్వదించునుగాక.

ప్రధానశేఖర బుర్రా శేషగిరిరావు
సాహిత్యోపాధ్యాయుడు.

**K. Seetha Ramiah M. A,**
**Professor Nizam's College.**

అస్మన్మిత్రులగుప్తము ఆంజనేయకవిగారి ప్రేరణముచే నేను నాల్గుమాటలీగ్రంథమునుగూర్చియు. తత్కర్తనుగూర్చియు వ్రాయకతప్పినదిగాదు. నేనుసాధారణముగా ప్రతిగ్రంథముపైనను నభిప్రాయమిచ్చు పెద్దల కోటిలోనివాడను కాను. మరియు నాయభిప్రాయమునుకోరు మామిత్రులగు నీగ్రంథకర్త తప్పలేకపోవుటచే నాకాయనుభవము లేదు.

ఈసందర్భమున నాకు రెండుచిక్కులుకలవు. మొదటిది కవిగారు సమకాలికుడగుట. రెండవదిమిత్రుడగుట. సమకా

లికుడగు కవినిగూర్చిగాని తద్రచితగ్రంథములగూర్చిగాని ప్రశంసానిరసనములు గర్హ శైత్యములకును, మనోవేదనములకును కారణములగును, మరియు, ఇక కవిగారు మిత్రుడైన మోమోటము హెచ్చగుట నతిప్రశంసవిమర్శకుని పెడత్రోవకీడ్చుకొనిపోవచ్చును. నెరసుల బయల్వెట్టుటకుకూడ మోమోటమే యభ్యంతరమగును. పక్షపాతమునకులోనగుట తటస్థించును.

ఈగ్రంథమునుచదివిన నాకానందము కల్గినదని చెప్పి యట్టియానందముకల్గుటకు కారణములను తెల్పిన నాకర్తవ్యము నిర్వర్తితమగునని తలంచుచున్నాను. "కీడెంచి మేలెంచు" మనుసామెతను పురస్కరించుకొని గ్రంథలోపములనుముందుగ్గడింతును. గ్రంథము ప్రబంధ ధోరణిని కలదు. ఇతివృత్తము "చరిత్రచరిత్రాతిచరిత్రము" "భాష" గ్రాంధీకాంధ్రము, వ్యాకరణదోషములా యచ్చటచ్చటగలవు. ఈవిషయములను గూర్చి కొంచము చెప్పవలసియున్నది.

సువస్తువులకు ప్రాతక్రొత్తలులేవు. సూర్యచంద్రులు ప్రాతవారే, రసమునకు ప్రాతక్రొత్త భేదము కాన్పింపదు. "క్షణే క్షణే యన్నవతాముపైతి తదేవరూపం రమణీయతాయాః" అను నలంకారవచన మీవిషయమునే బోధించుచున్నది. సహృ

దయునకు ప్రాతకవి ధోరణియనిగాని, నవ్యకవిధోరణియనిగాని భేదములులేవు గ్రంథమునరసముండుట ముఖ్యవిషయమేగాని ప్రాతప్రబంధధోరణినివ్రాయుట యపకర్ష హేతువుకానేరదు. ఇదియుగాక క్రొత్తప్రాతలు సర్వకాలములందున సమ్మిశ్రితములైయుండును. సాపేక్షములైయుండును. అన్యోన్యాశ్రయము కలవైయుండును. ప్రాతపైనొకవ్యక్తిగాని జాతికిగాని యెప్పుడు సంఘర్షణముగ నసహ్యతకల్గునో యావ్యక్తిగాని జాతిగాని నాశనమునకు దారిపట్టుచున్నవని గ్రహింపవచ్చును. సాధర్మ్య వైధర్మ్యముల నుగ్గడించుటకైనను క్రొత్తతోపాటు ప్రాత కూడనుండవలెను.

ఇకనితివృత్తము, రుక్మిణీకల్యాణకథ, ఆంధ్రదేశమున నన్ని మూలలపురాణరూపమునగాని, హరికథారూపమునగాని భాగవతపఠనరూపమునగాని, కథాగౌరవమునగాని, పాటరూపమునగాని వాడబడుచునేయుండును. ఇటీవల మా హైద్రాబాదు పురమున సన్మిత్రులును నవ్యాంధ్రసాహిత్య ప్రవక్తలునునగు శ్రీతలావఝల శివశంకరశాస్త్రిగారునవ్యాంధ్రకవితాగురువులగు శ్రీరాయప్రోలుసుబ్బారావుగారికి తను ఖండకావ్యకన్యకనొకదానినిచ్చి పరిణయమొనర్చిరి. అందలియితివృత్తము రాధాకృష్ణప్రేమ, నవ్యులలోనవ్యుడగు శ్రీముద్దుకృష్ణగారు

................ ....... సీతారామ రావణవృత్తాంతమునే తమ "యశోకమున" నితివృత్తముగా గ్రహించినారు. కథ ప్రాచీనమను విషయమునకీయుదాహరణములుచాలును. రుక్మిణీకృష్ణులు ప్రకృతిపురుషులు. ప్రకృతిపురుషులయవతారముల నీలోకములో ఽత్ర్యయమున్నంతవరకీ యితివృత్తము ప్రచారములోనుండును. మరియు నిందలినాయకానాయకులు స్వతంత్రముగ నొండొరులను ప్రేమించి పెండ్లిచేసుకొనుటచే "నాధునికుల" కిదిహృదయంగముగనేయుండుననితోచును. అందుచే నితివృత్తమునకెట్టి లోపమువాటిల్లదు. గ్రంధమునందలి నెరసులనుతలంచినపుడు నాకొక్కవిషయము జ్ఞప్తికివచ్చుచున్నది. శ్రీగిడుగు రామమూర్తి పంతులుగారి గ్రంథముల జదివిననిర్దుష్టమని లాక్షణికులచేత చెప్పబడుభాషయందు వ్రాయుటయసంభవమనితోపకమానదు. గొప్పవారనుకొను పండితప్రకాండులవ్రాతలలోని తప్పులనువారు కుప్పలగాచూపియున్నారు. శ్రీవారిభాషాభేషజమును చదివినవెనుక, కీ॥ శే॥ వేదము వెంకట్రాయశాస్త్రిగారు మరలవ్యవహారికాంధ్రవాదముపై కలమెత్తలేదు. ఇట్టిస్థితిలో నీకవిగారు వ్రాసినదానియందు దొసగులుండుట యొకలెక్కగాదు. కవిగారికి ప్రబంధకవిత్వ

ముపై నట్టియభినివేశమో, గ్రాంధికాంధ్రిమముపై నట్టియభి నివేశముండుట గణనీయాంశము.

నాకింకొకవిషయము తోచుచున్నది. గ్రాంధిక వ్యవహారికభాషావాదమున కిచ్చుటతావులేదు. కవిగారిగ్రంథమును సానుభూతితోపరికించి యందున్నవిశేషములను స్పృశించుట నావిధియని తలంచుచున్నాను. సహృదయవిమర్శక కృత్యమ దేయని నామందబుద్ధికి తోచుచున్నది. విమర్శకభృంగము ప్రాతక్రొత్త భేదములేక రసలుబ్ధబుద్ధియైయుండును.

ఈగ్రంథము చదివి నేనందించితిని. దానికి కారణములను కొన్నింటి నిట సంగ్రహముగా వచింతును.

## ఇతివృత్తము.

ఇతివృత్తమున కవిగారు కొన్నిమార్పులనొనర్చి దానికి కొంతనవ్యతయలవరచినారు. భీష్మకరాజు సభలో తనకూతురగురుక్మిణివివాహవిషయమై ప్రసంగించినపుడుమంత్రిలుమొదలగువారురుక్మిభయముచే శ్రీకృష్ణుడు రుక్మిణికితగినవరుండని ధైర్యముతో చెప్పలేకపోయిరి. నిజముచెప్పించుటకు కవిగారొకనూతనవిషయమును సృష్టించినారు. విష్ణుమాయచే నొకపరి

చిత రాజకుమారపాత్రమును సృష్టించి తన్ముఖమునఁనీవిషయ
మును చెప్పించినారు అట్లుచేయుటచే తద్వృత్తాంతమును సభ
లోఁ ప్రవేశ పెట్టుటయేగాక, వృద్ధమంత్రులు మొదలగువారిని
రుక్మి కోపాగ్నినుండి రక్షించినారు. ఇతివృత్తమునందలి యనే
కాలౌకికములైన సన్నివేశములలో నిది యొకటియైనది. ఈమా
ర్పుమిక్కిలి సమంజసముగాను, కథాకల్యనమున కనుకూలము
గాను, యితివృత్తమునకుశోభను తెచ్చునదిగానున్నది. ఇందు
కవిగారిప్రతిభను ప్రశంసింప వలసియున్నది.

రుక్మిణీకృష్ణులప్రేమ వినుకలిపై నాధారపడియున్నట్లు
పురాణప్రసిద్ధము. కేవలము వినుకలిపై నాధారపరచుట కవి
గారికంతగా తృప్తికరముకాదు. వధూవరు లొండొరులను
చూచిప్రేమించునట్టియు, నట్టియవకాశములేనిచో పోటోగ్రా
ఫులనైనచూచి ప్రేమించునట్టియికాలము కవిగారి చిత్తవృ
త్తినెట్లువడలేదో చూడుడు. రుక్మిణిదర్శనవినంబునకు చతుర్వి
నోదమునకై పోయెనట! అచ్చటరాజులందరి చిత్రపటములున్న
వట! అందు శ్రీకృష్ణునిపటముచూచి ముగ్ధయాయెనట! ఇట్లు
చేయుటచేకవి రెండుకార్యములుసాధించినాడు. స్వయంవరము
నకు ప్రత్యామ్నాయము కల్పించుట మొదటిది. వినుకలితోపా
టుకనుకలికకు కూడ కొంతస్థానమిచ్చుట రెండవది. దానింతే

ప్రేమించిన కృష్ణునియాకార చిత్రమైనను చూడగోరుటన్యాయసమ్మతము! నవ్యభావవిలసితము ప్రబోధములలోననుండి, కవికాలాముల తొంగిచూచునను సన్నివేశములిట్టివే! దీనిని కల్పించి యితివృత్తమునకు వన్నెపెట్టినాడుకవి. (1-43)

కవిగారుశిశుపాల పాత్రకలౌకికస్థితికల్పించినారు. పాపైకకర్మునిజేరుక పూర్వజ్ఞానవాసనవానియందుండజేసినారు. నారద శిశుపాలసంవాదముచే, నెప్పుడు శ్రీకృష్ణునిచేతులలో తనకుమరణముప్రాప్తించునా, యెప్పుడు తన నిజరూపమును పొందుదునా, యను జ్ఞానమును ధ్వనిగా శిశుపాలునియందు కల్పించి వానిపాత్రకకవిగారువన్నెవెట్టినారు. ఇచ్చటనాకొక పోలికగానవచ్చుచున్నది. దుర్యోధనునకు విశ్వరూపదర్శనమెట్లు యుద్ధమునకు పురిగొల్పువిషయమయ్యెనో. కర్ణునకెట్లుతన జీవితవృత్తాంత శ్రవణము దుర్యోధనుపక్షముననే యుండవలెనని పేరించెనో,యట్లేనారద జ్ఞానప్రదానము శిశుపాలునియందుకృష్ణవిరోధము నుండి విరమించినట్లుచేయలేదు. ఈసన్నివేశము కావ్యముయొక్క శోభనుపెంపొందుచుచున్నది.

కవిగారిట్టి మార్పులను కొన్నికల్పించి యితివృత్తమున కొంత నవ్యతనాపాదింపజేసి కావ్యమునకు ప్రాశస్త్యమిచ్చిరి.

## రచన

వెనుక 'దివాంధ' రచనాసందర్భముననే వీరికవితా ధారాదులగూర్చి కొంతముచ్చటించితిని మరల నద్దానినిచెప్పుట పునరుక్తియగును.

ఏట్లేట్లోత్తరాభివృద్ధిగావీరికావ్యరచన పెరుగుచున్నదో యట్లె కావ్యగుణములుకూడ నిశితములగుచున్నవనిమాత్రము చెప్పినజాలును.

ఈగ్రంథమునందలి కొన్నిరచనావైశిష్ట్యములజూపెదను.

వీరికందపద్యములయొక్కనడకమిక్కిలి మనోహరముం "కందమును రచియించినవాడేకవి" యనునానుడి యీయనయందన్వర్థము. ఏకందపద్యమునైనను పరికింపుడు. మలచినట్లుండును. కందములందొకనపడు ధారావాహికాగుణము సామాన్యముగానంతట గనపడుచున్నను వీరియందువిస్ఫుటమై స్వచ్ఛందముగ గన్పట్టుచున్నది. ఒక్కపద్యము చాలును. సంచమాంకమున యుద్ధఘట్టమున:—

క॥ ఇరువురుసమబలవిక్రమ
వరులై పోరాడి విశిఖ • వర్షము కురియన్
జరిపిరి వారల నేర్పున
కరుదొందుచుఁజూడఁదొడఁగె • సమరము మింటన్ (5-18)

అని చెప్పియున్నాడు. ఇదేయననేల? కందపద్యములన్నియు నిట్లే

శిశుపాల కృష్ణులకిది తృతీయజన్మమనియు, వెనుకటిది రామరావణజన్మమనియు, వెనుకటి రామరావణసంగ్రామము యొక్క పునరుక్తియే యిప్పటి సంగ్రామమనియు, కవిగారొక పద్యపాదముచే మనకు స్ఫురింపజేసినారు.

"జననాథోత్తమ! రామరావణమహా సంగ్రామమైదో చెడీ"

ఇచ్చట చూచుటకు సామాన్యోపమాలంకారమువలె గన్పట్టినను, నాసంగ్రామమునందలి పాత్రలు ప్రాకృత పురుషులనియు, శాపముననిది తృతీయజన్మమనియు, తెల్పియెట్టులాపూర్వసంగ్రామము లోకభయంకరమయ్యె, లోకక్షేమంకరమో యట్లె యీశిశుపాల శ్రీకృష్ణసంగ్రామము కూడనని కవిగారొక్క పద్యపాదముచే కొండంత యర్థముస్ఫురింపజేయుచున్నారు. రామరావణులెట్లుప్రాకృతపురుషులో యట్లే యిచ్చటనను భావము నిచ్చియుపమయనన్యముగా పరిణమించుచున్నది. ఈపద్యపాదము గ్రంథమునంతకును మకుటమని నాయాశయము.

నర్మోక్తిని చెప్పటలో నీకవిగారికి మంచిప్రజ్ఞయున్నదనియు నోరుతెరచినవ్వించక చిరునగవు పుట్టించుటలో కవి

గారు సామర్థ్యముకలవారనియు నీక్రింది పద్యమువలన తేట పడగలదు. రుక్మిగర్వభంగమైనపిదప బలరాముడు కృష్ణునితో నిట్లనుచున్నాడు.

క॥ పగచెలిమియునీకిలలో
నగధర! సమమయ్యునిటుల ♦ న్యాయమెనీవుఁ
దగురీతి రుక్మినుపక
పగపొందఁగఁజేయఁదగునె ♦ వారిజనాభా!

కృష్ణునిగుణవర్ణనమును రుక్మిపరాభవమును ప్రక్క ప్రక్కలనుంచిచెప్పి బావమరదికైనపరాభవమున గల్గినసిగ్గును, నుడుకును, మాటలరెట్టించినాడు. ఇట్లునర్మగర్భముగా చెప్పిన సన్నివేశములనేకములీ గ్రంథమునగలవు.

ఇఁకనొక్కవిషయము చెప్పివిరమింతును. ఈగ్రంథము వాయువిమానములు ప్రచారములోనున్నకాలమున రచియింపబడినట్లంత సాక్ష్యము తెల్పుచున్నది. వార్తాపత్రికలలోవిమానములలోనే నూతన వధూవరులు నూతనవివాహానంతర విహారమునకు ............ వెడలినట్లు మనమెన్నోవార్తలను చదువుచున్నాము తుదకు పెండ్లిండ్లుకూడ విమానములోనే జరిగినవని కూడచదివినట్లునాకుజ్ఞాపకమున్నది. కవిగారుకూడ రుక్మిణీకృష్ణులను విమానమున (గరుడునిపై) సురలోకమున

కంపినారు నూతనవధువునకు భర్తతనగొప్పతనమును చూపుటసహజముగాన భార్యకు భర్తృగౌరతము హెచ్చిప్రేమయభివృద్ధియగును. శ్రీకృష్ణుడు స్వర్గమునకు వెడలియింద్రునిచే నూడిగములనందియనేక దృశ్యములు భార్యకు జూపి ముదము గొల్పినాడు. ఈకాలమునుబట్టి యిదియెంతయు సమంజసము గాను హృదయంగమముగానున్నది.

ఇట్లు గ్రంథపఠనముచే నాకుగల్గిన యానందమునకు కారణములు తెల్పితిని పైమాటలు కేవలము మైత్రి పరిణామము లనితలవకుందురుగాక! కవిగారింక నింతకంటె యుద్ధగ్రంథములను రచియించి, వినిపించి, యాంధ్రవాఙ్మయమునచిరస్థాయియైనస్థలమును పొందుదురుగాకయని యాశించుచున్నాను.

ఇట్లు,

3-9-1938. ఆచార్య కురుగంటి సీతారామయ్య.

**S. Prathapa Reddy B. A. B. L.**
**High Court Vakil. Troop Bazar.**
**Hyderabad Deccan.**

శ్రీయుతపంతము ఆంజనేయులునాయుడుగారి రుక్మిణీ కళ్యాణమను పద్యకావ్యమును చదివినాను. నాయుడుగారిది వరకే రెండు మూడు గ్రంథములుప్రకటించి తద్వారా అనేక

లకు పరిచితులైనారు. వారిపాండురంగశతకమును జదివినవారు వారియందు దైవభక్తి ప్రధానలక్షణమని గమనించియుండక పోరు వారికవితను అనేక కవులు ప్రశంసించియున్నారు.

ఈరుక్మిణీకళ్యాణము మధ్యయుగ కవుల ప్రబంధపద్ధతులను సంపూర్ణముగా అనుసరించినట్టిది. ఈప్రబంధములోని ఘట్టములు, వర్ణనములు కవితాపద్ధతి అన్నియు అప్పకావ్యానుమతములే, కథలో భాగవతకథకు భిన్నముగా ఒండు రెండు తావులకొలది మార్పులు చేసియున్నారు. అవిపౌరాణిక మూల కథకు బాధకములు గావు.

ఆంజనేయులునాయుడుగారి కవిత మంచిధారతోను నడకతోనుకూడినట్టిది గావ్యక్తమగుచున్నది ప్రభుత్వోద్యోగమందుండియు నీనిజాంగాష్ట్రములో వీరింతమంచి కవితను అలవడజేసుకొన్నందులకు ప్రశంసనీయులనకతప్పదు. వీరికి ఇతోధికాభివృద్ధిని సర్వదాకోరుచుందును.

బహుధాన్య జేష్ట శు ౨. సురవరము ప్రతాపరెడ్డి.

**M. Hanunanthrao High Court Vakil,**
**Andhra Kutir, Sultan Bazaar, Hyderabad-Dn:**

మ. రా. రాజశ్రీ పంతము ఆంజనేయులునాయఁడుగారికి,

తమరుదయతో పంపిన రుక్మిణీకళ్యాణమును చదివితిని, ఇట్టిసద్గ్రంథరచనమునకు తమనభినందించుచున్నాను. ఆంధ్ర కవిత్వమున ఖ్యాతివహించుచున్న తమరు, ముఖ్యముగా భాషా విషయములందు వెనుకబడియున్న ఈప్రాంతములవారగు తమరు, ఎంతయుప్రశంసనీయులు. ఇట్టికావ్యములను నన్యపద్ధతిపైన నెక్కువగారచించి మాతృభాషా సతికలంకారములుగా నర్పింతురని? నేను ఉవ్విళులూరుచున్నాను.

ఇట్లు,

మాడపాటి హనుమంతరావు.

Re No. 1 En: 1
22-12-1938

**Vuyyur Estate Zamindar's**
**Huzur Office, NUZVID.**
**Dated 22nd Dec:1938.**

From,

**Tahavar-O-Jaladat-Dastagha, Manne Sultan,**
**Sri Rajah Venkatadri Apparow Bahadur Garu,**
**Zamindar, Yuyyur Estate and Trustee,**
**S. R. R. High School, Nuzvid.**

**TO,**

*M. R. Ry,*
*P. Anjaneyulu Naidu Garu,*
*Personal Typist,*
*King Kothi Palace,*
*Hyderabad Deccan.*

Sir,

మీరు తే॥ 6-9-38 ది, లెటరు ద్వారా పంపించిన మీచే రచించబడిన "రుక్మిణీ కళ్యాణము" మా యస్టేటు ఆస్థాన విద్వాంసుగారు చూచినారు. అభిప్రాయమింముతో పంపించినాము

ఆంతర్యమునకు సేవకుడను

**A. Laksminarasiah,**
*for* **Zamindar.**

శ్రీశోభనాద్రి లక్ష్మీనృసింహస్వామినే నమః

శ్లో॥ శ్రీరమా ముఖపద్మార్క - శ్రితబృంద సురద్రుమః
సతతం మంగళం కుర్యాత్ - ఆంజనేయ కవేర్ముదా.

శ్రీపంతము ఆంజనేయకవివరకృత రుక్మిణీ కల్యాణ మామూలగ్రంథాకం. ఇదమత్యంత మధురకోమల మనోహరపదావళీలలితం. ఇక్షుఖండవద్రస సంపూర్ణం, పారక మన స్సమాకర్షణచతుర చతురపదగతి విశేషం, తత్తత్ స్థాన నివేశిత రసచాతురీ సముచిత వర్ణనావిశేష బహుళం, మల్లికామతల్లికా కుసుమచర్చికా రచితమాలికా రాజమిన సంతతామోద సంధాయకం, జయదేవాది మహాకవి వర విరచిత శృంగారరస విలసిత గీతగోవింద మహాకావ్యాదిష్వివ, భక్తిరస సంపూరితం, నిరంతర హరిపదసరసిజ యుగళభక్తి రసాస్వాదన చతురహృదయ సత్కవిమానస సరోజరాజ హంసాయితం, కింబహునా, సకలకల్యాణ గుణగణ విరాజితం సత్ విరాజతే. ఏతత్సకల శుభప్రద గ్రంథరచయితు శ్శ్రీరా జ్యలక్ష్మీసహిత శ్శుభగిరీంద్ర హర్మ్యాంతరస్థితః శ్రీవ్యాఘ్ర నృసింహః, ఇతోధిక గ్రంథరచనా చాతురీం మేధాం, దీర్ఘాయురభివృద్ధ్యాది సకలమనోభీష్ట సిద్ధించ, దత్వాలవతు ఇదంగ్రంథరత్న మహ్యాచంద్రతారం, జగత్ప్రసిద్ధం భూయాత్.

4-11-1938. బొమ్మకంటి వీరరాఘవాచార్యః.

Nuzvid శ్రీఉయ్యూరు యస్టేటు ఆస్థాన విద్వాన్.

శ్రీరామచన్ద్రపరబ్రహ్మణేనమః

# రుక్మిణీకల్యాణము.



రంజిల్లఁగ వామపార్శ్వమున శ్రీ
సీతామహాదేవి శృం
గారంబొప్పఁగ లక్ష్మణానుజులు ప్ర
క్కం జేర వాతాత్మజుం
డారాధింప వెలుంగు రాఘవుఁడు ని
త్యశ్రీలవర్ధిల్ల పెం
పారన్ వేంకట నారసింగనృప తా
రాధీశు రక్షించుతన్. 1.

చ॥ హరుఁడుపరాత్పరుండునిఖి ♦ లాగమసన్నుతసాంబమూర్తి సు
స్థిరతరయోగమార్గమున ♦ సేవలొనర్చెడి భక్తకోటికిన్
వరములొసంగ నద్రిపయి ♦ వాసముఁజేసెడినాదిమూర్తి శ్రీ
పరమశివుండు ప్రోచుతఁ గృ ♦ పామతి వేంకటనారసింహునిన్

ఉ॥ సృష్టియుపంకజాతముచేఁ ♦ బొల్పుగ శ్రీహరి యాజ్ఞభక్తిఁ జేఁ
బట్టియు సర్వలోకములు ♦ భవ్యతఁబుట్టఁగ దావిధించి బ

ల్కట్టడిమీఱకుండఁగొలి ♦ కర్మలలాటమునందుఁగూర్చి తా
బట్టుగ వ్రాయుధాతముఁరి ♦ పంబునఁ బ్రోచుత నారసింహునిన్

గీ॥ పలుకులవెలంది సిరియును ♦ పార్వతియును
ముప్పురును గూడి నిరతంబు ♦ మోదమలర
ననఘు పాతూరి రామకృ ♦ ష్ణాఖ్య నృపుని
తనయుఁ బ్రోచుత నరసింగ ♦ ధరణివిభుని.

సీ॥ రామునామాంకిత ♦ రమణీయముద్రిక
జనకజకిచ్చెనే ♦ సత్వశాలి
భూజాత వరశిరో ♦ భూషణంబును దెచ్చి
రఘుపతికొసఁగనే ♦ రమ్యమూర్తి
అనిలోన మూర్ఛిల్ల ♦ నట్టి లక్ష్మణుఁ గూర్చి
తెచ్చెనోషధుల నే ♦ దివ్యతేజి
పంక్తికంఠుని యనిఁ ♦ బట్టి యురస్థలిఁ
బడఁ గుద్ది మెఱసెనే ♦ బల్లిదుండు

గీ॥ నట్టిబలవంతు హనుమంతు ♦ నచకృతాంతు
భక్తినుతియింతు నిరతంబు ♦ భవ్యచరితు
రక్షఁ జేయుత శ్రీరాజ ♦ రాజవశ్య
రమ్యగుణధాము నరసింగ ♦ రాయనృపుని.

ఉ॥ శంభుజటాటవిన్ వెడలి ♦ జానుగరమ్యతరంగభంగ సం

రంభముతోఁ ఘుతఁ దొరలి ♦ రంజిలఁ గాఁ జెడి వాహినీసము
జ్జృంభణరీతి మత్కృతి విడిఁ ♦ జెన్నువహింపఁగఁ జేఁగదమ్మ 'వా
గ్జృంభణముం దనరఁ నిలచి ♦ శ్రీకర మొప్పఁ గదంబ 'భారతీ.

ఉ॥ నన్నయతిక్కనాది కవి ♦ నాయకులభాస్కరసోమనాథులన్
మన్ననతోడ నెంచెదను ♦ మాన్యులనాదగుమానసంబునన్
సన్నుతపోతనార్యు నెద ♦ సారసయుగ్మము నే భజించి వి
ద్వన్నుతమైనరామచరి ♦ తంబున కేనతిభక్తిమ్రొక్కెదన్

ఉ॥ ఒప్పుగుసత్కవిత్వమున ♦ నోఁపమినింద్యము సేయ నెంచునా
తప్పుడువారి నెన్నఁగదుఁ ♦ దెప్పదిసూరిజనాళి కిమ్మహిన్
దప్పులనోర్పులారయక ♦ తామసతర్కము సేయ నెంత్రహో
ముప్పగువారిచింతనము ♦ మోదవిహీనులుగా రెచూడఁగన్

ఉ॥ చాలగ గావ్యముల్ మిగుల శ్రావ్యతరంబుగ వ్రాయనేర్చిన
బాలశశాంకమౌళి యజు ♦ పంకజనాభులఁ గూర్చిసత్కథా
లీలపరిశంశలన్ విడచి ♦ లేశముభక్తియు లేక మూఢులై
ప్రేలఱులైయనర్థమగు ♦ వెఱ్ఱికవిత్వముఁ జెప్పఁ గాఁడివో.

చ॥ స్థిరమతి మాధవాంఘ్రిపద ♦ చింతనఁ గల్గెడి మేలుసత్కృతుల్
సరసత వ్రాయునప్పుడు దొ ♦ సంగులు కొండొకయున్న నేమి శ్రీ
హరికరుణాకటాక్షమున ♦ నన్నియుఁ జాల గుణంబులై చనున్
జెఱకునవంకరున్న నది ♦ చేదు ఘటించునె యెన్నఁ జేనియున్,

మ॥ ఇలసర్వాత్మకుఁడాదిదేవుఁడురమా ♦ ధీశుండుఁగాఁ జెందినే
నెలమిన్ నేర్చినభంగిఁబల్కితిశుభం ♦ బీకృష్ణచారిత్రముల్
బలుమారిందుఁ దప్పులేగలిగినన్ ♦ బాటింపకే భక్తితోఁ
దిలకింపంగఁదలంపుఁ జేతురుఁగదా ♦ ధీశాలులున్ సత్కవుల్

క॥ వరతిరుమల వేంకటనర
హరినిగురుని భవహరుని మ ♦ దాత్మను నెపుడున్
స్థిరతరముగ నను దినమును
బరమార్థము గోరకుఁదలఁతు ♦ భక్త్యనురక్తిన్. 12.

—: అస్మద్వంశానుక్రమణిక :—

ఉ॥ చింతలువీడి సంగరమె ♦ జీవనమంచు దలంచువారు భూ
కాంతను నీరధిన్ గలపు ♦ నంతటిసాహసమూర్తులైన ధీ
మంతులు బుద్ధిమంతులు స ♦ మానులు వీరికి వేరు లేరనన్
బంతమువారునాఁబరగి ♦ పంతమునిల్పఁదొడంగి రెంతయున్.

గీ॥ తెలఁగ వంశంబునందునఁ ♦ దెలుగునాడ
సద్గుణుండగు జోగయ్య ♦ జననమొంది
జగతిఁ జేఁబట్టె గుణధన్య ♦ జగ్గమాంబ
బరగి వీరలు గదుఁ బ్రేమఁ ♦ బ్రబలుచుండ. 14

క॥ చెలువుగ వీరిలకంతట
సులలితగతి నలువురాత్మ ♦ జులుఁగల్గిరిలన్
దొలిఁ బ్రదేశన్ దశరథునకు
జలజాక్షుఁడు నల్వురయ్యు ♦ జన్మించుగతిన్. 15

గీ॥ రామచంద్రుండు సరిఁబోల్ప ♦ రామనృపుఁడె
లక్ష్మణాఖ్యుఁడు నూడనా ♦ లక్ష్మణుండె
వేంకనార్యుఁడు సప్తాద్రి ♦ వేల్పుసముఁడె
గోపనామాత్యుఁడాయదు ♦ గోపసముఁడె. 16

క॥ అనలువుర లోపలఁ గడు
జ్ఞానాధికుఁడయ్యు సుజన ♦ గణసన్నుతుఁడై
మానుగ గోపన్నాఖ్యను
మానితసచ్చరితుఁడగుచు ♦ మహిలో వెలసెన్. 17

గీ॥ అంత గోపనార్యుఁ డనవ ♦ ద్యగుణ జోగ
మాంబఁబెండ్లియాడి ముగురు ♦ నాత్మజలును
సుతుని ననునొక్కనింగాంచి ♦ శోభఁగనిరి,
ఆంజనేయులు నావెల్గు ♦ దవనిలోన. 18

సీ॥ చిత్తంబు శ్రీరామ ♦ చింతనంబులయందుఁ
జూపు శ్రీరఘువీరుఁ ♦ జూచుటందు
పాదముల్ శ్రీశు దే ♦ వళముఁ జేరుటయందు

చేతులు హరిపూజ ♦ జేయుటందు
శిరములంకాధీశ ♦ హరనమస్కృతులందు
వీనులుహరికథ ♦ ల్వినుటయందు
భాషణంబులుసత్య ♦ భాషావ్రతంబందు
గాయంబురామకైం ♦ కర్యమందు

గీ॥ సంతతమునిల్పి నిరతంబు ♦ శాంతమతిని
గాలమునుఁబుచ్చి సౌమ్యులై ♦ ఘనతగాంచి
నట్టి తలిదండ్రులగు జోగ ♦ నాంబగోప
నార్యవర్యుల మునుముందు ♦ నాత్మఁదలఁతు. 19

క॥ పొసగ వీరలు చేసిన ♦ పుణ్యఫలతి
గాక యబ్బునె నాకునీ ♦ కావ్యరచన
వందనమ్ములఁ జేసెదా ♦ నందమునను
జనని జనకుల పదపంక ♦ జములకెప్రుడు 20

మ॥ హనుమద్దేవ వరప్రసాదముననా ♦ మత్యంతమాప్రేమతో
ఘనులౌనాతలిదండ్రులెంతయునమన్ గర్భంబునన్ బొందనే
జననంబొందియు భక్తిపావనికిదా ♦ సత్వమ్మునం జేసియీ
ఘనకావ్యాదిరసజ్ఞతన్ నడసినేఁ ♦ గావ్యాకృతిన్ బల్కితిన్.

వ॥ ఇట్లభీష్టదేవతాగురు చరణారవిందములకు వంద
నంబులాచరించి సుకవిజన బృందంబునుంబొగడి కుకవినిందనం

బుఁజేసియు నస్మద్వంశంబు సంగ్రహంబుగా నెఱింగించి సకల శుభపరంపరాభివృద్ధిఁగా పూర్వాధునిక కవి తల్లజాల కృపా కటాక్షమున శ్రీవాసుదేవ కథావర్ణనంబునకుఁ దొడఁగినవర సాలంకార బంధురంబునగు నొక్క దివ్యచరిత్రంబతి శ్రావ్యముగా రచియింపఁబూనియున్న సమయంబున.

మ॥ ననువాత్సల్యత జెంతకుఁ బిలచి ధ♦న్యంబొప్ప మిత్రుండునున్
ఘనుఁడున్ విద్యల ప్రౌఢశాంతుఁడగు♦ కన్యారెడ్డి మోదంబుతో
అనఘా! యోలవిచార మొందెదవుని ♦ యాంధ్రీకృతంబై నస
జ్జనకర్ణామృత కృష్ణలీల వడయన్ ♦ శక్తుండవు, సర్సింగరా
డ్జననాథుం డువిశారదుండు సుకవీసం♦ స్తూయపాత్రుండిలన్.

మ॥ ననుశ్రీమారుతి దేవపాదభజనా ♦ నందున్ గళాభిజ్ఞ స
ద్వినయున్ నా గలగ్రొత్తు భాగ్యనగరా♦ ధిష్ఠానుగోపార్యనం
దనుఁడై పంతము నాంజనేయుఁగవితా♦ ధారాగరిష్ఠు ప్రియం
బున రావించి సభాస్థలిన్బలికెవి ♦ స్ఫూర్జద్వచోమాధురిన్.

ఉ॥ శ్రీయలరార మాధవుని ♦ చిత్రపుసత్కథలందు రుక్మిణీ
తోయజపత్రనేత్రఁగృప♦తోడుత శ్రీహరి తెచ్చుఁబట్టులన్
శ్రాయనిరక్తి మీకవిత ♦ పద్ధతికిన్ ముదమొందువాఁడ నా
కా యఖిలేశు మాధవుప♦దాంబుజభక్తియు భవ్యమొప్పఁగన్

చ॥ అవిరళపూర్వపుణ్యగతి ♦ నంబుజనేత్రునిదివ్యచింత నా

శ్రవణ సుకీర్తనంబు పద ♦ సారస యుగ్మపుసేవ పూజనం
బు. వినతిమైత్రివందనము ♦ బొల్పుగనాత్మసమర్పణంబునా
నవవిధభక్తిమార్గములు ♦ నామదిరంజిలుచుండు సత్కవీ!

వ॥ కావున రుక్మిణీనాథుండగు శ్రీకృష్ణపరమాత్ముని కథాకర్ణంబు నాకభీష్టంబయ్యెడు, నీవునన్మనోరథానుకూలంబుగా శ్రీమద్భాగవతామ్నాయంబున భాసిల్లెడి దశమస్కంధాంతర్గత వాసుదేవకథాఘట్టంబున రుక్మిణీకళ్యాణంబు జనంబులకుసులభోపాయంబుగా నెఱింగెడి తెలుఁగునఁదెనిఁగించ మని యాధరణ పూర్వకముగాఁ గాంచనరత్న భూషణాంబర చందనతాంబూలంబు లొసంగుటయుదాననేనుసంప్రీతుండనై యేతత్పుణ్యకథావర్ణంబునకుఁబూర్వము, కృతిభర్తయొక్క వంశానుక్రమణికనభివర్ణించెద.

---

శా॥ గోకెటాన్వయపరాజవర్యులకథల్ ♦ కూలంకషంబైనఁద
త్ప్రారంభంబెయు గద్యరూపమున గ ♦ ష్టంబౌచుఘావింపకే
తోరంబొప్పఁగఁ బ్రాసిమత్కృతికిఁ జెంతోసాయముం జేసెఁద
త్పౌరోహిత్యుఁడు వెట్టయార్యుడతనిన్ వర్ణింపఁబుణ్యంబగున్

---



కృతిభర్త: శ్రీ గోరంట వేంకట నరసింగరావు సర్దేశాయి

## కృతిపతివంశావతరణము

---

క॥ గోరంటవంశమందున
మీఱియు రేచర్లగోత్రి ♦ మిహిరాంశుఁడై
ధీరుఁడగు సింగరాడ్వరుఁ
డారయ జన్మించెఁ గాపు ♦ లందునఁ గీర్తిన్. 27

క॥ కాపయు ధర్మగుణంబుల
ప్రాపయు మఱిగోనకాపు ♦ వారలకుం దా
దాపయు జననీజనకులఁ
గాపాడుచునుండె సుజన ♦ గణ్యాత్ముఁడై. 28

చ॥ అనఘుఁడు సింగరాడ్వరుఁడు ♦ దంచితలీలఁ గృషీవలత్వమే
ఘనమని మద్దిపల్లెయను ♦ గ్రామపుఁ బ్రాగ్దిశలో వెలుంగఁ దాఁ
జనియటఁ దల్లిదండ్రులకు ♦ సమ్మద మొందహాలంబుఁ బూనిజీ
వనమున కూతగాఁ గొనుచు ♦ వర్ధిలుచుండె ఫలింపసస్యముల్.

ఉ॥ మాంతుఁ బుత్రికామణిని ♦ మాన్యచరిత్రను వీరమాంబనున్
ఖ్యాతిగఁ దెచ్చి పుత్రునకుఁ ♦ గౌరవనీయులు తల్లిదండ్రులున్
బ్రీతిగఁ బెండ్లిఁ జేయ నతి ♦ ప్రేమను వారుఁ జెలంగుచుండ శ్రీ
కాంతుఁ గృపాకటాక్షమున ♦ గల్గెను పుత్రుఁడు వారికంతటన్.

చ॥ తనయుని గాంచి మోదమున ధన్యులు సింగయ వీరమాంబలున్

బనివడిబంధుజాలమును ♦ బ్రాహ్మణవర్గముఁజేరిభక్తి, భో
జనసుమగంధవస్త్రములఁ ♦ సంతసమొందఁగఁద్రృప్తిఁ జేసియా
తనయుని కప్పుపేరిడిరి ♦ ధన్యత "అడ్డలరెడ్డి" నానిలన్,

చ॥ దినదినవర్ధమానముగ ♦ ధీరుఁడు 'అడ్డలరెడ్డి' భూములన్
బనివడివృద్ధిఁజేసెబళి ♦ పంటలనెక్కుడుగాఁగ నెంతయున్
ధనమునుసేకరించె,తలి ♦ దండ్రులలేమినిఁబాయఁజేయనా
పనులననేకముల్ సుజన ♦ పద్ధతిఁజేయఁదొడంగశాంతుఁడై.

క॥ ధైర్యమునకు గిరివరు గాం
భీర్యమునకు జలధి జనమున ♦ భీముఁడు ఘనసౌం
దర్యమున మరుఁడు పరహిత
కార్యములకునాదధీచిఁ ♦ గాఁబోలుభువిన్. 33

వ॥ ఇట్లాతఁడు భాసమాన తేజోవిలాసుండై దనరార జననీజనకులు పుత్రునకు మాతులపుత్రికయగు లక్ష్మాంబనుఁ దెచ్చి పరిణయంబొనరింప నాసుచిరాంగి శ్వశ్రూగృహంబున వర్ధిల్లుతరి.

చ॥ తనరెడి భర్తృనాజ్ఞజవ ♦ చాటకబంధులఁగాంచి నంత నే
వినయముఁజూపుచున్ సుమతిఁ ♦ బెద్దలుదన్నలరారు ప్రేమతో
గనుచుముదంబుఁజూపనతి ♦ కాంక్షనుపుట్టినమెట్టినింటికిన్
ఘనమగుకీర్తిఁదెచ్చెనిజ ♦ కాపురమందునభాసమానమై.

వ॥ ఇట్లాదంపతు లిరువురు శ్రీహరికరుణాకటాక్షమున సంసారంబెంతయోఁ బచ్చగాదనరఁగాపురంబుఁ జేయుచుండ నొండొకదివసంబున.

సీ॥ అంతట గోల్కొండ ♦ కధిపుండునిజరాజ
ధానిలోఁజేరిన ♦ స్థలములందు
జంతుసంకలితమై ♦ జనుమార్గమును లేక
విపినప్రదేశమై ♦ వెలయుచుండఁ
బ్రజలెవ్వరేనియు ♦ పరిగణంబులగ్రామ
నిర్మాణముం జేయ ♦ నిచ్ఛయున్న
నాదేశములవారి ♦ కధికారమొసఁగియు
భవ్య "జమీందారి" ♦ పదవులొసఁగఁ

గీ॥ దంచు "ఫర్మాను" నలుబ్రక్క ♦ లంపినంత
అడ్డరాడ్వరుఁడదిఁగాంచి ♦ యలరి సుజను
బొప్పనామకహాళిక ♦ భూరిధైర్యుఁ
గొరటుగొల్లవితో భాగ్య ♦ పురికి నేగ. 35

వ॥ ఇట్లుపోగి.

ఉ॥ ధీరులు సన్నుతింపఁగల ♦ దిట్టతనంబున రాజధానిలోఁ
జేరియుతిప్రయాసమున ♦ స్నేహముఁగూర్చుక రాజకీయ "స
ర్దారుల" మెప్పులన్ వడసి ♦ తానటవచ్చిన కారణంబు న

వ్వారికేటుంగఁజేయఁగను ♦ వారపుఁడిట్లుటిగించిరెంతయున్

ఉ॥ ధరవరవంశపావన సు ♦ ధాకర! యిచ్చటి కుత్తరంబునన్
వర లెడి రాచవర్లమను ♦ వన్యప్రదేశమునందుజంతు సం
చరణమెగాని మానవుల ♦ సాధ్యముగాదదిఁగానఁగోరినన్
విరివిగనీకొసంగెదము♦ వేగెమెచూచియురమ్ముపొమ్మకన్

వ॥ అనుప్రభుత్వాధికారుల నాజ్ఞను శిరసావహించి కొరటబొప్పన్నలందోడ్కొని వింకయుఁ గొందరు రాజభటుల సహాయముంగొని కొలఁది కాలంబునకా వన్యప్రదేశమునకుం జేరి.

చ॥ అటఁబొడఁగాంచె రెడ్డికులుఁ♦డంబరచుంబితమైనవృక్షముల్
పటుతరసింహవ్యాఘ్రములుభల్లుకమత్తమదేభలోకముల్
చటులవిషాగ్నిఁగ్రక్కెడివి♦ సర్పములన్ బలుపక్షివర్గమున్
దిటువగుపర్వతంబులును ♦ దీవ్రితఁబాఱునదీనదంబులున్.

వ॥ ఇటుఁగావిపినప్రదేశము నానాజంతు సంకలితమై యుండుటంగాంచి యారెడ్డిరాసుతుండు తనమనంబున నిట్లు వితర్కింపందొడంగె.

క॥ మృగములు తిరుగఁడొడంగెను
పగలే చీకట్లుఁగ్రమ్మెఁ ♦ బాడవచయముల్
జగిబిగి నలరారెడు, న

ష్పగదిని సఫలంబుఁగాంతు ♦ వాంఛితమిలలోఁ. 39

క॥ అనియిటులఁ గాపు కులజుఁడు
మనమునఁ దలఁబోసి విఫల ♦ మానసయుతుఁడై
జని నిజపురమున కటగృహ
మునఁగల పనులన్ని మాని ♦ బొక్కుచు నుండెన్. 40

వ॥ ఇట్లు అడ్డలరెడ్డి పెన్నిధివోయిన పేదచందంబున నిగతధైర్యుండయి విచారంబుననుండ తద్భార్యాంగి లక్ష్మిబాయి భర్త పాదంబులకు వందనంబు లాచరించి యిట్లనియె.

శా॥ స్వామీ! యేలవిచారచిత్తమునసీ ♦ స్వాస్థ్యంబు సస్వార్థమై
భూముల్ దున్నక, భార్యనై పదములన్ బూజింపుమనన్ గూర్చి యే
ప్రేమన్ జూపక బీరువోవ్రుటది యే ♦ వీర్యంబు ప్రాణేశ! మీ
కీమార్గంబు ఘటిల్లు చింతనము నే ♦ దే నాకుఁ దెల్పంగదే!

క॥ అనికోరియడుగు సతిఁగని
కనికరమునఁ జేరఁ దీసి ♦ కరుణించియు నో
వనజాక్షి వనముఁ జూడఁగ
ఘనమ్ముగ సంకలితమెటులఁ ♦ గావింతుఁ బురిన్. 42

వ॥ అని గతంబుఁ గానరఁ జింతించెదననిన యూసుగుణవతి.

సీ॥ తత్క్షణము, యోగిమీరలా ♦ ధాత్రిపతికి
వరయుఁగానుకలొసఁగి మీ ♦ యభిమతంబు

నెఱుఁగఁ జేసిన నధికార ♦ మిచ్చెనేని
గలఁడు మనపాల దైవంబు ♦ కరుణమయుఁడు. 43

చ॥ అతఁడట సంతసించియుని ♦ జాంగనమాటల మెచ్చుకొంచు మన
మ్మతమున స్యాలకుల్ సుజనమాన్యుల 'నాగన' 'బొప్పనా'ఖ్యులన్
జతురత గొల్లఁడౌ 'కొరటు' ♦ సత్వరఁ దోడ్కొని గోలకొండ భూ
పతి నటఁ గాంచి భక్తిమెయి ♦ భద్రత లక్షువరాలొసంగిరన్.

వ॥ పాదుషాగారా కాన్కలందుకొని సునీహృదయుఁడగు అడ్డలరాడ్వరుని సుగుణస్వభావమున కెంతయు సంతసించి చిరాయువుగ నాశీర్వదించి యిట్లనియె.

చ॥ ఘనమతి నీయభీష్టమును ♦ గాదని పల్కఁగ లేనుఁ గాన బ
ల్చనవున సంతసించి మఱిఁ ♦ జయ్యనని కిదె యాజ్ఞపత్రమున్
పనివడి నిచ్చువాఁడఁ గొను ♦ పార్థివ! నా వచనంబమోఘమై
దనరెడి రాచవర్గము స ♦ దా పరిపాలనఁ జేయుమిమ్మహిన్.

వ॥ అని మంగళాశీర్వచనంబులతో నాజ్ఞాపత్రంబొసంగ అడ్డలరెడ్డి నిజసతికి జయప్రదమగు వార్తనుం దెలియఁజేయ నా విమలాంగి యెంతయు సంతసించి బంధుమిత్రపరివార పురజన సహితంబుగా పదిరెండువందల మనుష్యులం దోడ్కొని కొలఁది కాలంబునకు గోల్కొండపురంబునకుఁ జనుదేర అడ్డలరెడ్డి పాదుషాగారి సెలవుఁ గైకొని ప్రభుపంపున శతసంఖ్యాపరిమిత [illegible] భటులం దోడ్కొని రాచవర్లకుం జని.

గీ॥ జలముచేరువ పెద్దదౌ ♦ స్థలముగాంచి
యందునందరు వసియింప ♦ ననువుగాఁగ
పాకలొకకొన్ని నిర్మించి ♦ భద్రమతిని
గట్టెనచ్చోట పనునైదు ♦ గ్రామములను. 46

సీ॥ గోవిదనుతమైన ♦ గోరెంటవంశంబుఁ
బరముగాగోరెంట ♦ పురమునొకటి
జనకుపేరటనొక్క ♦ చక్కనిగ్రామంబు
సింగపురంబునాఁ ♦ జెల్వొందఁ
దరుణిపేరటలచ్చి ♦ పురమునా వెలయించి
మేనమామలపేర ♦ మించిదపరు
వీరన్నపల్లి నా ♦ వెలయించి లింగన్న
పేరట లింగన్న ♦ యూరునొకటి

గీ॥ మరియు స్వగ్రామమునకుమద్ది ♦ మళ్ళనాగ
యూరునొక్కటిగొల్లని ♦ పేరనొకటి
బొప్పపురమునుఁ గోరట్ల ♦ పురమునొకటి
గట్టఁజేసెను సుజనులు ♦ గణుతిసేయ. 47

సీ॥ మఱఁదులపేరటఁ ♦ బరగుచుండగ గుండ
పరమొందుమరి సోమ ♦ వరముపేట
శ్రీనివాసపురంబుఁ ♦ జెలఁగిరామానుజ

పురము సర్వాయము ♦ న్పురమునొకటి
నాంగమ్మపేటయు ♦ నవ్యతగజసింగ
వరమునాఁజెల్వొందు ♦ పురమునొందు
రమ్యతఁజిత్రించి ♦ గ్రామాధికారుల
నెలకొల్పియులమీఁద ♦ నీటినసతి

గీ॥ జనుల కనుకూలమగుసింగ ♦ సంద్రమనెడి
వరతటాకము నిర్మించి ♦ ప్రజలఁగన్న
బిడ్డలనఁగూర్మిఁబ్రోచుచుఁ ♦ బేర్మితోడఁ
పాలనముఁజేయుచుండెనా ♦ పార్థివుండు. 48

గీ॥ ఆనృపాలుఁడు నిజభార్య ♦ యందుసుతుని
మల్లనార్యునిఁగాంచి సం ♦ ధిల్లి ప్రేమ
విమలగుణగణ్య రుచిరాంగి ♦ వేంకమాంబ
బ్రీతిఁగనుఁదెచ్చి సుతునకుఁ ♦ బెండ్లిజేసె. 49

శా॥ మల్లారెడ్డియఖండకీర్తిఘనుఁడై ♦ మాఱెందు లేకుండఁ దా
నుల్లాసంబున రాజ్యభారమను శ్రీ ♦ లొప్పారఁగాఁదాల్చి శ్రీ
పుల్లాబ్జాక్షపదారవిందయుగళీ ♦ పూజాత్ముఁడై ధీరుఁడై
మల్లారెడ్డిపురంబు వేఱొకటి ని ♦ ర్మాణంబుఁ గావించినన్.

మ॥ ప్రజ తెల్లన్ మఱియింపధర్మపరుఁడై ♦ పాలించు మల్లాఖ్యభూ
భుజుఁడానందముఁ జెందుచున్ సుమతుఁడై పొల్పొందరం గేస్తుఁడై

ద్విజులెల్లన్ ముద మొంద వేంకటపతీ ♦ దేవేశుకై భక్తితోన్
రజతాకారతఁ గట్టె దేవళములన్ ♦ రమ్యార్థిన్ బృధ్విలో.

ఉ॥ ఆజననాథ యోధమణి ♦ యందుదయించిరి మాచగంగరా
డ్భ్రాజితులున్ దుదిన్ సుగుణ♦పుంఘుని యెల్లయ నాగమువ్వురున్
భోజునివిక్రమంబలర ♦ బుద్ధివిశారద మూర్తిమంతులై
రాజకుమారులా దివిజ ♦ రాజ సమానులుగాఁగ వర్థిలన్. 52

క॥ అగణితవైభవయుతులై
ముగురున్ దమపేరఁ జెలఁగు ♦ మూఁడుపురంబుల్
సొగసుగఁ గట్టిరి వేల్పుల
నగరంబులమించినట్టి ♦ నగరవరంబుల్. 54

చ॥ అరయఁగ మాచరాడ్వరుని♦ కంతట పుత్రద్వయంబుఁ గల్గెనా
ధరవరుఁ డప్డు పుత్రులకు ♦ ధర్మయమల్లయనాఁగ బేరులన్
వరలగఁ జేయువారలును ♦ వర్థిలి కీర్తి వహింపఁ బేర్మితో
స్థిరమతి రాజ్యభారమును♦ జ్యేష్ఠునిపై నిడియుండె హాయిఁగన్

గీ॥ ధర్మరెడ్డియుఁ బ్రజలకుఁ ♦ దాఁ బ్రియోత్త
పాలనముఁ జేసి తనపేరఁ ♦ బరగనొందు
ధర్మసాగరపురమును ♦ ధాత్రిలోన
గట్టిమాండవ్యనదికినిఁ ♦ గాలువలను. 55

సీ॥ ధర్మరాడ్వరుప్రియుమైన ♦ తనయుఁడంత

హేమరెడ్డియుఁజెల్వొందె ♦ స్వామికృపను
నిఖిలవిద్యలనలరారి ♦ నియతిరాజ్య
పాలనముఁజేసెధర్మప్ర ♦ వర్తనమున. 56

వ॥ అంతనాతఁడు.

గీ॥ ప్రాతవడిజీర్ణమౌ 'సనద్' ♦ భద్రపరచి
పాదుషాఁజేరికానుకల్ ♦ భక్తినొసఁగి
క్రొత్తయధికారపత్రిముఁ ♦ గోరియడుగ
సంతసమునొంది రారాజు ♦ 'సనదు' నొసఁగె. 57

సీ॥ అంచలనొసఁగుటయేఁగాక ♦ యాధిపత్య
పదవిదశబంధమలరారు ♦ పదవిమరియు
దేశముఖయును। దేశాయి ♦ దేశపాండ్య
పదవులవియెన్నియొసఁగి ♦ పంపెనతని. 58

క॥ ఘనుఁడగుప్రపితామహుచే
మనమలరఁగనిర్మింపఁబడిన ♦ మల్లాపురికిన్
జని, యుత్తరకాలంబట
వనజాక్షునిఁగొలచిపరమ ♦ పదవినిఁబొందెన్. 59

ఉ॥ అంతటగంగిరాట్తనయ ♦ లక్కనదమ్మనరాజ్యభారముఁ
బంతమెలర్పఁబూని పురి ♦ పాలనజేయుచు ధర్మపద్ధతిన్
వంతలఁ జిక్కకుండసుఖ ♦ వంతులుగాబ్రజరక్షఁ జేయుచో

చింతనఁజేయుధీరులయి ♦ చెన్నువహించిరి కీర్తికాములై.

సీ॥ మల్లరెడ్డికి మూఁడవ ♦ మాన్యసుతుఁడు
పాలనముఁజేసి తనపేరఁ ♦ బరగనొకటి
ఎల్లరెడ్డిపేటయనొక ♦ టేర్పరించి
కాంచెనంతట నొకపుత్రుఁ ♦ గాంచనాంగు 61

వ॥ అంతనాతనిసుతుఁడు.

సీ॥ భోజరాజనుపేరట ♦ బుధులువొగడఁ
రాజ్యభారము ధరియించి ♦ రమ్యమతుఁడు
కన్నతండ్రికి యశమునుఁ ♦ గలుగఁజేసి
ప్రజలఁబాలించుచుండెనా ♦ భవ్యగుణుఁడు 62

ఉ॥ దానముధర్మముల్గుణము ♦ దారతశాంతియుఁగల్గిభక్తిచే
దానవవైరికీర్తనలు ♦ ధన్యతఁజేయుచు రాజ్యభారముల్
బూని మనోజ్ఞజవ్వనముఁ ♦ బొందపరివోవ వివేకసంపదల్
భూనుతుడయ్యెభోజుఁడల♦భోజునిమించిప్రభుత్వమందునన్

ఉ॥ భూనుతవైభవస్ఫురణఁ ♦ బూజ్యతగాంచియుభోజరాజుతా
సూనులులేని తద్దశకి ♦ శోకభరుండయి కుంది శ్రీహరి
ధ్యానపరుండునై విషయ ♦ దగ్ధుఁడుఁగాకపవిత్రమూర్తియై
శ్రీనలినాక్షుజింతనముఁ ♦ జేయుచుజన్మతరించెనంత్యనన్.

సీ॥ గంగరాడ్వరసుతుఁడు వి ♦ ఖ్యాతిఁబ్రబ్లి

పాలనముఁజేసి ధర్మసం ♦ పన్నుఁడగుచుఁ
బేర్మిఁదనపేరదమ్మన్న ♦ పేటనొకటి
గట్టెఁదనకీర్తి ద్విగుణమై ♦ గ్రాలదిశల. 65

తే॥ ఘనుఁడునాతని భ్రాతయు ♦ కృష్ణ నృపుఁడు
తనదుపేరట నొకయూరు ♦ దనరఁజేసి
ఖ్యాతి వర్ధిల్లశ్రీహరి ♦ కరుణవలన
సుతులనిర్వురఁగాంచెఁ గి ♦ శోర బలుల. 66

ఉ॥ రాయనలింగ నాఖ్యలను ♦ రంజిలువారలలోఁ గనిష్ఠుఁడౌ
ధీయుతుఁడైన లింగనసు ♦ ధీమతుఁడంతట లింగపల్లియూ
రా,యసమాన తేజుఁడట♦నందముతోఁదుతఁగట్టె జ్యేష్ఠుఁడౌ
రాయనరాజ్యభారమతి♦ రమ్యతదాల్చుచునేలుచుండఁగన్

ఉ॥ మందరగోత్రధీరుఁడభి♦మానధనుండగుఁబుత్రునొందుసం
క్రందన వైభవంబునను ♦ వర్ధిలఁగాంచెను కొంచివానికిన్
బొందుగరాజ్యమున్నొసఁగె, ♦ భూవిభులింగనపాలనంబు నే
మందునురామరాజ్యమన ♦ నంతటధర్మమునిండివెల్గగన్.

తే॥ శుభముహూర్తమునందున ♦ సుతునినొకనిఁ
గాంచి చినరాయుఁడనపేరఁ గ్రాలఁజేసి
తనరఁబట్టముఁగట్టియు ♦ ధాత్రివిభుఁడు
హరినిస్మరియించి పరలోక ♦ మతఁడుఁజేరె. 69

గీ॥ చిన్నరాయన్నభక్తుఁడై ♦ చెన్నుమీఱి
తండ్రిగట్టినగుడిలోనఁ ♦ దానుదివ్య
మంటపంబొండు ద్వాదశ ♦ మహితజ్యోతి
లింగసంస్థాపనముఁజేసె ♦ రంగుమీఱి. 70

గీ॥ అతనిపుత్రుండు రాజన్న ♦ క్షితివరుండు
తనకుసంతానమునులేమి ♦ దత్తునొకని
రమణచేకొనె రాయనర్ రాజసుతుని,
హరినిస్మరియించిపరలోక ♦ మతఁడుజేరె. 71

ఉ॥ రాయన కొంతకాలమట ♦ రాజ్యముసేసి దివంబుఁ జేరఁగా
నాయన ధర్మపత్నిసుగు ♦ ణాకర వర్సము రాజ్యభారముల్
ధీయుతఁదాల్చిపౌరులను ♦ ధీమతిబ్రోచుచుదత్తుఁజేకొనెన్
గాయజుగేరుసుందరునిగంగయరాట్కులపుత్రునొక్కనిన్

శా॥ ఆరాజన్యుఁడురాజ్యమేలుతరిలే ♦ రై రందుభిక్షాటులున్
జారుల్ చోరులుదుర్మదాంధకుమతుల్ ♦ సద్ధర్మదూరుల్ వృథా
పోరుల్ చేసెడి వారుదైవపదస ♦ త్పూజావిరక్తుల్ దురా
చారుల్ పుత్రవిహీనదుఃఖితులునాత్మమండలిన్ జూడగన్

క॥ ఏవేవర్ణాశ్రమజను
లాయాపద్ధతులనడచు ♦ నట్టులవారిన్
బాయకశాసించునృపుఁ
జేయుటమటయు లేకపృథ్వి ♦ నేలుచునుండెన్. 74

క॥ ఆనరనాథుఁడు పిమ్మట
జానకినాఁబరఁగునొక్క ♦ చక్కని కన్యన్
మానుగఁ బెండిలిఁ జేసుక
తానటు వర్ధిల్లుచుండు ♦ తరుణముపోనన్. 75

గీ॥ చెన్నమన్నని 'సిరిశిల' ♦ క్షితివరుండు
గలఁడుకర్యారుఁడు నిరతంబు ♦ కయ్యమూని
గంగనృపుతోడ. సైన్యసం ♦ కలితుఁడగుచుఁ
బోరుచుండెను భూములఁ ♦ బొందఁదలఁచి. 76

చ॥ పలుమరుయుద్ధకాంక్షఁగొని ప్రౌఢిగవచ్చిన చెన్నమన్ననున్
వెలమదొరస్ పరాభవము ♦ వేమరుఁ జేయుచు గంగరాజు తా
జలమున దేజరిల్లఁగను ♦ చయ్యన నాతఁడుఁ బోరలేక దు
ర్బలమతుఁడయ్యు నేగెనిజ ♦ పట్టుకఁ జచ్చినవానిభంగిగాన్.

వ॥ అట్లు జనివిగతధైర్యుండై నిజసైన్యంబునంగల ప్రవీణులగు కొందరిని రావించి మీరుప్రచ్ఛన్న వేషంబుల గంగరాజునాశ్రయించి యుద్ధకౌశలతఁగనబరచి నాతనికొలువుననుండుడు. మేముదండెత్తి వచ్చినప్పుడు వలయుసాయంబును జేసి మాలోఁజేరుఁడని పుత్తెంచిన, వారలువల్లెయని కొలదిదినంబులలో నాపృథ్వీవరుని రాజ్యంబునకుం జేరి గంగరాజుని సందర్శించి యుండిరి.

చ॥ బ్రతుకఁదలంచి మీమహిత ♦ పంకజయుగ్మము జేరినాము మీ
కతులిత సంతసమ్మొదవు ♦ నట్టి పరాక్రమ యుద్ధనైపుణీ
చతురలమంచు ఖడ్గములు ♦ చయ్యనఁద్రిప్ప నృపుండు మెచ్చి స
మ్మతిఁదగు వేతనంబులును ♦ మందిరముల్ నొగినిచ్చె వారికిన్

చ॥ అనయముఁ గ్రూరకర్ములగు ♦ నాకపటాత్ముల విశ్వసించి యా
జనవరుఁ డుండుటన్ దెలిసి ♦ సత్వరమొక్కఁడు నిఁబాపి వెల్మరా
జ్జనవరు సైన్యయుక్తముగ ♦ జయ్యనఁ దోడ్కొనివచ్చినట్లుఁగా
ననుచితరీతిఁ దెల్పఁగను ♦ నాతఁడు కోటను వీడి సత్వరన్.

చ॥ తలఁగక భీతి నొందక తి ♦ తామసుఁడా మనుజుండుఁ జేరి తా
వెలమకుఁ దమ్ము నేలుదొర ♦ వీటికిఁ బోయి నెరుంగఁ జేయ మా
యలనటఁ బన్ని సైన్యము సమాయతఁ గూర్చుక నా నృపుండు ని
శ్చలముగఁ గోటఁ జేరఁగను ♦ సత్వరమున్ దనవారలంతటన్.

గీ॥ కాంచియుత్తరద్వారమా ♦ కలుషమతులు
దెరువనంతటసిఁశిల్ల ♦ దొరయుభటులుఁ
గోటఁజొచ్చినఁ దదరితతి ♦ కులును వారు
ఘోరయుద్ధంబు సల్పిరి ♦ కొంతదనుక. 81

చ॥ పగతుని సైన్యమావిధిని ♦ బాములఁ దెచ్చి జొరంగఁ గంగరా
డ్జగపతి గానకుండనతి ♦ జాగ్రతఁ దానట గోలకొండకున్
యగణితతీవ్రతన్ జనియు ♦ నచ్చటవారికెఱుంగఁ జేయఁగా
జగపతి చేష్టలన్ వినుచు ♦ క్ష్మాతలనాథుఁడు కోపచిత్తుఁడై

చ॥ అరయఁగ శత్రుభీకరుల ♦ నంతటసాయమొసంగిగంగరా
డ్వరుగుణమెంతయుఁ బొగడి ♦ వైరులనీవుజయించివేగమే
నెరుగుఁగఁజేయుమావిసఁగ ♦ నెంచితినీదుప్రభుత్వమెంతయో
బరమనుకీర్తిసియుమది ♦ భవ్యులుఁగారెత్వదీయవంశజుల్.

గీ॥ ధర్మగంభీర బిరుదంబు ♦ ధరవరేణ్య
నీకునొసఁగితి వర్ధిల్లు ♦ నీవుమాకు
నాత్మబంధుఁడవై కీర్తి ♦ నందిపృథ్విఁ
బాలనముసేయుధర్మసం ♦ పన్నమతిని. 83

చ॥ అనిబటుమాదరింప విన ♦ యంబునవాఁతఁడునాజ్ఞఁబొందిస
జ్జనుతుశౌర్యబ్బలను ♦ సత్వరఁగోండ్కొనిపోయివేగమే
యనినట ఖండఖండముగ ♦ నందరినిఁ దెగటార్చి ధీరుఁడై
జనపతికీర్తివంతుఁడయి ♦ సౌఖ్యతరంబుగపృథ్వినేలఁగన్.

గీ॥ అట్లుజగపతి పరిభవ ♦ మంది, లింగ
రాయుఁడనుశూరుఁబిలిపించి ♦ రయముగాను
మేటిమగలగువీరుల ♦ మించినొసఁగి
ధర్మగంభీర దేశాయి ♦ ధాత్రివరునిఁ
బోరిజయమొందితేనియా ♦ యూరిసగము
నీకునొసఁగెదఁబొమ్మన్న ♦ నెమ్మినతఁడుఁ
నాఁగొని సప్తదినముల ♦ నతఁడుపోరి

సైన్యములుఁగూల జవమును ♦ సన్నగిల్ల
భీతిఁబాఱంగ వెన్నాడి ♦ బిట్టువగుచు
వానిఁజంపియుఁగూపానఁ ♦ బాఱవేయ
భువిని "లింగన్నఁదలఁగొట్టు ♦ బొంద" యనఁగఁ
బ్రబలమయ్యెను నిప్పటి ♦ వరకుఁగూడ. 85

వ॥ ఇట్లు జయంబుఁగాంచి గంగరాడ్వరుఁడు గోలకొండపాదుషాగారిచే "ధర్మగంభీరరా" వను బిరుదంబునందిదుష్టుల శిక్షించుచు శిష్టులరక్షించుచు ధర్మంబు నాల్గుపాదంబులనడపించుచు రాజ్యపాలనంబుఁ జేయుచుండెను.

సీ॥ వేంకటాద్రియు లింగన్న ♦ పేటలతఁడు
నొకటిగాఁజేసి రమణీయ ♦ మొప్పఁగాను
ధర్మగంభీరపేటనా ♦ ధరణివెలుఁగఁ
జేసినారాజుగుణములఁ ♦ జెప్పఁదరమె. 86

వ॥ అంతఁగొండొకకాలంబునకు.

క॥ జనపతి దివమునకరిగిన
జననాయకుభార్యయైన ♦ జానకిరాజ్యం
బనయముఁగాపాడుఁచుఁదా
జనులను రక్షింపఁదొడఁగె ♦ తన్మతిలీలోన్నత. 87

ఉ॥ ఆయసమచిత్తవృత్తివిన♦యంబునపృథ్విభరించమార్గమున్

శాయమి రాచబుద్ధిపరి ♦ పాలనఁ జేయుక్రమంబుఁ గాంచి యా
కాయజుతల్లియో శివుని ♦ కాంతయొ భారతియో యటంచు నా
ధీయుతజానకాంబ సర ♦ దేశముబోల్తురు లోకు లెప్పుడున్ ॥

సీ॥ ఆపె యొకనాఁడు కాపువా ♦ డర్భకుండు
గోవులను గాచువాతనిఁ ♦ గొడుకువోలె
పెంచి పెద్దఁగ జేసి యా ♦ పిదప వాని
యాధిపత్యంబు నొసఁగి తా ♦ నరుగె దివికి 89

వ॥ అతండు ధర్మగంభీరరావనం బరఁగు.

సీ॥ ధర్మగంభీర రావంతుఁ ♦ దల్లిమార్గ
మనుసరించుచుఁ బురినేలు ♦ ఖ్యాతిఁ గనుచుఁ
గూర్మి పాపమ్మ యనియెడి ♦ కువలయాక్షిఁ
బ్రేమఁ బెండిలియాడి సం ♦ ప్రీతినుండె. 90

సీ॥ ఆమహాభాగ్యరాసి తా ♦ నధిపువలనఁ
గూతు నొక్కతెఁ గాంచె వి ♦ ఖ్యాతిఁ బిదప
సంతతియు లేక నరహరి ♦ సంస్మరించి
పరముఁ గాంచెను పిమ్మట ♦ పార్థివుండు॥ 91

క॥ నాలక్కయ నెడి కన్యను
లీలన్ దగఁ బెండ్లియాడి కు ♦ లీను సుపుత్రున్
శీలున్ నరసింగ్రావను
బాలున్ నటుఁ గాంచె గనుల ♦ పండువగాగన్. 92

ఉ॥ అంతటనాకుమారుఁడుజ ♦ యంతవసంతులమించియామిని
కాంతునివోలెనివ్వటిల ♦ క్ష్మాతలనాథుఁడుజాతకర్మముల్
సంతసమొందఁజేసి బుధ ♦ సంతతిబంధులకొక్కనాఁడు వే
వింతగుపిండివంటలను ♦ విందులతాఁబచరించె నెంతయున్.

వ॥ ఇట్టులఁగొన్నిదినంబులు గడువ.

సీ॥ అంతబాలక్క మ్మణినొంది ♦ నంత నృపుఁడు
వేంకమాంబయుఁబెండ్లాడి ♦ వేడ్కమీరి
యాతిలోదరియందున ♦ నతఁడుఁగాంచె
ముగురుఁబుత్రుల మన్మథ ♦ మూర్తులనఁగ 94

క॥ ధరలక్ష్మణరావును బూ
వరువేంకట కృష్ణరావు ♦ వరలఁగరాజే
శ్వరరావు; తృతీయుఁడునౌ
వరలుచు సద్గుణులు ధృతి వి ♦ భాసితులగుచున్. 95

వ॥ దినదినప్రవర్థమానులై చెలువారుచుండ.

క॥ ధరపాండవభార్యకువా
నరవరునకుఁబుట్టినట్టి ♦ నరసింగరావా
ధరణీతలి కధిపతియై
పరిపాలనసేయఁదొడఁగ ♦ ప్రజలిల మెచ్చన్. 96

వ॥ అంతనారాజన్యుఁడు.

క॥ ఎడవడియనుగ్రామముఁ
గడువడిఁ బాలించుప్రభుని ♦ గాదలికూతుర్
వడి రాజమాంబకన్యను
బుడమీశుఁడు పెండ్లియాడె ♦ పూతచరిత్రన్. 97

క॥ సంతాన ప్రాప్తి లేమినిఁ
జింతించియు నృపుఁడు మిగుల ♦ జింతాస్పదుఁడై
పంతంబున పాపమ్మను
కాంతను వరియించె మేలు ♦ కన్నియఁ బ్రీతిన్. 98

క॥ ఇరువురుభార్యలు ♦ గలిగియు
ధరణీశ్వరుఁడంతపుత్ర ♦ దశఁ గానకఁ దాఁ
బరిపరి చింతలఁ జిక్కియు
హరిఁ జేరె తదంఘ్రియుగ్మ ♦ మాత్మనుగనుచున్ 99

ఉ॥ ఆజననాథుభార్య సుగు ♦ ణాంచితధర్మ ప్రవర్తనంబుచే
రాజిలఁ గీర్తిగాంచి పెర ♦ రాజులగుండెలు దద్దరిల్లఁగా
రాజితరాజ్యమేలి నిజ ♦ రాజ్యమునందునఁ బౌరులందు న
వ్యాజితప్రీతిఁ జూపిబుధ ♦ వర్ణనకెక్కెను రాజమాంబిలన్.

క॥ తనరాజ్యప్రతినిధిగా
నొనరిచె నరసింగరాయ ♦ నుర్వీసుతునిన్
వినయంబుతోడ నాతఁడు
జనులకు సౌఖ్యంబుఁ గూర్చ ♦ సాగెను బ్రీతిన్. 101

గీ॥ భామినీమణియొకనాఁడు ♦ భాగ్యనగర
పాలనాధీశు నుద్యోగు ♦ భవ్య రాజ
యింద్రజిత్తును జూడంగ ♦ నింతివోవ
నతఁడుఁగూర్చుండ నియమించె ♦ నర్హపీఠి. 102

గీ॥ అంత మానకొండూరన ♦ కధిపుఁడైన
సాంబశివరావుకూడన ♦ చ్చటకివచ్చి
రంజబాయగ్రపీఠి ని ♦ రాజిలఁబోడ
గాంచిసొూగ్వేక నిటులదాఁ ♦ గారులఱచె. 103

గీ॥ భర్తృహీనవు నీవ్రునీ ♦ పగిదిమీరి
మానవతివయ్యుఁబురుషుని ♦ మాడ్కిసభను
దనరుపీఠంబుఘుండుట ♦ తగవుఁగాదు
అంగనలకిట్టి స్వాతంత్ర్య ♦ మర్హమగునె! 104

వ॥ అనిన యావీరపత్ని.

గీ॥ కనులురక్తిమమొందంగఁ ♦ గనలిమిగుల
నారి! దుర్మార్గ! కారుల ♦ నఱువఁబోకు
మూఢ నీకునుఁగాలమ్ము ♦ మూర్ఖచిత్త!
మాకు మునుసేవఁ జేయుట ♦ మరచితౌర! 105

గీ॥ మానవాధమ! కాఱులు ♦ మానుమింక
నీదునాలుకనిప్పుడీ ♦ నిముస మందుఁ

దునియ తునియలఁజేసెద ♦ తులవ! కాని
పరుని యిల్లగు కతనఁబో ♦ (బ్రతికితి) 106

ఉ॥ ఓరిదురాత్మ! నీవుబుధ ♦ లొప్పనిభంగిదురూక్తు లాడుటే
సారము! దుష్టవర్తనమె ♦ సాధనమయ్యెడినిప్రతాపముల్
ధీరతగర్వముల్ నణఁగఁ ♦ దీసియు నిన్నుఁ బంధనంబుచేఁ
గారఁగఁజేయుదానఁగన ♦ వచ్చెదు నింతకు నోరి దుర్మతీ!

వ॥ అనిపలుకు రాజాబాయి దేశాయిగారి నవలోకించి సాంబ
శివరావు కోపోద్దీపితుండై యిట్లనియె.

చ॥ పడతిరో! యేలకోయిటుల ♦ బల్కెదపెగ్గెలునన్నుజంపఁగా
నడిదముఁజేతనుంగలద ♦ టంచు నిగ్వ్రర్ల బడఁబోకు నేనిదే
గడవునొసంగువాఁడ రణ ♦ కాంక్షయె నీకిలఁగల్గునేని నీ
వడిఁగలతేజముం జూరఁగ ♦ వచ్చెద నీపురికింత లోపలన్.

ఆ॥ అనిన రాజమాంబ ♦ యధికరోషంబునఁ
గనలివానిఁజూచి ♦ కలుషమతుఁడ!
స్వీయస్తోత్రమేల ♦ జేసెదవనిలోనఁ
గాంచుదానననిదు ♦ ఘనతఁబోర! 109

వ॥ అనియిట్లు రాజాబాయి దేశాయికడుంగడురోషకషాయిత
నేత్రయై సాంబశివరావు దేశాయినిఁదూలనాడి ప్రళయకాల
మార్తాండసదృశంబైనమోము నెఱ్ఱఁబార నిరుక్కునగద్దియఁ
డిగ్గి నిజనివాసంబగు లింగన్నపేటకుంజనియె.

గీ॥ అంతశివరావు మనుకొండ ♦ కలిగిపిదపఁ
బదియుఁబండ్రెండు వేల రణ ♦ భటులఁగూడి
శతశతఘ్నులు గుఱ్ఱముల్ ♦ సమరవీథి
నడువ నేతెంచె లింగన్న ♦ నగరమునకు. 110

వ॥ ఇట్లరుదెంచు పగతుర సైన్యంబులను జూచి వీరపత్నియగు రాజాబాయి సర్దేశాయిగారు.

గీ॥ కోటమార్గములన్నియు ♦ మాటుఁజేసి
శతశతఘ్నుల బురుజులఁ ♦ జక్కనిలిపి
నేర్పుఁగలవీరులచ్చోట ♦ నిలువఁజేసి
కవచమునుఁదాల్చి చేఁబట్టె ♦ ఖడ్గమపుడు. 111

క॥ దురమున శివరావుఁగని
బరిమార్పఁగ దలఁచి వీర ♦ భామినిశౌర్య
స్ఫురణన్ గలచిత్తముతో
దరుణముగని వైరిదళముఁ ♦ దలఁగోనుచుండెన్ 112

చ॥ కుఱిపిఱిలింగరాడ్వరవు ♦ గోపురమందలిమంచుగుండులన్
ధరనటవైరిమూకయును ♦ దత్ప్రతితోఁ బుంఖకోటమీఁదికిన్
బఱపినఁ గోనఁబోకఁ బురి ♦ ప్రక్కనఫీల్లులఁదాకి వ్యర్థమై
పరిఘములందెగోళములు ♦ భాసితతాళఫలంబులో యనన్

వ॥ అంతరాజాబాయి సర్దేశాయిగారు నిజసైన్యంబునుంజూచి యిట్లనియె

క॥ రణశూరుల లక్షణముల
దనకెదురగు రిపులబలము ♦ దర్పణమునణఁచన్
ఘనమైనకీర్తిగావున
వెనుకాడకపొంచువైరి ♦ వీరులనడఁచన్. 114

క॥ గురిఁదప్ప నీకశరములు
పరసైన్యముమీఁదఁగుప్పి ♦ సైబడివారిన్
నఱకుఁడుపొడువుఁడటంచని
బురిఁగొల్పుచునుండెరావ్రి ♦ మూర్తియువోశెన్. 115

సీ॥ బలములన్నియునేకమై ♦ బడుచుఁబగతు
సైన్యమంతయుభిన్నమై ♦ సన్నగిలఁగ
హోరుగాఁబోరదొడఁగిరి ♦ వీరమాత
రాజశాయికిజయమంచు ♦ రణమునందు. 116

వ॥ అంతరాజాశాయి సర్దేశాయిగారు.

క॥ బలవంతులు నిజబటులటుఁ
దలఁపడఁబరసైన్యమష్టు ♦ తత్తరమొందన్
గలఁబడిపోవుచునుండఁగ
నలివేశియునశ్వమెక్కి ♦ యతితీవ్రగతిన్. 117

వ॥ యుద్ధభూమినింబ్రవేసించి.

సీ॥ తనవాఁలకుసుధా ♦ ధాముమైగనిపించు
బహులకుచంద్రాంశుఁ ♦ బగదిఁబోచుఁ

దనసైన్యముంజూచు ♦ తరికాంతముంజాల్చుఁ
బగతులంగననగ్నిఁ ♦ బర్వసేయు
నిజబలంబులకుఁదా ♦ నగడిధైర్యమునిచ్చు
బరులదిట్టతవ్యర్థ ♦ పడఁగఁజేయుఁ
దనచేతిఖడ్గంబుఁ ♦ దనవారికానంద
భరితంబునౌరులకు ♦ భయదమృత్యు
గీ॥ వనగరాజాంబ శౌర్యంబుఁ ♦ దనరయుద్ధ
భూమిమార్కొని వారల ♦ భూతతతికి
బలియొనర్చుచుఁగదనభూ ♦ భాగమందు
రమణితిరుఁగాడఁజొచ్చె మా ♦ ర్తాండుపగిది. 118

వ॥ సాంబశివరావు దేశాయి బలవంతులగు కొందఱివీరభటులను దోడ్కొని రాజాంబదేశాయి నెదిరించిపోరుచుండ.

మ॥ కనిరాజాంబయు భూరికోపమడరం ♦ గా శస్త్రసంపన్నయై
దనువుల్ సించియుద్రుంచివైచిమిగులన్ దత్పాలదోర్దండ్వలో
చనయుగ్మంబులబాణముల్ గుఱిచియా ♦ శ్చర్యంబుసంధిల్ల సిం
హనినాదంబొనరించెనిస్తులితశౌ ♦ ర్యాటోపముల్ జూపుచున్

క॥ పదునుఁజెడి సాంబశివుఁడును
మదితత్తరమొంది భీతి ♦ మారుకొనంగన్
బెదరియు మదిచెదరియుఁ
బదములకనుబుద్ధిసెప్పి ♦ పఱుఁగిడజొచ్చెన్. 119

గీ॥ అపుడు రాజాంబ తీవ్రత ♦ నరగి వానిఁ
బట్టి క్రిందకుఁబడఁద్రోసి ♦ పాఱుఁబోతు!
ప్రాణభీతిని జీవముల్ ♦ పట్టిచేతఁ
గాచిపోవుటశౌర్య సం ♦ పన్నగుణమొ! 120

గీ॥ మరచినాఁడవె యానాటి ♦ మాటలన్ని
యిపుడుఁజూపుము నీశక్తి ♦ చపలమతుఁడ!
శమనవీటికి నినుఁబాపు ♦ సమయమబ్బె
ననినవాతఁడు గోర్మడ్డి ♦ ననియెనిటుల. 121

క॥ శరణంటిని కరుణించుము
చరణంబులఁబడినవానిఁ ♦ జంపుటతగువా!
వరవీరభామినీమణి
ధరననుఁ గరుణించిబ్రోవు ♦ తల్లీ! యనినన్ 122

వ॥ అనియిట్లు కాళ్ళంబడి దుఃఖించెడిసాంబశివరావుదేశాయిని కరుణించి.

చ॥ అలఘుదయాసముద్రయగు ♦ నాయమ వానిని లేవనెత్తి భీ
తిలనిక నేలఁబొమ్మునృప ♦ తీరెను నాదుప్రతిజ్ఞ నింక నీ
బలమును శౌర్యమందరికి ♦ భద్రితనీదగు నూరజేరి యీ
కలుషప్రవృత్తులన్ విడచి ♦ గారవరీతి మెలంగుబొమ్మికన్'

వ॥ అని సముచితరీతి నీతులంగరపి పరిహసించి విడువనాతఁడు జీవచ్ఛవంబుభాతి, హతశేషమగు సైన్యంబునందోడ్కొని

జనివాసంబగుమానుకొండూరుఁజేరితనపరాభవంబునకెంతయు చింతించుచుఁ గుములుచు మాసత్రియములో విగత జీవుం డయ్యెను. తదనంతరంబ,

కం॥ తనతోఁడు బుట్టినట్టుల
ఘనతరముగ పాపమాంబ ♦ కాంతామణినిన్
గనుచున్ ముదమునఁదానట
మనమలరఁగ గ్రామమొకటి ♦ మాన్యతనొసఁగెన్. 124

గీ॥ పరగరాజేశ్వరుండనెడి ♦ బంధునొకని
దత్తుఁజేకొనిదొంతిసం ♦ స్థానరాచ
కన్యవేంకాంబఁదెచ్చియు ♦ ఘనముగాను
పెండిలినిఁజేసె రాజాంబ ♦ ప్రీతితోడ. 125

చ॥ సరసతవారలిర్వురును ♦ సంతతమోదముతోడ శ్రీహరి
కరుణప్రసాదమున్ గనియుఁ ♦ గాంచిరిపుత్రుని,రూపసంపదా
కరమహనీయపెన్నిధినిఁ ♦ గాంచినయంతటరాజదంపతుల్
హరిఁగననేగిరోయనఁగ ♦ నమ్మహనీయులుపొందిరైక్యమున్

గీ॥ వారు హరిఁజేర దుఃఖసం ♦ ప్రాప్తమైన
చింతనలఁజిక్కి రాజాంబ ♦ చేరెదివికి
[illegible]పాపాంబ యధికార ♦ మప్పుడు బూని
మఱఁదిరెండవకొమరుని ♦ మానసమునఁ

డైన వేంకటనరసింగ ♦ మనెడిబాలు
దత్తుఁజేకొని బుధులు సం ♦ తసమునొంద. 127

గీ|| పాపమాంబయుఁ దోఁబుట్టు ♦ భవ్య లక్ష్మి
రాజరాయుని పుత్రియౌ ♦ రాజమాంబఁ
దెచ్చి నరసింగరావున ♦ కిచ్చి పెండ్లిఁ
జేసెనాయింతివైభవ ♦ శ్రీలుఁజెలఁగ. 128

గీ|| కొంతకాలమున్నపుడు ప్ర ♦ శాంతముగను
గాలముంగడపి యటమీఁద ♦ క్ష్మావరేణ్యుఁ
డశ్వమున నుండిపడియుఁ దా ♦ నవశుఁడగుచు,
బరముఁ జెందెను వైకుంఠ ♦ ప్రాప్తుఁడగుచు. 129

గీ|| పుత్రశోకంబునఁ బొక్కి ♦ పూతచరిత
పాపమాంబయు మృత్యువు ♦ వాతఁబడిన
రమణి నాయమ్మ కోడలౌ ♦ రాజమాంబ
కాధిపత్యంబు లబ్ధమై ♦ యలరెనంత. 130

గీ|| భగినిపుత్రికపుత్రుఁగో ♦ పాలప్రభుని
వరలగంభీరదత్తునా ♦ బిరుదొసంగి
దత్తుఁగైకొని ముదమునఁ ♦ దనరుచుండు
నంతలోపల నారేడు ♦ నరగె దివికి. 131

వ|| అంతట రాజాబాయిదేశాయి మున్నుండు రాజ్యపరిపాల
నార్హమైన వంశోద్ధారకుండు లేమినిఁజింతించి.

ఉ॥ పంకజనేత్రి దత్తువేరొకని ♦ భాసిలఁజేకొన నెంచికోడలా
వేంకటలక్ష్మితో నడుగ ♦ వేడ్కతో నామెయు సమ్మతింపమీ
నాంకునిఁ గేరు సుందరును ♦ దంచితసద్గుణపూర్ణుఁడౌ బుధుల్
వేంకటనారసింగనృప ♦ వీరుని రాజము దత్తుఁజేకొనెన్. 132

వ॥ ఆనృపతనూజుని వంశక్రమం బెట్టిదనిన.

గీ॥ అటుకుమారువంశాబ్ధికి ♦ నలరఁజేయు
ననఘుపాతూరి రామకృ ♦ ష్ణాఖ్యనృపుని
నయతి సూనుండు వేంకట ♦ నారసింగ
పృథ్వీభరణుండు విద్యాప్రి ♦ వీణుఁడరయ. 133

సీ॥ శాంతిచే నలరారి ♦ దాంతిచే ముగమొంది
తల్లిఁదండ్రులమాట ♦ దాటఁడెపుడు
పెద్దలఁగ నుగొన్న ♦ ప్రీతి భక్తినిఁజేరి
సేవలఁ జేయుచుఁ ♦ జెలఁగుచుండుఁ
బరులఁగష్టింపంగ ♦ నెరిసాయముంజేసి
నాత్మ శ్రీహరిసేవ ♦ నలరు మండు
విత్తాధికారత ♦ విజ్ఞవీగక నెపుడు
నిండుభావముతోడ ♦ నుండుజగతి 134

గీ॥ సకలసద్గుణ సంపన్న ♦ చక్రవర్తి
రమణ వేంకటనరసింగ ♦ రాయనృపతి

యతనిగుణములునుతియింప ♦ నలవియగునె
నలువకైనను వేనోళ్ల ♦ చిలువకైన. 135

చ॥ సురుచిరమూర్తియుఁ భువనసుందరుఁడుఁ సుకుమార దేహుఁ
డరసృపలక్షణాంశమున ♦ భాస్కర తేజమునొప్పివిద్యలఁ [డై
నిరుపమపాండితిఁ వడయు ♦ నేర్పున వేంకటనారసింగ రా
డ్వరుమహనీయమైన గుణ ♦ వర్ణన వర్ణితమయ్యెనంతటఁ

సీ॥ కడుపేదవానికిఁ ♦ గనకమబ్బినయట్లు
గల్పవృక్షమునింటఁ ♦ గాంచుపగిది
దాహితైనవానికి ♦ ధనలబ్ధముగురీతి
పిరికిపందకుహరి ♦ కరుణసరణి
మృత్యుభయుని కా ♦ మృతముఁ జిక్కినభాతి
వైరాగ్య విషయముల్ ♦ వదలు సరణి
మ్రొక్కఁబోయిన వేల్పు ♦ మోలినిల్చినయట్లు
వనిశూరునకు ఖడ్గ ♦ మబ్బు సరణి

గీ॥ రాజగాయగు దేశాయి ♦ రమణినార
సింగభూపాలుదత్తును ♦ జెందుటెల్ల
బూర్వపుణ్యంపుఫలమున ♦ బొసఁగెఁగాని
యరదుఁగాదటె! సద్గుణు ♦ లబ్బుటెలను. 137

సీ॥ చెలుపనేరఁడు విశ్వ ♦ సించి జేరినవాని
నభిలషింపఁడుసిచ ♦ మైనకనుల

నిందింప నేరఁడు ♦ నరిశత్రువులనైనఁ
బొంక నేరఁడు హాస్య ♦ మునకునైన
విడువ నేరఁడు సదా ♦ విద్వద్వరుల గోష్ఠి
తల్లిదండ్రులఁ జూచు ♦ దైవములగ
నడుగఁ బెట్టఁగ నేరఁ ♦ డపయశంబగు త్రోవ
జనఁగ నేరండార్త ♦ జనముఁ ద్రోచి

గీ॥ నాల్గుపదముల ధర్మంబు ♦ నడపుచుండు
గరుణరసమున దీనులఁ ♦ గాచుచుండు
నవనిమితభాష ప్రతముచే ♦ నలరుచుండు
రమణ వేంకట నరసింగ ♦ రాయనృపుఁడు. 138

గీ॥ ఎలమి నింద్రుండు సురలోక ♦ మేలినట్లు
శ్రీమఁడలకాపురంబు రక్షించు సరణి
సరస లింగన్నపేట సం ♦ స్థానమరయఁ
బాలనముఁ జేయు నరసింగ ♦ ప్రభుఁడు ధరను 139

గీ॥ సంతతము జాగరూకుఁడై ♦ సర్వరాష్ట్ర
కార్యములుఁ జూడ స్వయముగాఁ ♦ గాంచుచుండు
పౌరజనముల ముంగొంగు ♦ పసిఁడిగాఁగ
నరయుచుండును కుశలమ్ము ♦ ననుదినంబు. 140

వ॥ ఇవ్విధంబున శ్రీగోరంట వేంకటనరసింగరాయ
నృపశేఖరుండగు రాజ్యపాలనముఁ జేయుచుండెనంతట!

సీ॥ సకలభూపాలకా ♦ స్థానహర్మ్యంబులు
వర్ణితంబేరాజు ♦ ప్రతిభ నెపుఁడు
గడుబీదలేరాజు ♦ కరుణకు పాత్రులై
సన్నుతింతురుహరి ♦ స్మరణగాఁగ
దిగ్దిశ లేరాజు ♦ దివ్యయశోలక్ష్మి
బ్రహ్మోత్సవంబుగఁ ♦ బరిణమించు
సుకవిగాయకశ్రేణి ♦ స్తోత్రపారంబుల
సలరునేరాజు గే ♦ హాంగణంబు

గీ॥ సతఁడు 'తడసిన' వంశాబ్ధి ♦ నలరినిండు
చంద్రుఁడుండన దొంతి సం ♦ స్థానమునను
భద్రయశమునుఁ బాలించుఁ ♦ బ్రభుఁడుచూడ
రమ్యగుణనిధి గోపాల ♦ రాయ నృపుఁడు. 141

సీ॥ అలకాధిపతికన్న ♦ నమృతాంశు ననుగేరి
కలిమిరూపునమించి ♦ నలరువాఁడు
జలజాప్తుఁడగురాము ♦ నలవాయుజునిమించి
కరుణవీర్యంబులఁ ♦ గ్రాలువాఁడు
సురరాజ్యమునుమీరి ♦ వరవైభవంబులు
నిజరాజ్యమునగల్గి ♦ నెగడువాఁడు,
తనపురంబునఁగల ♦ జనుల బిడ్డలమాడ్కి
శుభదృష్టి నిరతంబుఁ ♦ జూచువాఁడు

గీ॥ శాంతితనుఁగూడ సత్యమ్ము ♦ సరసనుండ
దైవభక్తియు గురుసేవ ♦ దనరుచుండ
రమణవేంకటగోపాల ♦ రాడ్విభుండు
గాంతిసంస్థానమేలెడి ♦ దారయుతంగ 142

గీ॥ చిత్తమలరఁగనిరాజు ♦ జ్యేష్ఠపుత్రి
భవ్యవేంకటనరసాంబ ♦ భాసురాంగి
నిచ్చి పెండిలిఁజేసెను ♦ హెచ్చుగాను
రమ్యగుణదామునరసింగ ♦ రావుకెలమి. 143

గీ॥ ఈమహీవరుభార్యయై ♦ యింతులందు
సాధ్వియైనట్టినర్సాంబ ♦ సద్గుణాబు
లరయనుతిజేయతిరముకా ♦ దబ్జభవుని
నాల్గుమోముల, శేషుని ♦ నాలుకలకు. 144

సీ॥ శివునికర్ధాంగియై ♦ చెలువొందుగౌరికిఁ
సమతుల్యమీనాతి ♦ జాడ జూడ
హరికురోభూషణం ♦ బైన శ్రీలక్ష్మికి
సమతుల్యమీనాతి ♦ జాడఁజూడ
నలువవాక్స్థానంపు ♦ నలినాక్షివాణికిఁ
సమతుల్యమీనాతి ♦ జాడఁజూడ

సురరాజుభార్యయై ♦ శోభిల్లెడుశశీ
సమతుల్యమీనాతి ♦ జూడఁజూడ

గీ॥ మగనికనుకూలసతులకు ♦ సిగలఁబూవు
గవుల పెన్నిధిబుధులకుఁ గల్పతరువు
పౌరజనముల ముంగొంగు ♦ పసడిగాఁగ
నయతివర్తిల్లు వేంకట ♦ నర్సమాంబ. 145

గీ॥ సరసిజాక్షులనల్వుర ♦ శాంతమతులఁ
గూతులఁగాంచిచక్కని ♦ కొమరునొకనిఁ
బడసివడసెను నోముల ♦ పంటగాఁగ
మన్మథాకారుగుణగణ్యు ♦ మహితశీలు. 146

గీ॥ కనులపండువగాఁగను ♦ కాంచి సుతుని
నామకరణంబుఁజేసిరి ♦ ప్రేమనలర
సచ్చిదానందరావన ♦ జగతిఁదనరఁ
దల్లిదండ్రులుభూరిమో ♦ దంబుఁగనుచు 147

క॥ ఆశిశున్న సేయుకీర్తిదంబు
దశదిశలవెలుఁగఁగీర్తి ♦ దనరఁగఁబృథ్విన్
శశిధరుఁడో లేకహరియో
శిశువైజన్మించెననుచు ♦ శిష్టులువొగడన్. 148

సీ॥ బీరంబునం జేరి ♦ పేర్మిం బౌరులం గొలువు
నుండుచందమునం గూ ♦ ర్చుండ నేర్చు
ధర్మంబునాల్గు పా ♦ దంబులనడపించు
ననురీతివత్స జో ♦ గాడనేర్చు
పల్కంబల్కనం దేనె ♦ లొల్కంగా నొక్కొక్క
పలుకులుముద్దుగాం ♦ బలుకనేర్చు
వర్ణాశ్రమంబుల ♦ వరుసం దప్పకయుండ
నిలిపెదననుభంగి ♦ నిలువనేర్చు
గీ॥ బాలుండీరీతిం గ్రీడలం ♦ బ్రబలుచుండి
మోదమునం గూర్చుముద్దుల ♦ మాటగాంగ
దల్లిదండ్రులకనిశంబుం ♦ దనయుండైన
సచ్చిదానందయువరాజు ♦ శాస్త్రితుండు. 149

చ॥ సుతుడనుకూలుడై వెలయ ♦ సూనృతచారిణి నర్మ్యమాంబస
మ్మతినిజబంధువుల్ హితులు ♦ శాస్త్రవిశారదులైన సత్కవీ
తతియునుపండితావళిస ♦ దాతనుం జేరి భజించుచుండ శ్రీ
పతికృపనారసింగన్నృప ♦ భాస్కరుకీర్తి వెలింగ నల్దిశల్ 150

సీ॥ తనవినిర్మలకీర్తి ♦ యనిశంబు భూపాల
నరులకుమిగుల సం ♦ బరముం గూర్పం

దననిరంతరమహా ♦ దార్యంబుసకలార్థి
జనులకుఁగల్పభూ ♦ జంబుగాఁగ
దనభుజాటోపంబు ♦ దర్పితరిపుప్రాణ
చయముకుఁగాలపా ♦ శంబుగాఁగఁ
దన దయారస దృష్టి ♦ ధారుణీజనముల
పాలిటముంగొంగు ♦ పసడిగాఁగ

గీ॥ వలరిజగమారురణవీరు ♦ ఘనవిదూరు
సరసగుణగణ్యునరసింగ ♦ క్ష్మాతలేంద్రుఁ
డాయురారోగ్యసిరులతో ♦ వలరిపృథ్విఁ
గీర్తిగాంచుత(శ్రీ)హరి ♦ కృపను ధరను. 151

వ॥ అనియిట్లు తద్వంశావతరణంబ భివర్ణించియభ్యుదయ పరంపరాభివృద్ధియు నభీష్టఫలసిద్ధియుంగా నాశీర్వదించి నాయొనర్పంబూనిన శ్రీరుక్మిణీ కళ్యాణ కథాక్రమంబెట్టిదనిన.

శ్రీరస్తు.

# కథాప్రారంభము.

క॥ శ్రీమహిమోన్నత శుభకర
నామాశ్రిత పారిజాత! ♦ నారదవినుతా!
భీమాసురభూభృత్సు
త్రామా! సుగుణాభిరామ! ♦ రవికులసోమా! 1

గీ॥ సూతు బహుపురాణ కథాస ^ మేతు నిఖిల
భువనవిఖ్యాతుఁ బరిపూతు ♦ బుణ్యచరితుఁ
గాంచి మునిముఖ్యు లడిగిన ♦ కథల శుకుఁడు
పాండవాన్వయు తోనిట్లు ♦ బలుకఁ దొడఁగె. 2

ఉ॥ ధీరుఁగు రైవతుండుమును ♦ తేకువతోడ విరించియాజ్ఞచే
సారసగంధినిన్ సుగుణ ♦ సాంద్ర విశారదయైన రేవతిన్
మీఱిన ప్రేమ బంధులను ♦ మేలుసుపర్వులు మెచ్చ, హెచ్చుఁగా
సీరికినిచ్చి పెండిలిని ♦ జేసె బుధుల్ నుతిసేయ భూపరా! 3

క॥ మును నీకు నీకథాకృతి
వినుపించితిఁగాదె భూప! ♦ విస్మయమలరన్
వినినాఁడ విప్రుడుమాధవు
ఘనమగు కళ్యాణగాథ ♦ కరము వచింతున్ 4

మ॥ గరుడుండాసురనాథుఁగెల్చిసుధమున్ ♦ గైకొన్న మార్గంబు
ధరణీనాథులఁజైద్యసాళ్వులభుజా ♦దర్పంబు వోనాడి శ్రీ [నన్
కరచంద్రాననఁ బద్మ భీష్మకసుతన్ ♦ కంజాక్షిని న్ రుక్మిణిన్
వసుగుండై హరి తెచ్చె, వేల్పులుసుమా♦వర్షంబువర్షింపఁగన్. 5

క॥ అనవిని యర్జున పౌత్రుఁడు
మనమునఁదళుకొత్త ముదము, ♦ మౌనీంద్రునితో
వినయంబుఁగదుర నిట్లనుఁ
జనువును నాకకొంతగలిగి ♦ జ్ఞానవరుఁడవనిన్ 6

క॥ ఒక్కఁడె కృష్ణుం డెటువలె
జక్కడఁచెను బోరిమగధ ♦ చైద్యుల ననిలో
నక్కజముఁ దోచె నెమ్మది
నిక్కము వచియింపు మౌని ♦ నెమ్మి యనవుడున్ 7

క॥ సులభంబులు ముక్తికి. మద
కలభంబులు గామలోభ ♦ కంజములకు, దుః
ఖలతాపంబులు శమన మనో
చలనంబులు, కృష్ణనామ ♦ సంస్మరణంబుల్ 8

క॥ పరమేశు విమలచరితముఁ
బరమంబగు భక్తి వినిన ♦ భవహారముగునో
కరుణానిధి! బుధనుత ముని
వర! తెలుపుఁగదయ్య! విన ♦ వాంఛింతు మదిన్. 9

వ॥ అనవిని శుకమునీంద్రుఁ డిట్లనియె. 10

మ॥ సకలాధీశుఁ డనంతుఁ డవ్యయుఁడు సా ♦ క్షాద్విష్ణుఁ డీధాత్రిలో
నకళంకంబుగఁ గృష్ణరూపమున మా ♦ యామానుషాకారియై
టకునౌ మూలములక్ష్మి భైష్మియయి బుట్టన్ హేతు వేదవ్యాసో
సకలంబున్ వినిపింతు నయ్య! వినుమా! ♦ క్ష్మానాథ వంశోత్తమా!

చ॥ ఇలను విదర్భదేశమున ♦ కెంతయు వన్నెనుఁ బెట్టి భవ్యమై
వెలయుచు రాణఁ జెంది నృప ♦ వీరునికిన్ నిలయంబుగాఁగ శో
భిలుచును కుండినంబనెడి ♦ పేరున వర్థిలుచుండె నీధరా
లలనకు భూషిణంబనుక ♦ శన్ సిరులొప్పుచునుండు నప్పురిన్ 12

క॥ అతులప్రాభవసుశ్రీ
యుతమై నట్టిళ్లఁ గీర్తి ♦ యొప్పుచుఁ దేజో
వితత శతఘ్నీ శతపరి
వృతమై యప్పురము వెల్లు ♦ విశ్రుత భంగిన్ 13

గీ॥ చారుతర శిల్పనైపుణీ ♦ సర్వశస్త్ర
మంత్రసముదాయ రిపుభయ ♦ తంత్రసీయ
హాటకాంచిత సౌధక ♦ వాటగోపు
రములతో నొప్పివెల్లు నా ♦ రాజధాని. 14

సీ॥ సూతమాగధ యోధులు ♦ సురుచిరముగ
నిండికొలువుండఁ గన్నుల ♦ పండువయ్యె

వార వనితల నృత్యోత్స ♦ వములతోడ
నలరుచుండును సురలోక ♦ మనఁగ భువిని. 15

క॥ కరి హరి రథ వైమానిక
పరివృతమై ఘనగభీర ♦ పరిఖావృతమై
పరులకు దుర్భేద్యంబై
కర మొప్పుచు నప్పురమ్ముఁ ♦ గ్రాలుచునుండెన్ 16

చ॥ అలరఁగ నప్పురోప వన ♦ మందున హంసలు రాజకీరముల్
సలలిత శారికా విహఁగ ♦ సంతతిఁ గూయఁగఁ గోకిలంబులుం
జెలఁగి నినాదముల్ వరలఁ ♦ జేయఁగ నావనలక్ష్మి సొంపు పెం
పలరఁగ నృత్యగాత్రముల ♦ నచ్చట నాడెడి రీతిఁ గాంచెడిన్.

వ॥ ఇట్లు భాసమాన తేజోవిరాజితంబగుచుండిన నగరంబు నిఖిల సంపత్సముదాయసంచితంబైన యలకాపురంబుఁ బోలి, పరబ్రహ్మవిచారణ తత్పరంబగుటచేత సత్యలోకంబు కైవడి, దివ్యమగు దేవభాషా వైష్ణవాలంకార పరిశోభితంబగుట కతంబునఁ బుండరీకాక్ష పాలితంబగు వైకుంఠంబు లీల, దృఢతపస్సంపన్న సిద్ధ ప్రకాశంబగుటవలన ప్రమథగణసేవిత రుద్రపరిపాలితమగు కైలాసంబు పగిది, సకలజన మనోరథ సఫలీకృతంబగు కారణంబున భోగవతీ పురంబు రేవఁ బవిత్రం శైకమనీయ కమల కల్హార రాజహంస బకజలాకాది విరా

జితంబులగు సరోవరంబులను, సరసజనక్రీడా యోగ్యంబులగు నుద్యానవనంబులును, గజరథాశ్వములఁ విచ్చలవిడిగా నడయాడుటకు మేఁగురజితచూర్ణ మిశ్రితమయంబై ధవళాకృతిని వెలింగెడి రాజమార్గంబులను, రాజమార్గంబుల నుభయపార్శ్వంబుల రసాలసాలంబులును, సాలంబుల కడ్డంబుగాఁ గట్టంబడిన విద్యుద్దీపికాతంతువులును, తంతుమధ్యాంతర్గతంబునఁ బ్రజ్వలిల్లెడి దీపికాగోళంబులుఁగలిగి దేవేంద్రపురంబును ధిక్కరించెడిచందంబున మణిస్థగిత కనకహార్మ్య సముదయప్రకాశంబునుంగల్గి సకలసౌభాగ్యసాలంకృతంబై యొప్పెడి నప్పురంబున.

ఉ॥ అరయఁగ నప్పురద్విజులు ♦ నచ్యుత చవ్యపదారవింద సంస్మరణముఁజేసి వేదములు♦జక్కఁగ దాముబఠించి ధర్మమాచరణముఁ జేసిపౌరులకుఁ♦శాస్త్రములన్నియు నేర్పినిచ్చలుఁగా సురలనుమించె భూసురులు ♦ సూనృతవృత్తిని నెల్లవేళలఁగా

సీ॥ స్నాన సంధ్యలు ధ్యానమ్ము ♦ జపము తపము
విధిగ నిత్యాగ్ని హోత్రంబు ♦ విడున కెపుడుఁ
దిరుగుచుందురె గాని జం ♦ దెములుఁదీసి
వరికెలను బెట్టరప్పురి ♦ బాపలెపుడు. 20

చ॥ అమరఁగ దేవదానవుల ♦ సంచిత బాహుబలంబుగేరి, ధీ
[illegible] ప్రతిలంపఁ [illegible]

దమకముతోడఁ బోరఁగల ♦ ధైర్యముఁ గల్గియు నర్థిరక్షణా
సుమతులు వీరవర్యులయి శోభనమూర్తులు క్షత్రియోత్తముల్

చ॥ ధనదుని నీసడించి విభు ♦ ధావళినిన్ దగనాదరించి స
జ్జననుతమైన ధర్మములఁ ♦ జక్కఁగ జేయుచు నెల్లప్రొద్దులం
బనివడి నీతిశాస్త్రముల ♦ పద్ధతిఁ గాంచియుఁ గూర్మిబీదలన్
గనికర మొప్పఁ బ్రోతురతి ♦ గౌరవనీయులు వైశ్యులప్పురిన్

గీ॥ అనఘ! నాల్గవ జాతివా ♦ రతులమైన
ఘనపరాక్రమ మహావీర్య ♦ మున వెలింగి
కృషియు గోరక్షణంబునఁ ♦ గరలుచుండి
ప్రబలి వర్థిల్లుచుందు రా ♦ పట్టణమున. 23

ఉ॥ జారులు లేరు పేర్కొనఁగఁ ♦ జారు లసద్గుణరూపులే యనా
చారులు లేరు, తత్త్వసువి ♦ చారులు, శూరులె ఘోరతస్కరా
కారులు లేరు, నిచ్చలుప ♦ కారులు గాని తలంప నప్పురీ
పౌరులలోన నెచ్చటను ♦ పాపులు కోపులు లేరుచూడఁగన్.

ఉ॥ ఆపురి నేలుధాత్రివరుఁ ♦ డుంచిత భూరిభుజాబలంబు చేఁ
జాపముఁబూని వీరరిపు ♦ శక్తులడంచుచుఁ గీర్తినల్దిశల్
వ్యాపిత మొందఁగా సుజన ♦ వందితుఁడై యలరారుభీష్మరా
ట్భూపతి భీష్మకుండనెడి ♦ భూపలలాముఁడు మేదినీవరా!

వ॥ ఆమనుజేశ్వరుండు కొంతకాలంబునకు నిజకాంతయందు.

సీ॥ రుక్మి రుక్మరథుండును ♦ రుక్మబాహు
రుక్మకేశియు మీఁదట ♦ రుక్మనేత్రుఁ
డనెడి నేవురుపుత్రుల ♦ నంతఁగొంత
కాలమేఁగఁగ నొకసుతఁ ♦ గాంచె నతఁడు. 27

ఆ॥ పాల కడలి వోలెఁ ♦ బార్థివు గేహంబు
దనరఁ దొడఁగె నూతు ♦ తనకుఁ గలుగ
సిరినిఁబోల్పఁదగిన ♦ చిహ్నంబులోఁబుట్టె
నంచుసంతసించె ♦ నధిపుఁడధిప! 28

చ॥ కరమపురూపమై చెలఁగు ♦ గౌరవమొప్పఁగ విప్రకోటికిన్
బరఁగనభీష్టమై వెలసి ♦ భాసిలు కాంచనరత్నహారముల్
పరమసుకీర్తితో నొసఁగి ♦ బంధుల మిత్రుల నెల్లవారి సం
భరితముదంబుఁగూర్చి నిజ♦పంక్తిని వారికివిందొనర్చుచున్.

ఉ॥ అత్తరి హేమరత్నమయ ♦ హర్మ్యతలంబున సంతసంబునన్
జిత్త వికాసమౌ మణివి ♦ శేష సమంచిత రమ్యడోలకన్
బుత్తడి బొమ్మనాగ నృప♦పుత్రిక నూపుచు జోలపాటలన్
మత్తమరాళగామినులు♦ మంజుగళంబుల బాడిరెంతయున్.

వ॥ అంత గొంతకాలంబున కాబాలిక కన్నప్రాశనంబుఁగావింప
మెసవక నాగడంబుసేయ దాసీజనంబులా శిశువును జాక

నిడుకొని సౌధాంతరంబున నిలువంబడి యాచిరుతనుబుజ్జ
గించు నుపాయంబుఁ గానక నాకసంబునంకఁ నిండుచందురుని
వ్రేలఁజూపుచు నిట్లనిరి. 31

ఉ॥ అల్లదె తారకాధిపతి ♦ యాకసమందున నిన్నుఁజూచి రం
జిల్లుచు దుగ్ధముల్ మధువుఁ♦జందెడియాకదళీఫలంబులున్
గొల్లలుగాఁగఁ దెచ్చెనిది కూరిమిఁ గైకొనుమమ్మ యంచురం
జిల్లఁగఁ జేతురాసతులు ♦ చిన్నితనూజగు రాజపుత్రికిన్.

ఆ॥ రజత పాత్రమందు ♦ రాజిల్లు నన్నంబు
పసడిపాత్రియందు ♦ పాలుఁ బోసి
చందమామఁజూపి ♦ సంతోషమునఁ బువ్వ
దినఁగఁ జేతురధిక! ♦ తెలివ లప్పుడు. 33

వ॥ ఇట్లు దినదిన ప్రవర్ధమాన యగుచు ద్వాదశ వర్షంబులు
నిండిన యాబాలికామణి. 34

ఉ॥ అచ్చపు వజ్రహారతతి ♦ నక్కునఁ దేజముసొంపునింపఁగా
నచ్చెలు లందరిన్ గొనకట♦ నయ్యాములో జతఁగూర్చియాడుచున్
ముచ్చటఁగూర్చుచుండె కడు♦ముద్దులమాటలఁ దల్లిదండ్రులన్
హెచ్చుగ నాటపాటలను ♦ నింపుగ రుక్మిణి శైశవంబునన్. 35

సీ॥ చిగురుటాకులఁ బోలు ♦ చిన్నిచేతుల తోడ
బొంగరంబులఁ ద్రిప్పి ♦ భంగియాడు

బాలికామణులతోఁ ♦ బఱువెత్తి యొకసారి
బ్రీతితో దాఁగురు ♦ మూఁతలాఁగు
కమలాక్షి యొకమారు ♦ కౌతూహలంబొప్పఁ
గ్రిమముతో నచ్చన ♦ గాయలాడు
సంతసం బిగురొత్తఁ ♦ జపలాక్షి యొకవేళ
బూలబంతుల నాడ ♦ బూనుచుండు

గీ॥ గూర్మిఁ జెలరేఁగి యోమన ♦ గుంటలాడు
పిల్లలం జేరి చిరుతన ♦ బిల్లలాడుఁ
బ్రీతి రెట్టింప బొమ్మల ♦ పెండ్లిసేయుఁ
గోరి సఖులను గుజ్జన ♦ గూళ్లువెట్టు. 86

క॥ ఆ లేతప్రాయమందున
బాలికలఁ గూడియాట ♦ పాటలఁగదురన్
బాలామణి రుక్మిణిఁగని
చాలఁగ మది సంతసిలెను ♦ జననీ జనకుల్. 87

సీ॥ ఆపిన్నపాప దా ♦ నభివృద్ధిఁ బొందుచు
స్వేచ్ఛగాఁ దిరుఁగాడ ♦ సిగ్గుఁగనియె
మగవారి యెదుటను ♦ మగుడ నిల్వఁగ జంకె
తరుణముగాఁ [illegible] ♦ [illegible]

వింతవింతలు మేన ♦ వెలఁది కాంచఁదొడంగె
దొలఁగనీయదు సైపు ♦ నెలఁత యెపుడు
వాలుచూపులు వింత ♦ యొయ్యారములనేర్చి
పలుకులందునఁ దేనె ♦ లొలకఁజేసె

గీ॥ ప్రౌఢభామలు ఝషకేతు ♦ భావములను
కలుగుముచ్చట లాడెడి ♦ నెలవులందు
నుండగాఁబోదు సిగ్గున ♦ నుంకునొకట
శైశవముఁబోయి యౌవన ♦ సంభవమున 38

సీ॥ నిడుద పెన్నెరివేణి ♦ జడసోయగమునింప
నెమ్మొగంబునఁ దేట ♦ నిండుకొనియెఁ
గనుఁదోయి లోసిగ్గుఁ ♦ గానుపింపఁగసాగెఁ
జెక్కులందున మెఱుపు ♦ లెక్కువయ్యె
కలదొలే దనురీతిఁ ♦ గలమధ్య మముతోడ
నందమైనట్టి నూ ♦ గారుఁదోచె
నూత్నయౌవనలక్ష్మి ♦ నోమినఫలమునా
గురునితంబప్రభా ♦ పరులుఁదోచె

గీ॥ నడకలందున హంసల ♦ నుడుకు మాన్పి
బలుకులందునఁ జిలుకల ♦ కలుకఁజేసె

నవ్వులందున మల్లిక ♦ క్రొవ్వణంచె
రమణి రుక్మిణి యవ్వనా ♦ రంభమందు. 39

ఉ॥ అంతట రుక్మిణీమణికి ♦ నంచితమై చనుదోయయొప్పన
త్యంతము మానసాబ్జమున ♦ నంగజభావములంకురించె మో
మెంతయుఁ దేజరిల్లె, శిరు ♦ లీనుచు నానళినాక్షి చూడ్కులున్
గంతునిమేలు బాణముల ♦ కైవడి దోఁచె మనోహరంబుగన్.

మ॥ తలుకొత్తేమల్లి పసందిబొమ్మకరణిన్ ♦ దట్టంపు నెమ్మేని చా
యలు నద్దిక్కుల గ్రమ్మి పర్వఁగ వయ ♦ స్యాబృందము గూడి తా
బలుసంతోషము తోడ సుందర వనా ♦ వాసంబునన్ జూడఁగాఁ
గలకంఠీమణి యేగె మానసమునం ♦ గౌతూహలంబొప్పఁగన్

వ॥ ఇట్లు సఖియలంగూడుకొని చతుర్వినోదంబునకై నిర్మించిన దర్శనవనంబునఁ బ్రవేశించి యందుగల లోహపంజరాంతర్గత సింహశరభ శార్దూల శశిశల్య భల్లభల్లూక సారంగ సాలావృక వరాహ మహిష మహాలాంగ మర్కట నిఖిల మృగావలోకనంబుఁ జేసి, హర్షించి, శారికాకీర మయూర హంస కారండవ కుక్కుట జలకుక్కుట బకబలాక విహంగ కలకలరవంబుల నాకర్ణించుచు, చిత్రవిచిత్ర ధర్మ్మ వినిర్మిత సాలభంజకలం గాంచి సంతసించి, యావనమధ్యంబున

మణివిభాసితంబైన కొండొకమందిరంబునఁ బ్రవేశించి
నృప నృపకుమారుల చిత్రపటంబులం బరిశీలించి యువ్వా
రలయన్వయ నామగోత్రంబులు నెచ్చెలినడుగ నాయిందు
నిభాస్య క్రమంబుననిట్లు వక్కాణింపఁదొడంగె. 42

చ॥ సరసిజనేత్రి! యీనృపుఁడు ♦ సంగరమందు విరోధివర్గముల్
ధరణిని మ్రగ్గఁజేసి నిజ ♦ దర్పిత ఖడ్గప్రతాపకేళిలో
నరిబలమంత ద్రొక్కువడ ♦ నంచిత బాహుబలుండు సజ్జనా
భరణుఁడు ధర్మవర్తనుఁడు ♦ భద్రతమాళవ నేలునీతఁడే!

ఉ॥ వీరుఁడితండు మేటిరణ ♦ విక్రము తేజులఁ బేరుఁగన్న గం
భీరుఁడు భాగ్యవంతులఁగు ♦ బేరుఁడుఁ బోరున మేటి విక్రమా
కారుఁడుమారుగేరువర కాంతులతో వెలుఁగొందుసుందరా
కారుఁడుదుర్జనప్రకర ♦ కాలుఁడుధీరుఁడు చైద్యుఁజూడుమా!

మ॥ అతివా! యీతఁడు ద్రావిడాధిపతి పో ♦ రండంగ లేకెందఱో
క్షితిలోనన్ గడుభీతిఁ బాఱ ధృతియ ♦ క్షీణప్రతాపంబునన్
గుతుకంబొప్పఁగ మేదినీతలమునన్ ♦ గోదండ ముంబూనిదు
ర్గతులన్ బట్టఁగఁ జేయువాఁడు నృపులన్ గంభీరయుద్ధంబునన్

శా॥ ఏణీలోచన! యీమహీధవుఁడు ధా ♦ త్రీశాసితంబందు వే
పాలించినావయుంబ్బానినంతట నదిక్కాంతల్ భయంబొందియా

క్షోణింబాహియుగంబుఁ బ్వొలెత్తుదురు శ్రీశూలిందగంగొల్చిదా
ర్బాణంబుల్‌గలబాణముల్ వడసెభూపాలాన్వయుల్ జూడవే!

వ॥ అంత వేరొక పార్శ్వంబునంగల పటంబుల నన్నియుం జూపుచు. 47

సీ॥ సుదతి! చూచితె నృప ♦ సోముఁడీతఁడు పృథ్వి
పాలించు కొంకణ ♦ ప్రభువితండు
నతివ! కాంచుము వీని ♦ యందమ్ము చందమ్ము
నేపాళదేశపు ♦ నృప వరుండు
పడతి! విలోకించు ♦ భాసురంబుగ లాట
దేశంబునేలు మ ♦ హీశుఁడితఁడు
గుటిలకుంతల! చూడు ♦ కుంభినీంద్రులలోన
నందమొప్పెడి పాండు ♦ నందనులను

గీ॥ అంబుజాతాక్షి! కాంచితే ♦ యమరవిభుని
సముఁడు ధృతరాష్ట్ర నృపుపెద్ద ♦ కొమరుఁడితఁడు
నతఁడు కర్ణుండు వీరుఁడు ♦ నర్కతేజుఁ
డవనినాథులు వీరలు ♦ నరయుచెలియ! 48

వ॥ అనియిట్లు పటంబులన్నియుం జూపుచుఁ బిమ్మట దివ్య మాలాలంకృతంబైన యొండొకపటంబు దెసకుంజనియిట్లభి వర్ణింపఁదొడఁగె. 49

సీ॥ నీలరత్నచ్ఛాయ ♦ నెగడు కాయంబునఁ
గనకాంబరంబునుఁ ♦ గ్రాలుచుండ
బహువిశాలంబైన ♦ భాసిల్లువక్షంబు
శ్రీవత్స లాంఛన ♦ శ్రీలువెలుఁగ
మస్తకంబునదివ్య ♦ మణికిరీటముఁగర్ణ
కుండలంబులుకాంతి ♦ గండుమిగుల
జానులనంటుహ ♦ స్తముల శంఖముఁ జక్రి
మును ప్రకాశింపఁగ ♦ ముదముఁగోప

గీ॥ ఫాలతలమున తిరురేఖ ♦ పరిఢవిల్ల
హారవితతులు నురమునం ♦ దతిశయింప
భళిర! యీరాజ కందర్పు ♦ చెలిమినీకుఁ
గలుగవలదె! తొలిపుణ్య ♦ ఫలము కలిమి. 50

వ॥ దేవి! యీరాకుమారుని చరిత్రంబించుక నెఱింగించెద
వినుమని యిట్లుచెప్పందొడంగె. 51

చ॥ యదుకులవార్ధిచంద్రుఁడుద ♦ యాగుణసాంద్రుఁడమందసుం
స్పదుఁడమలప్రతాపుఁడువి ♦ శాలయశోనిభమూర్తిసంతత [దరా
త్రిదశగణార్చితుండు వసు ♦ దేవతనూజుఁడు గోపికామనో
సదమలమానసాస్పదుఁడు ♦ చక్రధరుఁడగు కృష్ణుఁడీతఁడే! 52

గీ॥ బాల్యమందున గోపికా ♦ వాటియందు
నాచరించిన లీలల ♦ నభినుతింతు
వినుము వినినంత నీకు నీ ♦ వేల్పుతేని
మీఁదచిత్తంబుఁ దగులకఁ ♦ బోదు తరుణి! 53

సీ॥ పాలుఁద్రాగెడి లేత ♦ ప్రాయంబు నందునే
బలితంపుపూతనఁ ♦ బొలియఁజేసె
మారుతాసురుఁ ద్రుంచె ♦ మద్దులఁ బెకలించి
బకనామ రాక్షసుఁ,♦ ఒట్టిఁజంపె
శంఖచూడునిఁ గూల్చెఁ ♦ జక్కాడె వృషదైత్యుఁ
గేశిరాక్షసు వ్యోము ♦ గీటణంచె
నఘరాక్షసునిఁ దేర్చె ♦ నతులకాళియునొంచె
దవశిఖమ్రింగి గో ♦ త్రముధరించె

గీ॥ బరగజాణూర కంస స ♦ ద్బలులఁ దునిమె
నలజరాసంధ మూర్ఖులౌ ♦ ఖలులఁ దఱిమె
నరయనిల్పెను,ద్వారకా ♦ పురిని జలధి,
మనుజమాత్రుండె రుక్మిణీ! ♦ మాధవుండు. 54

ఉ॥ చెప్పెడిదేమి కృష్ణు యదు♦శేఖరు చక్కదనంబుఁగన్నులం
దప్పకజూచిరేని యల ♦ దర్పక ఘోరశిలీ హతాత్ములై

యొప్పుల కుప్పలైన గరు ♦ డోరగ కిన్నర నాగకన్నెలున్
ముప్పిరిగొన్న మోహమున ♦ ముద్దియ! బుద్ధిచలింపకుండు రే

శా॥ ఆపూత వ్రతమైన గోపవనితా ♦ యంకంబునందుండియీ
గోపీమానస రాజహంసముదయా ♦ కూపారుఁడై బాలుఁడై
వాపీపర్వత భూనభోంతరములన్ ♦ వర్ధిల్లు రేపల్లియున్
జూపించెన్ దనమోమునందునమహా చోద్యంబుగాఁదల్లికిన్

శా॥ ఆదివ్యాత్మకుఁడైనమాధవుఁడు సత్యంబెంతయున్ బృథ్విలో
మోదంబొప్పఁగనిల్పిదుర్జనబలం ♦ బుల్ భస్మమొందింపఁగా
వైదర్భి! భవదీయ రూపవిభవై ♦ శ్వర్యంబె మూలంబుగాఁ
జేదీ మాగధ గర్వచిత్తులఁ గడున్ ♦ ఛేదించుఁజక్రంబునన్.

వ॥ ఇట్లుమాయా మానుషక్రీడాలోలుండైన గోపాలమూర్తి విచిత్ర చరిత్రంబు నెచ్చెలిచే నెఱింగి, రుక్మిణీమణి య వ్వసుదేవనందనుచిత్రపటంబునఁ గనుంగవనిల్పి యంజలి బద్ధయై తత్పదార విందధ్యాన నిష్ఠాగరిష్ఠత్వంబున జలనం బులేని ప్రత్తడిబొమ్మవోలె నిలువంబడి యంతటమేల్కాని చేడ్పోడు వాడోడుగా యున్ననిజసఖింగని. 58

చ॥ సకలబుధార్చనీయుఁడగు ♦ శౌరిగుణంబులఁ నెల్లపొద్దుమ
న్నికటము జేరిచెప్పెదర ♦ నేకులు నేనట మోదమొందుచున్

బ్రకటితమొప్పవిందుసుర♦వంద్యునిదివ్యచరిత్రమెంతయున్
సకియరో! చక్రిరూపమును♦చక్కఁగ జూచితి నీపటంబునన్

మ॥ అని తా నెచ్చెలితోడఁ జెప్పినపు♦డాయబ్జాస్యయున్ రుక్మిణీ
వనితారత్నముఁ గాంచి తా ననియె నో♦వైదగ్ధి! నిక్కంబు నీ
జనయిత్రీజనకుల్ యదూద్భవుని మె♦చ్చం జేసియువారు నీ
కనుకూలంబగురీతిమాధవునిఁ జయ్యన్ గూర్పయత్నించెదన్

వ॥ అనియిట్లా నెచ్చెలి ముసిముసి నగువులతో ముచ్చటించిన భీష్మకనృపాల పుత్త్రి సంతసించి నిజసఖులంగూడి వనంబు వీడి నిజమందిరంబునకుం బోవుచు నిట్లనియె. 61

ఉ॥ ఓరమణీమణీ! తగని♦యూరట లేలకొ సేయ నెంతు వా
వారిజనేత్రునిన్ సుగుణ♦వంద్యునిఁ గృష్ణుని నందసూనునిన్
జేరఁగ నిచ్చునా చెనటి ♦ చేతలుఁ జేసెడి రుక్మి, శ్రీహరిన్
గోరఁగ నిచ్చునా తెలియఁ♦గోరెద జెప్పుము! కార్యతంత్రమున్

గీ॥ అనెడి రుక్మిణిఁ జూచి యో ♦ యంబుజాక్షి
చింత నొందెద వేల నీ ♦ వింతలోనఁ
బంతమలరఁగ యదువంశ ♦ పావనునకు
సతివియయ్యెదు వెఱవకు ♦ సారసాక్షి! 63

క॥ నవలా! నీచిత్తం బభి
నవ లావణ్యంబుఁ దెలుఁగు ♦ నలినాక్షునకుం

చెవిసోఁకఁ జేసియంతటఁ
దవిలివెసన్ బిలువసేతుఁ ♦ దాత్పర్యమునన్. 64

క॥ అనునెచ్చెలి మృదుసూక్తుల
వినితా హర్షంబునొంది ♦ వికసితముఖయై
తనరారు ప్రేమతోఁ గడు
వినయంబునఁ బల్కెనిటుల ♦ వేడ్కఁ దలిర్పన్. 65

ఉ॥ సారసనేత్రి! నీదునెర ♦ జాణతనంబున మన్మనోరథం
బారయఁ దీరఁగా బరమ♦పావనమా హరిపాదయుగ్మమున్
గోరికలార నాకనుల ♦ కున్ గనిపించినయంత, దివ్యమా
హారములిచ్చుదానవిను♦మంబుజనేత్రిముదంబుమీరఁగన్.

వ॥ అనియిట్లా నిజసఖమనంబును సంతసింపఁజేసి. 67

సీ॥ జిలుగుపైఁటాణి కం ♦ చెల పిక్కటిల్లెడి
కులుకు జొబ్బిలు గబ్బి ♦ గుబ్బ లొప్ప
బిత్తరంపు బిసాళి ♦ బెళుకు వాల్చూపు
లొయ్యారమున మోహ ♦ వైఖరులర
నిడుద పెన్నెరివేణి ♦ జడను కీల్గంటలు
హారిమధ్య కటిపైని ♦ నాడుచుండ
గమలాక్షి మృదుపాద ♦ కంజయుగ్మంబునఁ
గనకంపు టందియల్ ♦ ఘల్లనంగ

గీ॥ నగుమొగంబున వెన్నెల ♦ నాట్యమాడ
రాజహంసంబు మాడ్కి-యా ♦ రాజవదన
చేరెనింటికి మాధవు ♦ జిత్రపటము
కంఠ్ల మోపులను గట్టిన ♦ కరణిఁ దోప. 68

వ॥ ఇట్లాయిందునిభాస్య నెచ్చెలులంగూడుకొని యంతిపురంబునకుంజనియె, తదనంతరంబొక్క దినంబున భీష్మకభూపాలుండుఁ గూతునకుం బెండ్లిసేయ నిచ్చగల్గి ధనగుణరూప యౌవనకులశీలంబు లొప్పెడివరుని విచారింపఁదలంచి యాప్తవరులగు నిజపరివారముంగని యిట్లనియె. 69

చ॥ అరయసుశీల రుక్మిణి మ♦దాత్మజ కేనిపుఁ గూర్మిఁబెండిలిన్
వరమరుదారఁజేయఁగను గాంక్షమదింగలదయ్య మీరుసం
భరితముదంబునన్ దెలియఁ♦బల్కుఁడువీరునిరూపసంపదా
కరుని లసద్గుణాకరుని ♦ గౌరవనీయుని బుద్ధిపెంపునన్. 70

వ॥ అంత నచ్చటంగల మంత్రిసామంత పురోహిత బాంధవ శ్రేణి యేకగ్రీవంబుగా "నీకూతునకు లోకనాయకుండైన శ్రీకృష్ణుండే తగువరుండని" నుడువఁదలంచి యువరాజును క్రూరచిత్తుండునగు రుక్మివాసుదేవుని యందుఁగిన్కవహించి సహోదరినిఁ జేదిదేశాధీశుండగు శిశుపాలుని కియ్యందలంచిన వాఁడని యెఱింగిన వారగుటచేతఁ దమ

తమమనోభిప్రాయంబులఁ దెలియంజేయ భీతిల్లి యుండు టంబట్టి, లోకరక్షకుండును సర్వభూతాంతర్యామియునగు శ్రీకృష్ణపరమాత్మ నిజవిభూతియగు విష్ణుమాయనుంబనుప, నయ్యాదిసభ్యులందరికి నన్నివిధంబులఁ జిరపరిచిత రాజకుమారుఁడునాఁ గనంబడి సభాముఖంబున నిలువంబడి నృపుండువిన, సభ్యులందరు నివ్వెరవడ, రుక్మిదార్జన్యమున కేమాత్రిముంజంకక నిట్లనియె. 71

చ॥ ఘనుఁడు కలండుద్వారకన♦ఖండపరాక్రమశౌర్యమూర్తి స
న్మునిహృదయాబ్జముల్ సతత♦మున్ నెలకొన్నపరాత్పరుండు స
జ్జనసుతుఁడైన కృష్ణునికి ♦ సారసగంధిని రుక్మిణీమణిన్
మనుజవరేణ్య! యిచ్చియస♦మానసుకీర్తినిఁబొందు మెంతయున్

మ॥ భవదీయోజ్జ్వల గర్భరత్నమగు న ♦ వ్పంకేరుహాస్యార్థమై
ధవునింగూర్చి యదేల చింతిలెదవో ♦ ధాత్రీశ! లేరెవ్వరీ
భువనాధీశులలోనఁ జూడఁగను స♦ద్బుద్ధిన్ విచారింపమా
ధవుఁడా దేవకిపుత్రుఁడే, వరుఁడుత థ్యంబెంతయున్ జూడఁగన్

మ॥ అలగోవర్ధన పర్వతంబుఁ దృటిలో♦నందంబుగా ద్రేలునన్
నిలిపెన్ గానలయాలగోపవరులన్ ♦ నెమ్మిన్ దగన్ బ్రోచి వే
కలుషాకారుల దుష్టనర్తనులఁ జ♦క్కంబోరిలోఁదున్మి తా
విలసత్ప్రాజ్యత నిల్పెధర్మచయమున్ ♦ విశ్వంభరాధీశుఁడై.

వ॥ అనవిని యిదియే సమయంబని. 75

ఉ॥ అంతబుధుల్ సుమంత్రులును ♦ భ్రాంతరమందుననిల్చిభూవరా
చింతిలనేల నీతఁడు వ ♦ చించిన మార్గము లెస్సబుద్ధి, ధీ
మంతుఁడుకృష్ణుఁడిమ్మహిని ♦ మానిని రుక్మిణినిచ్చి వేఱ య
భ్యంతరముల్ దలంపక వి♦వాహముఁజేయుముకీర్తిఁజేకుఱున్

క॥ అని పలుకు సభ్యులందరఁ
గని వారల సరకుఁ గొనక ♦ గర్వోన్నతుఁడై
కనలుచు రుక్మియుఁ బౌరుష
మునఁ బ్రేలుచుఁ బల్కె నిటుల ♦ మూర్ఖుండగుచున్. 77

ఉ॥ గొల్లలయిండ్లఁబాల్పెఱుగుఁగొల్లలుగాఁగడుపారఁద్రావిమ
త్తిల్లియరణ్యమందెపుడుఁద్రిమ్మరుచుండెడిగొల్లబోయినిన్
బల్లిదుఁడంచు వీరలిటఁ ♦ బల్కఁగఁ గర్ణరసాయనంబుగా
నుల్లమునందుఁగోరివిను♦టొప్పునె! త్వాదృశులైనవారికిన్.

చ॥ సరసత బుద్ధిహీనులగు ♦ సభ్యులమాటల విశ్వసించుచున్
వరసుకుమారియున్ సుగుణ వైభవలక్ష్మియుమత్సహోదరిన్
బరమనికృష్టుఁడౌ హరికి ♦ భార్యగ నిచ్చుటఁజూడఁ బృథ్వీలో
గురుతర వజ్రపాత మొక ♦ కోఁతికి నిచ్చుటఁగాదె! భూవరా!

సీ॥ అనుచు యౌవన బలమున ♦ నాడు రుక్మి
మాటఁ గాదన కపుడు భీ ♦ ష్మక నరేంద్రుఁ

దూరకుండుటఁ బాడఁగాంచి ♦ యుగ్రుఁ డగుచుఁ
గుపిత మతియైన యారాజ ♦ కొమరుఁ జూచి. 80

ఉ॥ ఓనృపసూన! శాంతమున ♦ నొప్పిదమౌ సుజనాళి వాక్యముల్
పూనివినంగ లేవ! మద ♦ పూరితవాక్కులఁ గ్రుళ్లఁబోకు, తే
జోనయశాలివైనమధు సూదనుఁ గృష్ణుమహత్వమించుకన్
గానఁగ లేక మిట్టిపడి ♦ కానిదురూక్తుల నాడుటొప్పునే! 81

వ॥ వైకుంఠనాథుండైన నారాయణుండు భూభారనివారణా
ర్థమై దేవకిగర్భంబున నవతరించి, పాపప్రవర్తనులైన
తృణావర్త శంఖచూడ బకవృషభాసురుల బింకంబణంచి
సాధు సజ్జనజనంబుల కాహ్లాదంబొనరించినట్టి భగవంతుం
డగు వాసుదేవుని కపకారంబు నీబోటి యశఃకాములు
దలంచుట యుచితంబుగాదు. మనోవాక్కాయ కర్మంబు
లాపరమేశ్వరుని యందుం బొందుపరచి నెయ్యంబుగ నమ్మ
హాత్మునితో వియ్యంబంది, సద్గుణగరిష్ఠయగు భవత్స
హోదరినొసంగి భాగవత జనోపాసకుండవై, పుణ్యజన
సేవా సమాలబ్ధ యశోవిగత కల్మషుండవై, ధన్యుండవగు
మనిన, రుక్మి యామాటల కియ్యకొనక యిట్లనియె 82

సీ॥ గొల్ల పిల్లలఁ గూడి ♦ గోవులఁ గాచిన
వాఁడ' నాసోదరీ ♦ వరుఁడు' చూడ

పాలీయ వచ్చిన ♦ పడతి ప్రాణముఁదీయు
వాఁడ! నాసోదరీ ♦ 'వరుఁడు' చూడ
గొల్లకొంపల వెన్నఁ ♦ గొల్లఁ గొట్టిన ముచ్చు
వాఁడ! నాసోదరీ ♦ వరుఁడు! చూడ
మర్యాద లేకయే ♦ మామఁబట్టుకొఁ జంపు
వాఁడ! నాసోదరీ ♦ వరుఁడు! చూడ

గీ॥ చాలుఁ జాఋను మాటలు ♦ చాలునింక
గొల్లకులజుని దొంగను ♦ గుణము లేని
తుచ్ఛు, వ్యభిచారి, నీచుని ♦ తులువ నిచట
బల్లిదుండంచు సభలోనఁ ♦ బలుకఁదగునె!! 83

ఉ॥ మారహతిన్ వ్రజాంగనలమానములన్ హరియించినందుచే
జారుఁడనంగఁ బేర్వడిసి ♦ చౌర్యప్రవృత్తిని గొల్లలిండ్లలో
దూరుచు వెన్నదొంగిలెడు ♦ దుష్టచరిత్రుని మూర్ఖుగొల్లనిన్
శూరునిగాఁగ బల్కుటది ♦ చోద్యము! లోకులువిన్న నవ్వరే!

వ॥ అనిన విష్ణు మాయా విలాసుండగు రాజకుమారుఁడు
యువరాజగు రుక్మితోనిట్లనియె. 85

చ॥ పలుమరుఁ దెల్ప నేటికి నృ ♦ పాలతనూభవ! మాధవుండు దాఁ
జెలులనుఁగూడెనంచుఁ జెడు జింతలతో నిరసింపఁబూనుటల్

కలుషముఁగాని వేరొకటి ♦ కాదని నీమదినమ్ము! కృష్ణుఁడా
నెలఁతలకిచ్చె సాధువులు ♦ నెమ్మదిఁగానని నిత్యసంపదల్.

క॥ పంకరుహాసన వాసవ
శంకరులుం బొందనట్టి ♦ సత్ఫల మిచ్చెన్
బంకజ నేత్రుఁ, డెంతయుఁ
బంకజనాభుండు వారి ♦ భక్తికిఁబ్రీతిన్ 87

చ॥ హరిమదినెంచె నేనియిసు♦మంతయుఁ గష్టములేక రుక్మిణిన్
గరమనురాగ మొంద నృప♦కాననముల్ నిజచక్రదీప్తి ని
ర్భరముగ మట్టఁజేసి నర♦పాలతనూభవ! నీస హోదరిన్
ధరణిసుకీర్తిఁ జేకొనును♦తథ్యము నియ్యది యెన్నిభంగులన్

ఉ॥ పన్నగవైరి వాహనుఁడు ♦ పద్మదళాక్షుఁడు చక్రహస్తుఁ డ
త్యున్నత శక్తిమంతుఁడు ర♦ణోద్ధతిమిమ్మిఁకవచ్చి దాకినన్
జెన్నుదొరంగి నీవునిటు♦చేదివిభుండునుఁ బాఱుచుండఁగాఁ
గన్నులఁగాంచగాఁ గలవు ♦ కావర మేటికియిమ్ము రుక్మిణిన్.

చ॥ నరసురయక్ష కింపురుష ♦ నాగనభశ్చర సిద్ధసాధ్య కి
న్నర గరుడాదులందరు ర ♦ ణంబున మీకుసహాయులైననా
గురుతర బాహువిక్రమ న ♦ కుంఠిత తేజుని వాసుదేవునిన్
బరగజయింపలేరువర♦పాలతనూభవ! నమ్ముమెంతయున్.

చ॥ గురుతర శౌర్యుఁడయ్యు రణకోవిదుఁడయ్యు సమర్థుఁడయ్యు ని
ర్జరులకజేయుఁడయ్యు బుధ♦సంఘమునన్ దగఁబ్రోచిసద్గుణా

కరుఁడనుగీర్తిఁగొన్నహరిఁ♦గంసవిరోధినిఁ గూర్చి వైరముల్
నరవరపుత్ర! పూనుటది ♦ నాశమునొందుటగాక యన్యమే.

వ॥ అనవిని రుక్మియిట్లనియె. 92

చ॥ క్రచ్చరమాధవుండునిటఁగయ్యముఁజేయగఁబూనివచ్చినన్
హెచ్చగునాదువిక్రమము♦నేర్పడఁజూడకఁబోదుయుద్ధతిన్
వ్రచ్చెద ఖడ్గధార మధు ♦ వైరిని వైరముతోడ నాజిలో,
నిచ్చెదగాక రుక్మిణిని♦ నింపుఁదలిర్పఁగ చైద్యుకెంతయున్.

వ॥ అనిన విష్ణుమాయా విలాసుండైన రాజకుమారుండు కడుం
గడు కోపోద్దీపిత మానసుండై యిట్లనియె. 94

క॥ తగునిది తగదని మొదలో
నాగఁజింతన సేయకిట్లు♦ నొప్పని నుడుల్
బగఁగల్గి పలుకనేలను
నిగమార్చితు తోడఁ బోరి ♦నిలువం గలవే! 95

వ॥ అని యిట్లాతఁడు పెద్దయుంబ్రొద్దు దుష్టుండగు రుక్మితో
వితర్కించికనలిరూక్షవీక్షణంబున వానింభస్మమ్ముఁజేయం
దలంచి శ్రీకృష్ణాజ్ఞలేని కారణంబున శాంతుండై విష్ణు
మాయా విలాసుండగు రాజకుమారుఁడా సభనువీడి
జనియె. 96

గీ॥ అనుచు సూతుఁడు శౌనికా ♦ ద్యఖిలమునులు
సంతసింపఁగఁజెప్పిన ♦ సరణిశుకుఁడు
వరపరీక్షితు కారీతి ♦ వరుసఁజెప్ప
వినియు నవ్వల కథఁజెప్పు ♦మనుచునడుగ. 97

క॥ తరుణార్క వంశవర్ధన!
ధరణీసుత హృదయలోల! ♦ దానవహరణా!
సురవంద్య! మేఘసన్నిభ
వరదేహా! విమలచరిత ♦ వారిజనాభా! 98

మాలినీవృత్తము.

సరసిజనిభనేత్రా! ♦ చారుసీతాకళత్రా!
నిరుపమగుణశీలా! ♦ నిర్మలానందరూపా!
తరణికులవతంసా! ♦ దర్శితానందభూపా!
పరమసుజనపాలా! ♦ పాహిమాంరామచంద్రా! 99

ఇది శ్రీహనుమద్దేవ దయారస లసత్కటాక్ష
కలితాదుకీణ పుత్రము గోపనార్య పుత్ర
ఆంజనేయకవి కృత శ్రీ రుక్మిణీ
కళ్యాణమను కావ్యమునఁ
ప్రథమాశ్వాసము
సంపూర్ణము.

శ్రీరామచన్ద్ర పరబ్రహ్మణేనమః.

# శ్రీ రుక్మిణీ కళ్యాణము

## ద్వితీయాశ్వాసము.

శ్రీ జానకీ మనోహర
భూజనసురవంద్యవిమల ♦ పూతచరిత్రా!
రాజాధి రాజవందిత!
రాజీవ దళాక్ష రామ! ♦ రామ నరేంద్రా! 1

వ॥ శౌనకాదిమహామునులకు సూతుండెఱింగించినట్లు వ్యాస
సుతుండగు శుకుండా పాండవాన్వయునితో నిట్లుచెప్పం
దొడఁగెను. 2

క॥ నరవర! విను భీష్మక భూ
వరుఁడెంతయు రుక్మిమాట ♦ వలదన లేకన్
ధర చైద్య నృపుని కిచ్చుటఁ
బరిశీయు శుభలేక నిగాలఁ ♦ బంపెను ప్రీతిన్. 3

ఉ॥ రమ్మని గేందరి కుండినపురమ్మునకున్ గచివాప్తబాధుజా
లమ్ములఁ గూడికొని సఫలమ్ముగఁ బ్రీతికొసంగువాఁడ భా
గ్యమ్ము తప్పి రారన ♦ జాక్షి సన్నుత రుక్మిణీమణిన్
సమ్మతి నీవు గైకొనుము ♦ సంతసిలంగనుఁ జేయు భూవరా! 4

వ॥ అంతట నంతఃపురంబున రాజపుత్రితన్నుంగూర్చి జనకుండు వివాహప్రసంగంబుఁ జేయుటయు, సహోదరుని మూర్ఖపు బట్టును వీడంజేయఁజాలక రాజుసమ్మతించుటయు, శిశుపాలునిఁ బిలువనంపుటయు మొదలుగాఁగల విషయంబుల నెఱింగి చింతాక్రాంత మానసురాలై తనలోఁదానిట్లు వితర్కింపఁదొడంగె. 5

చ॥ సరసగుణాబ్ధిచంద్రుఁడగు ♦ చక్రిపదాంబుజ చింతనంబును
స్థిరముగ మానసాబ్జమునఁ ♦ జేరియు నుండఁగవీడనొప్పనే
పరమముదంబునన్ గనక ♦ పద్మములన్ భుజియింపనెంచునా
సరసులయందు హంసములు ♦ క్షారజలంబులనిచ్ఛఁగోరునే!

చ॥ వనజదళాక్షుదివ్యపద ♦ పంకజయుగ్మము భక్తితోడ నేఁ
గనులనుజూచుపుణ్యమగు ♦ కాలమదెన్నఁడువచ్చునో! హరిం
గనిమధురోక్తులన్ హృదయ కాంక్షనుదీరెడిభంగి నెమ్మదిన్
దనరుచు సంతసంపుఁగల ♦ దానన్! నావిధి యెట్టులున్నదో!

సీ॥ తగశిరంబున శౌరి ♦ తలఁబ్రాలు బోయఁగఁ
బుష్పరాశిని శంభుఁ ♦ బూజ సేతు
శ్రీవాసుదేవుఁడు ♦ చెట్టఁ బట్టిన బ్రీతి
ఫణిహారు నిరతంబుఁ ♦ బ్రణుతిఁ జేతుఁ

జక్కి నాతోఁ గూడి ♦ జలకంబు లాడంగ
శివదేవు కమ్మతాళి ♦ పేకమిత్తుఁ
బురుషోత్తముఁడు నాదు ♦ పొత్తునఁ గుడువంగ
నంగజారికి ధూప ♦ మమర నిడుదుఁ

సీ॥ కృష్ణుఁ జేతెంచి చైద్యుని ♦ కీలడంచి
వైరి మూకలఁ దునుమాడి ♦ పోరగెలచి
కరుణఁ జూచుచుఁ జేఁబట్టి ♦ గారవింపఁ
బరమ భక్తిని పార్వతీ ♦ పతినిఁ గొల్తు. 8

క॥ అని యిత్తెఱఁగున హరిపైఁ
దనచిత్తము నిల్పి విమల ♦ తాపసి వోలెఁ
మనమునఁ జింతిలు చుండఁగఁ
గనినెచ్చెలి యిటులఁ బల్కెఁ ♦ గాంతా మణితో. 9

సీ॥ విప్రవర్యుని శాస్త్రార్థ ♦ వేద విదుని
హితగుణాకరు మీపురో ♦ హితుని సుతునిఁ
బంపఁ గదవమ్మ ద్వారకా ♦ పట్టణంబుఁ
జేరి దోడ్కొని వచ్చుఁదా ♦ శ్రీనివాసు. 10

వ॥ అనియిట్లుఁ జెప్పిధరామరునిఁ దోడ్కొనివచ్చి నిల్పిన
రుక్మిణీమణి యావిప్రకులావతంసుని సముచితసత్కారం

బులఁ బూజించి పీఠంబొసంగి ముకుళిత కరకమలాంజలియై
యిట్లనియె 11

చ॥ ధరణిసురేశ పావన సు ♦ ధానిధి నీకృప నాదరించి యి
త్తరినుపకారమొండొకటి ♦ దధ్యముగానొనఁగూర్చ నెంచితు
ర్భరమగు నామనోవ్యసన ♦ మహ్నికడుంగడు నార్పనీకృపా
కరమగు వృష్టినిం గురిసి ♦ కావఁగదే బుధలోకవందితా!

గీ॥ అచును రుక్మిణి మరియు ని ♦ ట్లనుచుఁ బలికె
వరధరామర చక్రికి ♦ వైరియగుచుఁ
బాపమతి రుక్మి నను శిశు ♦ పాల నృపుని
కొసఁగ నెంచెను తండ్రియు ♦ నొప్పుకొనెను. 13

ఉ॥ ఓవసుధాసుధాశనక ♦ లోద్భవ చిత్తమునందు నెప్పుడుం
బావనమైన కృష్ణపద ♦ పంకజయుగ్మము సేవఁగోరుచుం
గేవలభక్తి భీష్మసుత ♦ కోరుచునున్న దటంచు నీవు నా
దేవకులావతంసు వసు ♦ దేవకుమారుని తోడఁజెప్పుమా?

వ॥ అనుచు రాకన్యయంగాంచి విప్రుండిట్లనియె. 15

ఉ॥ ఇందిరవీవు చూడఁదర ♦ లేక్షణ శ్రీహరి ధాత్రిలోన గో
వింపుఁడనంగఁ బుట్టె యదు ♦ వీరుల సంతస మొందజేసె నా
నందము తోడఁ జక్రహస్తి ♦ నాక విరోధులఁ గూల్చె నింక నా
సుందరమూర్తి సోయగము ♦ జూపెద నెందుర సత్యలోకము—

వ॥ అదియునుం గాక. 17

ఉ॥ నీవు చరాచరంబులకు ♦ నేత్రివు, సత్త్వతమః ప్రధానివై
పావనివై వెలుంగుదువు ♦ పంచమయాత్మకమైన తత్త్వముల్
నీవలనైన మువ్వురును ♦ నిన్నె నుతింతురు లోకపావనీ!
దేవి! శుభప్రదాయ భవ ♦ దీయముగాదె సమస్తలోకముల్.

వ॥ అని యిట్లు విజ్ఞానమయంబగు మృదుమధుర వచనంబుల స్తోత్రంబు సేయు నయ్యగ్రకులోద్భవుని భావనా నైపుణ్యతకు నెంతయు హృదయంబున మెచ్చుచు నిట్లనియె. 19

చ॥ అతఁడు పరాక్రమాఢ్యుఁడు మ ♦ హాగుణశీలుఁడు ధర్మవత్సలుం
డతిహితకారి కృష్ణుఁడు ద ♦ యాళుఁడుఁ గావున నీవుఁ జెప్పఁగాఁ
జతురత నాతెఱంగు విని ♦ చైద్యునిఁ బట్టి నిశాతమార్గణ
ప్రతతుల నొంచి సోదరు దు ♦ రధ్వముఁ బాపక మిన్నకుండునే!

చ॥ అనవిని విప్రుఁ డిట్లనియె ♦ నంబుజలోచన! నీదుకష్టమా
యనకునుఁ జెప్పియంతటను ♦ పాయము నేర్చిన శార్ఙ్గి శ్రీహరిన్
వనజదళాయతాక్షునిటఁ ♦ బంపియు నిర్వరియింపఁ జేయకే
వెనకను బోతి సేని విను ♦ విప్రపథంబునుఁ దప్ప దెంతయున్,

గీ॥ చింత సేయకు నీదగు ♦ చిత్తమందు
బద్మనాభుండు నిటవచ్చి ♦ పద్మగంధి!

నిన్ను వరియించుఁ దప్పను ♦ నిక్కువంబు
పఱుఁగులిడఁజేయు శిశుపాల ♦ పాపమతుల. 22

వ॥ అంతసంతసించి రుక్మిణీమణి. 23

శా॥ అన్నా! కృష్ణుని భక్తవత్సలునిసు♦వ్యక్తప్రతాపాత్మునిన్
నన్నుంబ్రోవఁగ వేగరమ్మనుముఖ ♦ న్నత్వంబు చేఁగ్రాగి నే
విన్నన్ జెందినదెల్లియుం దెలిపి య ♦ వ్వీరున్ హరిన్ మాధవున్
గ్రన్నన్ వచ్చియునన్నుఁజేకొనఁగవిప్రా! తెల్పుమా యెంతయున్

ఉ॥ ఎప్పుడువచ్చుగోపవిభుఁ♦డెప్పుడు దుర్మదుఁ జైద్యువంచి న
న్నెప్పుడుకోర్కెదీరఁ బురి♦కెప్పుడుదోడ్కొని వేడ్కఁ బోవు, న
న్నెప్పుడుగారవించుఁదుది యెప్పుడుమద్వ్యసనాంబురాశికిన్
జెప్పఁగదయ్య విప్రకుల♦శేఖర! యుల్లము తల్లడిల్లెడిన్. 25

సీ॥ శ్రీకృష్ణ ముఖపద్మ ♦ సీమ జూడఁగలేని
నయనోత్పలంబులే ♦ నయముఁ గాంచు
యదువంశ రుచిర క ♦ రాలంబనము లేక
హస్తాంబు జాతమే ♦ హాయిఁ గనును
మధుసూదనుని ప్రేమ ♦ మధుర వాహిని లేక
గాఢతాపాగ్ని యే ♦ కరణినడఁగు
కాళింగమథన సం ♦ గతిలేక నాకును
సౌఖ్యాబ్ధి నిండేలు ♦ సరణియెట్లు

గీ॥ భూసురోత్తమ! నీవేగి ♦ పురుష సింహు
భువనమోహను సురవంద్యుఁ ♦ బూతచరితు
నాత్మఁ దోఁపఁగ నేఁబడు ♦ నట్టిగతులు
విన్నవింపుము బుద్ధిసం ♦ పన్న! నీవు. 26

ఉ॥ మారునిఁగేరుచారు సుకు♦మారునిఁ గృష్ణుని వాసుదేవునిన్
గూరిమిమీఱఁదెచ్చుమదిఁగుందెడినన్ బ్రతికింపుమయ్య! యీ
ఘోరమనోభవవ్యథల ♦ కున్ నిలయంబగు దుఃఖరాశియన్
నీరధి దాటఁ దెప్పగదె! ♦ నెమ్మిభవత్కరుణాను కూలమున్

వ॥ అదియునుంగాక. 28

చ॥ ధరణిసురేంద్ర! నామనవిఁ ♦ దప్పక శ్రీహరితోడనీవు నీ
తెఱఁగున "వాసుదేవ! భవ♦దీయపదాంబుజసేవయందును
స్థిరతర చిత్తయై కరముఁ ♦ జింతిలుచుండెడిదాసురాలిఁజె
చ్చెరఁగరుణించిబ్రోవఁగుదు శేఖర! రమ్మని" చెప్పుసత్వరన్

వ॥ అనియిట్లు చింతా సాగరనిమగ్నయైన భీష్మక రాజపుత్రిం
గాంచి విప్రుండిట్లనియె. 30

శా॥ తల్లీ! యేలవిచారమొందెదవు నీ♦తత్త్వంబుఁ దథ్యంబుగా
ఫుల్లాంభోరుహపత్రనేత్రునకు సం♦పూర్ణంబుగాఁజెప్పియు

దృల్లీలా చతురత్వ వాగ్విభవ సం ♦ ధాయుం డ్వైభక్తి మై
యుల్లాసంబునఁ దోడి తెచ్చెద నుకృ♦ ష్ణుఁ బ్రీతి రెట్టింపఁగన్

ఉ॥ ఒచ్చెముఁ గల్గి గోపవిభుఁ♦డొం డుఁ దలంచినవాఁడు గాఁడు నీ
విచ్చట నిట్టు లుంట నతఁ♦ డెన్నఁడుఁగాని యెఱుంగఁడమ్మ! నే
నచ్చట కేగి నీదు విధ ♦ మంతయుఁ జెప్పిన తత్క్షణంబె, తా
వచ్చు ననేకవీర పరి ♦ వారములో ఘనసైన్య యుక్తుఁడై.

క॥ వచ్చి విరోధులఁ బోరిఁ గొని
చెచ్చెర నిజకీర్తి నిలుపఁ ♦ జేయుచు ననిలోఁ
గ్రొచ్చర శిశుపాలాదుల
వ్రచ్చియు విజయంబుఁ గొనును ♦ వారిజనేత్రీ! 33

క॥ నినుఁగొని పోవఁగ కృష్ణుఁడు
జనుదెంచినఁ జూచి సురని ♦ శాచరులైనన్
మనసిజ రిపుఁడేనియు ధృతి
ననిఁ జొచ్చిన నిలువఁగలఁడె ♦ హరి ధీరతరున్. 34

ఉ॥ మానిని! యేల జింతిలెదు ♦ మాధవుతో నటసీమతంబు నే
జానుగఁ జెప్పి గోపసుతు ♦ సత్వరమొప్పఁగ రేపటింతలో
భూనుత విక్రమం బలరఁ♦ బొంధుగఁ దెచ్చెద నిన్ వరింపనం
చానలినాక్షి కిం దెలిపి ♦ యూనతిఁ గైకొని యేగెనంతటన్.

గీ॥ పంపెనేగాని భూసురుఁ ♦ బడతి యెదను
దిగులునుంగల్గి మోమున ♦ దీనతయును
గనుల నశ్రులుఁ గాల్వలై ♦ కారుచుండఁ
జెలులఁ జేరియు నీరీతిఁ జెప్పఁ దొడఁగె. 36

సీ॥ చెలులార! బ్రాహ్మణ ♦ శ్రేష్ఠుండు ద్వారకా
పురికి నేగతినిఁ దా ♦ నరుగఁగఁ గలఁడు
అరగె పో యన్యులుఁ ♦ జొరరాని శుద్ధాంత
మందిరంబునకు నే ♦ మాడ్కిఁ బోవుఁ
బోవఁగాఁ గలఁడేని ♦ బురుషోత్తమునితోడ
నాయుదంతము నెట్లు ♦ నచ్చఁజెప్పు
జెప్పెఁబో కృష్ణుండు ♦ చిత్తమందున జాలిఁ
గొనినన్ను భార్యఁగాఁ ♦ గోరుటగునె!

గీ॥ కోరెనేనియు నీపురిఁ ♦ జేరుటెట్లు
చేరి దుష్టులఁ దునుమాడి ♦ మీరి నన్ను
దీసుకొని బోవు నావంత ♦ గాసివడక!
కర్మమెరీతి నున్నదో! ♦ కాను తెలియ. 37

చ॥ అని వచించి మన్మథుని ♦ నాతను సన్నిధి క్రుంపనెంచుచో!
మనకటఁబోవనేలగణ ♦ చూర్ణముఁ ద్రొక్కఁగఁ గాదటంచుఁ దా

మనమునఁ జింతఁ జేసి హరి ♦ మానునో! రానుతలంపుఁ జేయఁడో
వనజభవుండు నన్నొసట ♦ వ్రాసిన కర్మ మదెట్టు లున్నదో!

మ॥ హరియే రాకయుపేక్షఁ జేయు నెడ గర్వాంధుండు చైద్యుండు వే
ధరణీనాథుల తోడఁగూడి మిగులన్ ♦ దర్పంబుఁ జూపెట్టి న
న్వరియింపన్ సమకట్టు, సోదరుఁడు న ♦ వ్వానిం గడున్ మెచ్చి స
త్వరమా చైద్యునికిచ్చి నన్నునిక వై ♦ వాహంబుఁ గావింపఁడే!

గీ॥ ఎన్నఁడో హరివచ్చి నా ♦ యెదనుఁ గల్గు
కోర్కెలిగురెత్తఁ జేసి యా ♦ కుమతి రుక్మి
గర్వభంగంబుఁ గావించి ♦ కదనమందుఁ
జైద్యుఁ బాఱంగఁ దరుమును ♦ సకియఁ జూడ! 40

వ॥ మరియుఁ దనలో నిట్లు వితర్కింపఁ దొడంగె. 41

ఉ॥ మక్కువతోడ మాధవుఁడు ♦ మాన్యతనన్ దరిఁ జేర్చి కౌగిటన్
జిక్కఁగఁ జేసి ముద్దులిడి ♦ చెచ్చెర నాకళ లంటఁబొంగి నేఁ
జొక్కి సుధారసంబుఁ బ్రతి ♦ చుంబనలన్ జవిసూపి నెమ్మదిన్
దక్కఁగ జేసుకోగలనొ! ♦ తామరసాక్షుని చిత్తమెంతయున్

గీ॥ అనుచు మదినెంచి మోహంబు ♦ నతిశయిల్ల
మాలినీమణి సోదరు ♦ మాధ్వమాపకుఁ

గొంత జింతించి హృదయంబు ♦ గొందలమునఁ
బొర్లి పొర్లాడ నిలుకడఁ ♦ బొందలేక. 43

సీ॥ కురులు దిద్దదు గొప్పున ♦ విరుల నిడదు
సిరులు చిక్కులు పడఁగుచ ♦ గిరులమీద
పీడదీయఁగ నెంచదా ♦ విద్రుమోష్ఠి
ముద్దు మోమునుఁ జూడదు ♦ ముకురమందు. 44

సీ॥ అందమైనట్టి పళ్లెర ♦ మందు రుచిర
భోజనంబునుఁ దెచ్చినఁ ♦ బొలఁతి మసలి
మెసవ నెంచదు విసగుచు ♦ నుస్సురంచుఁ
గసరి కసరియు నొకగొంత ♦ మెసఁగి లేచు. 45

ఉ॥ ఆకుమడుంగులిచ్చు నెడ♦నాయమ యొల్లొపరాకునుండి యా
యాకులనుమ్మివేయు మరి ♦ యట్టులె పచ్చనిపూలనీయఁ జీ
కాకున వీడెమంచది వి ♦ కారతఁ దావిడియంబుసేయు ద
ర్వీకర వేణి కృష్ణపద ♦ వీక్షణ దీక్షనహించి యుండుటన్.

ఉ॥ మానిని కృష్ణునిందలఁచి♦మాన్యతనాతనివంకఁ జూడ్కులన్
బూనియె నుండుఁగాని నిజ ♦ బుద్ధి బయల్పడఁ జెప్ప దేరికిన్
జానుగఁ దల్లిదండ్రులను ♦ చంద్రనిభానన జూడఁబోదు దా
మేన ధరింప బుద్ధిడ ద♦మేయ విభూషణ తార హారముల్.

గీ॥ ఇత్తెఱంగున నాయింతి ♦ చిత్తవృత్తి
మాధవా యత్తమయ్యును ♦ మగువ కంత
భక్తి పెంపొంద నొరుల సం ♦ భాషణములు
వినకఁ జూడక యుండఁగా ♦ విసిగి చెలులు. 48

చ॥ పడతిరొ! యేలకో యిటుల ♦ భావమునన్ వ్యధఁజెంది ఖిన్నవై
తడఁబడియుండుటల్ తగదు తామరసాక్షుఁడు నిన్నుఁ గూర్చి తా
వడినిట వచ్చుఁ దథ్యమిది ♦ పౌరులు సంతసమొంద, దుష్టులౌ
పుడమిపతుల్ పరాభవముఁ ♦ బొందుచు నిండ్లను దూరి దాఁగఁగన్

క॥ ఆహారముడిగి నీవిట
నాహా! యిటులుండఁ దగునె ♦ యంబుజ నేత్రీ!
సాహసుఁడు చక్రి నిను సం
దేహము లేకుండఁ గొనును ♦ దీనత విడుమా! 50

చ॥ చలమిది యేలనో తెలియఁ ♦ జాలము మున్నిల రాజపుత్రులన్
వలచిన వారు లేరె! నిను ♦ వంటి నృపాలకపుత్రి నెచ్చటన్
వెలయఁగ చూడలేదు మది ♦ వీడని మోహవికార చేష్టలన్
గులుకుమిటారి లక్షణముఁ ♦ గోమలి! లోకులు విన్న నవ్వరే!

క॥ చీటికి మాటికి మమ్ములఁ
బాటింపక తూలనాడి ♦ పరికించెన వో

బోటిరో! జననీ జనకుల
మాటేనియుఁ దలఁపవైతి ♦ మర్యాదె చెలీ! 52

సీ॥ చలువ పన్నీటిలో ♦ స్నానంబుఁ జేయవు
గంధంబుఁ బూయవు ♦ గడుసు దనమొ!
భూషణంబుల మేన ♦ భూషింప నొల్లవు
తిలకంబు దిద్దని ♦ యలుక తగునె
ముద్దుమోమునుఁ జూడ ♦ ముకురంబుఁ గనఁబోవు
పుష్పహారము లేల ♦ ముట్టవమ్మ!
పాటించి పెన్నెరుల్ ♦ పడతి! దువ్వఁగ బోవు
భోజనం బొల్లని ♦ యోజ తగునె!

గీ॥ రమణ రుక్మిణి భయమేల ♦ రాగలండు
నందసూనుండు, మరి రేపె ♦ నమ్ము మమ్మ!
సంశయము వీడి నీ పాణి ♦ సములమైన
మమ్ము నిటుఁ జూచి భాషించు ♦ మంజువాణి! 53

చ॥ పలుకులు వేయినేల మరి ♦ పంబునఁ జంద్రశిలాంతికంబునన్
గులుకుచు రత్నతల్పమున ♦ గోపవిభుండును నీవుఁ గూడి పూ
విలుతుని క్రీడలందగిలి ♦ వింతగు చూపులఁ జొక్కు వేళలన్
దలఁపున కెక్కువార మటె! ♦ తామరసానన! నీకు నయ్యెడన్.

సీ॥ అనుగు చెలులంద రీరీతి ♦ ననుచునుంట
రమణి రుక్మిణి లజ్జాభ ♦ రంబు తోడ
వినయ వినమిత ముఖయయ్యు ♦ మనమునందు
నాఱటంబెందె నొకకొంత ♦ నువిద యపుడు. 55

వ॥ అంత రుక్మిణీమణి నెచ్చెలులంగూడుకొని సరస సంభాష
ణంబుల గొంతప్రొద్దుఁ బుచ్చుతరి లోకలోచనుంডా రాజ
కన్యావలోకనంబునఁ బడుతరి. 56

గీ॥ భైష్మి కుచసీమ రత్నాల ♦ ఫలకముర్వి
రక్తమాకార మొందిన ♦ రహిని తపను
దీప్తి దిశలెల్లఁ బాండుర ♦ దీక్ష వీడి
అరుణముం జెందెఁ బద్మాప్తుఁ ♦ డపర దిశను 57

చ॥ కనులకుఁ బిండువై వెలుఁగు ♦ కల్వలతేనికి లోకపాలనా
ఘనతవహింపఁ జేయఁగను కౌతుక మొందుచువార్ధితోయముల్
పనివడి దెచ్చునాయపర ♦ భామిని చేఁగల హేమపాత్రనా
దినమణిదోచి యస్తగిరి ♦ దిగ్వసరాశి మునింగె నంతటన్. 58

ఉ॥ జారులుచోరు లెంతయును ♦ సంతస మొందఁగ జక్రవాకముల్
బారులుఁ దీసిపాఱ గుహ ♦ పట్టుల వీడి దివాంధమూక సం

చారముఁ జేయ నల్లనగు ♦ సందుక నింపిన కాటుకోయనన్
ధారుణినిండె నంతటను ♦ దట్టపుఁ జీకటి బెట్టిదంబుగన్  59

ఉ॥ నాలుగుదిక్కులన్ దమి ఘు♦నంబుగనిండుచుఁ బర్వ యీజగ
ద్గోళము నంతయున్ వెసన♦గోచరమై గనుపించుచుండఁగాఁ
నీలపటంబుపై నెగడి ♦ నెమ్మివిరాజిలు ముత్తియంబులన్
జోలివెలింగె తారలున♦భోవలయంబునఁ దళ్కుఁదళ్కునన్.

సీ॥ బ్రాహ్మి సంతసమొంది ♦ పద్మాక్షునిఁగూర్చి
పంపిన రత్నాల ♦ ఫలకమనఁగ
నందునిసతి మహా ♦ నందంబుతోఁ గృష్ణ
మూర్తికై యిడురత్న ♦ ముకుట మనఁగఁ
బౌలోమి రుక్మిణీ ♦ భామలలామకుఁ
బంపిన చెంగల్వ ♦ బంతియనఁగ
మారుండు రుక్మిణీ ♦ మాధవు పై వేయఁ
బూనిన కెందమ్మి ♦ పూవనంగఁ

గీ॥ గాలరూపుండు ప్రాక్సతీ ♦ కాంతకొరకుఁ
బంపినటువంటి పగడాల ♦ భరణి యనఁగ
జెలువు మీఱిన యోంగీద్ర ♦ చిత్తమట్ల
చంద్రబింబంబుఁ బొడసూపె ♦ చల్లగాను  61

గీ॥ అంతఁ గమలారి తనరక్త ♦ కాంతి విడిచి
సరవి గొలనున హంసంబు ♦ కరణి దివిని
యల్ల నల్లన మెల్లగ ♦ తెల్లనయ్యె
ధరణి జనముల కామోద ♦ కరముగాఁగ. 62

వ॥ అంత శ్రీకృష్ణవిరహవేదనాతప్త మానసయై కడుంగడు గృశించిన రుక్మిణీమణికా శీతలచంద్రకిరణంబులత్యంతంబు దాపంబు రెట్టింప భరింపజాలక యుండుటఁగని పెట్టి నెచ్చెలులా రాజపుత్రికనుఁ దోడ్కొనిపోయి చిగురుటాకుల తల్పంబునఁ జేర్చి శిశిరకృత్యంబులు సేయం దత్సమయంబున.

సీ॥ కుచయుగంబులఁగల ♦ కుట్మలహారముల్
పొడి పొడియై భూమిఁ ♦ బడఁగఁ జొచ్చె
కర్ణమూలంబుల ♦ గలువలుఁ గన్నీటి
కాల్వలచే వాడు ♦ గతినిఁ బట్టె
నురమున గంధంబు ♦ నుడుకుఁ బట్టియుఁబొంగి
నటులఁ దోఁచెను మంట ♦ లగుచు జెలికి
కచభరంబునఁ జుట్ట ♦ గాబడ్డ విరులును
గంధహీనములయి ♦ కాంతిఁ దప్పె

గీ॥ జిగిని దనరారు క్రొమ్మావి ♦ చిగురుఁ బఱుపు
పెట్టి నట్టుల వేడిమి ♦ నట్టకట్టె

నగ్ని కార్యంబు నిడుకేతి ♦ నబల కపుడు
చెలుగు విరహాగ్ని కై సేయు ♦ శీతకృతులు. 64

గీ॥ తరుణి విరహాగ్నిచేఁబడు ♦ తాపమునకుఁ
బదతలంబున బూసిన ♦ ప్రసవ రజము
తప్తమై రాలి వేడిమిఁ ♦ దగులు కతన
పాదుకొలెక్కొను చేతులఁ ♦ బొలతులకును. 65

క॥ ఎంతెంత శిశిరకృతులకు
నంతంతయు వేదనాగ్ని ♦ నధికము గాఁగన్
గాంతామణి రుక్మిణి నిజ
కాంతావళిఁ జూచిమిగుల గన్నీరొలుకన్. 66

వ॥ దుఃఖించుచు మిన్నులఁబొడమిన చంద్రునితీక్షణంబున
వీక్షించుచు. 67

సీ॥ పాలసంద్రపు ముద్దు ♦ పట్టి వగుటయె గాక
సిరితోడుఁ బుట్టువై ♦ చెలఁగు వాఁడ
మురదాన వారికి ♦ ముద్దుమరందివై
శివుజటాటవి వెల్గు ♦ శీత కిరణ
కువలయప్రియుఁడవై ♦ కోరి లోకాళికి
సంతసంబునుఁ గూర్చు ♦ చలువ తేడ

కుసుమశరాసనకును ♦ గోమరారు మామవై
జతిగలోకాప్తుని ♦ సఖుఁడవయ్యు

గీ॥ నిట్టి కఠినంబుఁ బూని బల్ ♦ రట్టుఁజేసి
తేపతేపకు నల్లురి ♦ పాఱిపుఁ జేరి
యబలలగు మమ్ము వ్యథఁ గూర్ప ♦ నగునె నీకు
శీతలాకార రోహిణీ ♦ చిత్తచోర! 68

చ॥ గురువరుభార్యనుం గవిసి ♦ కూడిన ద్రోహివటంచెఱింగియున్
ధరణిని లింగధారివగు ♦ తత్త్వమునుం దలపోసి కాదె శ్రీ
హరుఁడును నెత్తిఁ బెట్టుకొనె ♦ హానిగలంపక చంద్ర! యెట్టిదు
శ్చరితులనైన నంబ్రోముఁగద శంకరుఁడున్ దనుఁగొల్చువారలన్

గీ॥ శ్రీకిఁ దోఁబుట్టువీవని ♦ చెలఁగి జనులు
నిన్నుశ్లాఘింతు రేకాని ♦ నీదు నైచ్య
మరయఁగాలేరు విషమున ♦ నట్టెపుట్టి
క్షయము నొందెదవంచని ♦ చంద్ర నిన్ను. 70

క॥ హరునకుఁ దలమట్టైయు శ్రీ
గురుతరుణిం బట్టితీవు ♦ కూళతనమ్మున్
ధరఁగల తమ్ములు వగవఁగఁ
జరియించెడి దుండగీడ! ♦ చలువల ఱేఁడా! 71

గీ॥ సతులలోచకు నీసొంపు ♦ సన్నగిల్ల
వగపుఁగూర్పకు నినుఁబెద్ద ♦ పాము మ్రింగ
మానవతులను దుఃఖింప ♦ మానవటర!
శీతలాకార! శివ జటా ♦ శ్రితకుటీర! 72

ఉ॥ అల్లుఁడు మామయుం గలసి♦యల్లరిసేయుట పాడిగాదు నీ
కిల్లును వాకిలిం సతియు ♦ నిమ్మహిఁ లేవొకో! వైరివయ్యు నీ
యల్లరిసేయఁగా దగద ♦ టంచని నీకును బుద్ధిఁజెప్పఁగా
నొల్లరు పెద్దలేనియును ♦ నొప్పనివాఁడవుగాదె చంద్రమా!

వ॥ అని యిట్లు కన్నియ వెన్నెల రాచవేలుపుం భూషించి
దూషించి నృశంసుండగు ప్రసవబాణు నుపలక్షించి. 74

సీ॥ వనజసంభవు నంత ♦ వానినే పడఁద్రోచి
కూతుఁగూర్చిన మహా ♦ పాతకుండ!
గురుభార్యతోఁ గూడు ♦ కొనఁజేసి చంద్రుని
కీర్తి దగ్ధముఁజేసి ♦ కేరువాఁడ!
యలపరాశరు నేటి ♦ యందు నీచపుతన్వి
సంధింపఁ జేసిన ♦ చవటివాఁడ!
బలకోడిగాఁ జేసి ♦ పాకశాసనునంత
వాని నహల్యకై ♦ వాసిఁజెరచి

గీ॥ తౌర నీదుండగఁబంత ♦ నడుగుఁ బట్ట
యభవుపై తేగి పొందితి ♦ వతను వింక
మూలఁబడియుండ కీర్తి ♦ మోహ జలధి
ముంప శరముల సంధింపఁ ♦ బూంచినావ! 75

వ॥ అని నెచ్చెలులంగాంచి. 76

గీ॥ సరసమతులార! మునపటి ♦ మరుఁడు కాడు
యింత నొప్పించు వాఁడని ♦ యెన్నఁడెఱుఁగ
నిందువెన్నెల నేయిచే ♦ మండఁ జేసి
చంపుచున్నాఁడు చంద్రుండు ♦ జలువ చంపు. 77

సీ॥ అహికన్నియలుబిత్రి ♦ నారగించుయువీడ
బవనుని తెక్కలు ♦ భగ్నపడవె!
చెలఁగి మామిడిపండ్లఁ ♦ గలజీడి చేఁజిల్క
గమి నాలుకలు పొక్కి ♦ కమలి పోవె!
మదనముల్ వాసన ♦ కొదమ తుమ్మెదలకుఁ
దగిలి ప్రాణముపీడి ♦ తన్నుకొనవె!
చిగురుటాకులమేసి ♦ చెలఁగు కోకిలలకు
వడికి రాతుఁడు జాలిఁ ♦ బట్టుకొనఁడె

గీ॥ చెఱుకునుంబట్టి చీమలు ♦ ఛిద్రపఱుప
బువ్వుఁదేరును నాయూర్పుఁ ♦ బోనడంగ

మదనుగర్వంబు నంతట • మాయమయ్యె
విన్ననంజెంది యరుగఁడే • విడది కప్పుఁడు 78

వ॥ ఇట్లు బహుప్రకారంబుల సుమబాణవికారంబులకుఁ గలా
పంబులుగాఁ బ్రలాపంబుల నెఱుపుచు నర్మగర్భంబుగా
సఖీజనంబులాడిన సల్లాపంబులఁ దలంచుచు నాభీష్మకరాజ
పుత్రి గాంధర్వంబున శ్రీకృష్ణుండు దనుగ్రహణంబొనర్పఁ
గలండనిమనంబుననాసించుచుఁ జీమచిటుక్కుమన్న వాసు
దేవునిరాకగాఁజింతించి దిగ్గునలేచి నలువంకలంబరికించి
కానకఁగళవళించుచుఁ జింతాపరిక్లాంతయై గనుంగవమూ
సియు మాయమి శ్రీహరినింగలయంగాంచి బయలుగౌఁగ
లించుచుఁ బలవరించుచుఁ గుందుచుంబొరలుచుఁ దెరలుచుఁ
గసరుచు వేసరచు, నుస్సురనుచు, నస్సురనుచు నుల్లంబున
దెల్లంబోయి మూర్ఛిల్లెడినయ్యబ్జాతలోచనంగాంచి సఖీజ
నంబులింకయు శీతలోపచారంబులుం జేయఁదొడంగి వీవన
లవిసరుచుండఁ గొంతవరకావిద్రుమోష్ఠి కనుంగవఁదెఱచి
బహిఃప్రాణులగు నెచ్చెలులంగాంచి 79

చ॥ విసరకుఁడమ్మ! వీవెనల • వీచినఁ దత్పవనంబు తాకుచే
నసువులువాయునమ్మ!మదనాంకురమింకయు హెచ్చునమ్మ!పూ

రసములతోడఁ బయ్యెరుఁడు ♦ రాణఁ జెలంగియుఁ దేంట్లఁ దెచ్చినా
దెసనిడగాఁగలందు సుద ♦ తీ మఃఖలార! వివేకహీనతః, 80

క॥ తెల్లవారిన వెనుక మ ♦ దీయహృదయ
వల్లభుండైన కృష్ణుండు ♦ వచ్చుఁగాన
భావజునిచేతఁ జిక్కనేఁ ♦ జావకుండ
నంతదనుకను నరయుఁడో ♦ యమ్మలార! 81

సీ॥ అంత నెచ్చెలులంత ♦ నానందమున లేచి
విమలమృణాల హా ♦ రములవైచి
పన్నీరు నొకకొన్ని ♦ పద్మములంజేర్చి
తోరంబుగాఁ జను ♦ దోయిఁగట్టి
పద్మములందున ♦ భాసిల్లు బిళ్లలఁ
బొందుగాఁ దలకిరింద ♦ నందఁజేసి
పూదేనియలతోడ పుప్పొడి మర్దించి ♦ పద్మగ్గాజేసెనునఁ, బట్టఁజేసి
గీ॥ చలువచిగురులఁ బాద తల ♦ ములను
కటిభరంబున విరులు గా ♦ గర ఘటించి
పొన్నపొగడల నలుదిశల ♦ పొందుఁ బఱచి
చెలులు జేసిరి యొకకొంత ♦ శీతకృతులు 82

గీ॥ కాని నయమించుకేనియుఁ ♦ గానఁబడదు,
అంతకంతకు సంతాప ♦ మగ్గలించె

నినుఁడు దాఁగిన జలమర్యా ♦ నింతి మేను!
కానఁగారాదు శైత్యోప ♦ కారమెటులొ! 83

క॥ చదువుల వినలేదెటు లీ
మదవతి విరహాగ్ని నణుచు ♦ మార్గము, మరియే
సుదతియు నిటుపరితాపముఁ
గదియంగా జూడలేదు ♦ క్ష్మాతలిలోనన్. 84

వ॥ అనియిట్లు తమదేవికింగల విరహతాపోపశాంతినింగూర్ప
చెలికత్తియలు నానావిధముల విచారించుసమయంబున.

ఉ॥ తోయజబాంధవుండలరి ♦ తూరుపుకొండకు రాఁదలంచె భూ
నాయకపుత్రి కామశిఖ ♦ నంబగు సూనశరాగ్ని వేదనం
గాయముఁదల్లడిల్లెనుపి ♦ కంబులు! కూయకుడంచుఁగొక్కు కో
కోయని బిట్టు మ్రోసెదొలి ♦ కోడిగృహంబులసారెసారెకున్

వ॥ తదనంతరంబ. 87

సీ॥ అసమాన గరిమచే ♦ పసఁగల్లు మల్లికా
కుసుమగుచ్ఛములపైఁ ♦ గోర్కెనలరి
విమలంబునై వెల్గు ♦ కమలా తటిం జేరి
పద్మగంధంబుల ♦ వడసి ప్రీతిఁ
కమనీయ శీతలా ♦ కరమైన కదళికా
వనములఁ దిరుగాడు ♦ వన్నెఁగాంచి.

మాలతీమందార ♦ మంజీరములదూరి
సౌజన్యలీలలు ♦ జరిపి జరిపి

గీ॥ యతుల గతులగు రతులతో ♦ నలసినట్టి
సతుల పతులకుఁగల ఘర్మ ♦ జలముఁబాపి
ముదముఁ గూర్చుచుసంతోష ♦ మునఁజెలంగి
చల్లఁగా వీచె గాలి యా ♦ సమయమందు, 88

క॥ తూరుపు తెలతెలవారఁగ
దారల గృహదీప తతులు ♦ తమలోఁదామే
సారవిహీనంబగుచును
తోరమ్మగు కళలఁబాసి ♦ తొలఁగ దొడంగెన్. 89

మ॥ బిసినీకాంత మనోవ్యథన్ గలిగి త ♦ ద్భీతాహతిన్ చింతనా
గ్రసితైయుంట నెఱింగి వైద్యుఁడను న ♦ క్షాలహ్వాయుండంతనే
ర్పసగన్ దద్రుజఁబాపభద్రమతుఁడై యింపొందఁగా దెచ్చుబల్
రససింధూరపు ఉండగా దనరు మా ♦ ర్తాండుండు పూర్వాద్రిపై.

గీ॥ అబ్జములఁ జేరి భ్రమరము ♦ లలరి మధుర
గానములఁజేసి ''మీప్రాణ ♦ కాంతుఁడైన
యర్కుఁడే తెంచె లెమ్మను'' ♦ నటుల బిట్టు
మ్రోయ దొడఁగెను కుముదముల్ ♦ మొగము ముడువ.

గీ॥ కష్టతరముగ రేయెల్లఁ ♦ గడపి భైష్మి
దత్తరిల్లుచు వేకువ ♦ తరిని లేచి
కృష్ణవీక్షణదీక్షనుఁ ♦ గీలుఁదప్పి
పడినబొమ్మనఁ జెంగల్వ ♦ పాన్పుఁబడియె. 92

వ॥ నాటిదినంబున భీష్మకభూపాలుండు బంధుమిత్త్రపరివారముంగూడి యనుంగు గూఁతురగు రుక్మిణీదేవి వివాహమహోత్సవకాలంబు సమీపించుటం జేసి నిఖిలధరామండలాధిపతుల నాహ్వానంబుఁ జేయందగు రాజబంధువుల నియోగించి. 93

సీ॥ ప్రతివీధిలోన రం ♦ భాస్తంభముల నిల్పి
పచ్చతోరణములఁ ♦ బర్వఁ జేసి
ప్రతిగృహాంగణమందుఁ ♦ బరిమళ సంయుక్త
మగుపుష్ప హారము ♦ లమరఁగట్టి
ప్రతివేది మౌక్తిక ♦ ప్రతతిచే బహుచిత్ర
రంగవల్లులుఁ దీర్చి ♦ రమణమీఱ
ప్రతిరాజమార్గ స ♦ త్ప్రాకారముల దీప
కాంతులఁ జిత్రమై ♦ ఖరులఁగూర్చి

గీ॥ పురమునంతయు వైకుంఠ ♦ పురముగాఁగ
వనములన్నియు నందన ♦ వనములనఁగ

సురపురంబున మించిన ♦ సిరులతోడ
నలరఁజేపిరి కుండిన ♦ మనెడిపురము. 94

మ॥ భూమీశుండువసించు మేడయునుసౌం♦పుల్ మీర నెంతేసిసు
త్రామాగారమువోలె దివ్యగతులన్ ♦ శోభిల్లఁగాఁజేసి రా
భూమిన్ రుక్మిణిపెండ్లిఁజూడఁగమహా ♦ పూజ్యంబుగాభూతల
స్వాముల్ బంధులఁగూడివచ్చిరెలమిన్ ♦సంతోషహృద్భాసులై

వ॥ ఇవ్విధంబున జతురంగబలసమేతులై బంధుమిత్రపరివారం
బులఁ గూడుకొని బఱతెంచినరాజేంద్రుల నారాజచంద్రుం
డన్నివిధముల సత్కరించి రుచిరభోజనాంబర దివ్యభూష
ణంబులొసంగి విడిదలకై నియమించిన మేలుభవనంబుల
నుండంజేయ నంతనచ్చట చేదిదేశాధీశుండైన శిశుపాలుం
డు వివాహశుభ లేఖనుఁ బరిగ్రహించి సంతసించి యాలేఖా
వహునికి వలయుధనంబులొసంగి. 96

ఉ॥ అంతటవానిపీడ్కొలిపి♦యాప్తులుబంధులుమంత్రులున్ మహీ
కాంతులుసంతసింప శుభ ♦ కార్యము వారికెఱుంగఁజేసి వీ
డంతయులంకరించి పుర ♦ మంతయుఁ బౌరులుసంతసింపఁ జే
మంతులత్రుచ్చితోరణపు♦మాలలఁగట్టెపురంబునంతయున్

వ॥ అంత శిశుపాలుండు మహోల్లాసంబున బంధుమిత్ర

పరివారచతురంగబలసమేతుఁడై విదర్భదేశమునకుం జోవ సమకట్టుతరి. 98

సీ॥ సరిగమ పదనిస ♦ స్వర సంజ్ఞలనుఁబర్వ
పాణిసీమను వీణ ♦ ప్రబలుచుండ
భాగీరథీ పయః ♦ పరిపూర్ణ మగుహేమ
కలశంబుఁ జేతిలోఁ ♦ గ్రాలుచుండ
సమరనృత్యంబున ♦ సందడిఁగొనఁగేశ
బంధంబుశిరమునఁ ♦ బర్వుచుండఁ
బ్రణవమంత్రాంకుర ♦ పరనీయ స్ఫటికాక్ష
వలయంబు గంఠమం ♦ దనరుచుండ

గీ॥ ధరణి కరుదెంచి శిశుపాల ♦ ధరణినాథ
పాలితంబగు చేది నా ♦ బరఁగుపురికి
సత్వరముఁజేరి నృపుడుండు ♦ సౌధమునకు
నరిగె నారద మౌనీంద్రుఁ ♦ డమిత ప్రీతి. 99

క॥ ఎదురేగి మౌనిఁదోడ్కొని
ముదమొప్పఁగ హేమపీఠ ♦ మున నిల్పుచుఁ దాఁ
గుదురుగఁ బూజించియు వే
మృదుసూక్తుల నిట్టులనియె ♦ మించినభక్తిన్. 100

వ॥ అట్లు పూజించి జ్ఞానదమగు భగవద్గుణానుభవంబుపదే
శించి నన్నుంధన్యుం జేయుమనిన. 101

చ॥ అనఘుఁడుమానిచంద్రుఁడతి♦హర్షముతోనటజైద్యుఁజూచి
జనవరనీవుమున్నుహరిసన్నిధినిఁ హరిలోకమందునఁ (గో
దనరెడిదివ్యమూర్త్తివయి తత్త్వరహస్యములన్నియుఁ సదా
మనమునఁగాంతువిప్పుడొకమానవమాత్రుఁడవైతిభూవరా

గీ॥ అడుగ నెంచితి, (శ్రీ)హరి ♦ నాత్మఁ దలఁచి
చెప్పువాఁడను వినుమయ్య! ♦ చేదిభూప!
మనుజ జన్మంబు నెత్తిన ♦ మానవులకు
వలయుజ్ఞానంబు జన్మ సా ♦ ఫల్యమునకు. 103

వ॥ ఎట్లంటేని 104

సీ॥ ఫలసంగ రహితమౌ ♦ పరమ విజ్ఞానంబు
నియమింపు నీమది ♦ నిష్ఠతోడ
ఫలమబ్బినప్పుడు ♦ ఫలమబ్బనప్పుడు
సమబుద్ధిచేఁ గర్మ ♦ సరణిఁ జేయు
మనఘ! యోగంబెట్టి ♦ దనియంటి వేనియు
కర్మమ్ము సేయంగఁ ♦ గలుగు ఫలము
సిద్ధిబొందియు మరి ♦ సిద్ధిబొందనివేళ
సమచిత్తమే యోగ ♦ సమ్మతమ్ము

గీ॥ ఈఫలంబెల్ల దేవుని ♦ కేర్పరించి
బుద్ధియోగంబుతోఁ జేయఁ ♦ బూనుకర్మ
మధిక మందున సత్యంబు ♦ నరయఁ గాంచి
కనుము శిశుపాల! పరమ సు ♦ జ్ఞానమతిని. 105

చ॥ అనఘ! మహానుభావులు ని ♦ జాత్మల కర్మజమౌఫలంబు లం
దనుమతిమాని భేదముల ♦ నందక సంతతమోక్షతుల్యమై
దనరెడి నవ్యయంబునను♦దార్కొనఁ బూనుదురట్లుగాన నీ
వనిశము కర్మమూల ఫల♦మాశయొనర్పక నుండుభూవరా!

శా॥ సందేహింపక నాదుబుద్ధివిని యీ ♦ సత్సాంఖ్య కర్మంబులా
నందస్ఫూర్తిని యాచరించి మదిలో ♦ నంగాంతవర్జించి యిం
పొందంగాఁదగయోగివై మెలఁగుము♦యోగంబుచే జ్ఞానముఁ
జెందంగాఁగలవయ్య! చైద్యనృప? నీ ♦ చిత్తస్థితిఁ జూడుమా!

ఉ॥ దేవునిఁజూడలేక నిజ ♦ దేహసుఖంబులు మానినంతనే
బోవఁగ నేరదాస, విను ♦ బుద్ధిఁ బవిత్రితఁ జేసి సాధువై
దేవునిఁగూర్చి కర్మమును♦ధీరత నర్పణజేయ వాంఛలుఁ
బోవునుఁగాని వేరువిధిఁ ♦ బోవఁగ నేరవు చైద్య భూవరా.

సీ॥ ధీరోక్తిఁ దనకుఁ దా ♦ దెలివిలోఁ గానకఁ
దనబుద్ధి విషయముల్ ♦ తగిలెనేని

యా కోర్కెతోసంగ ♦ మతనికి భాసిల్లు
సంగముచేఁ గోర్కె ♦ సంభవించుఁ
గోరికవల్లను ♦ క్రోధంబుఁ జేకూరు
క్రోధంబుచేఁ జాల ♦ కుటిలమైన
యజ్ఞానమంతట ♦ నావరించియునుండు
నజ్ఞానబలమున ♦ నాత్మలోనఁ
గీ॥ దొల్లిదొరకొన్న సుజ్ఞాన ♦ మెల్ల మఱచు
నందువల్లను సద్బుద్ధి ♦ యణఁగిపోవు
బుద్ధి యడఁగినఁ బెనుదుఃఖ ♦ ములనుఁగల్గి
యార్తి సంసారజలధిని ♦ నతఁడు కూలు. 109

చ॥ అటువలెనాచరింపక మ♦హామహిమన్ హరినాశ్రయించి నీ
చటులభవాబ్ధిపోతమగు♦సన్నిహితంబగు నింద్రియంబులన్
బటుతరమైన కోరికల ♦ పట్టునఁ జిక్కక సర్వకాలమున్
నటమటలేకమానసము నందుహరిన్ భజియింపుమెప్పుడున్

ఆ॥ మనసు వశ్యమగుట ♦ మరి ప్రకృతింగల
దుఃఖపుంజమెల్లఁ ♦ దొలఁగి పోవు
శ్రీయుతంబుగవాఁడు ♦ శేముషి నెప్పుడు
పరమునాశ్రయించు ♦ భవ్యమతిని 111

చ॥ అకటశరీరధారులకు ♦ నాత్మప్రకాశముఁగాదు, యామినిన్
సకలమెఱుంగలేకఁ గడు ♦ శంకలఁ జీకటిఁ దోఁచుపోలికన్
బ్రకటితమొప్పనాత్మఁగను ప్రాజ్ఞునికాత్మప్రకాశమా, దివిన్
వికలమొకింతలేకఁ దగ ♦ విశ్వముఁ గాంచఁగ వచ్చుపోలికన్.

క॥ భువి సంసార సుఖంబులఁ
జవిఁగొని వర్తించుజనుల ♦ జాగ్రితలెల్లన్
రవిలేని దివము తెరఁగున
నవివారల కెటులఁదోఁచు ♦ నయ్య! నరేంద్రా! 118

వ॥ కావున నీవు రజస్తమో గుణంబులవిడనాడి సాత్వికంబున జగదంతర్యామియైన శ్రీమన్నారాయణ పాదారవిందభజనానందంబున నిరతిశయానంద రూపుండవై బ్రహ్మానందంబునుం బొందుమని చెప్పి యానంరేంద్రునింగాంచి; నృపాలా! నీవుతొల్లి వైకుంఠంబున సర్వమంగళాకరమైన తద్ద్వారంబున వెలెంగెడి ద్వారపాలకుఁడగుజయుండవు, బ్రహ్మమానసపుత్రిల నవమానించుటచేత నమ్మహాత్ములశాపంబున నిరుజన్మంబుల నిశాచర వంశంబునంబుట్టి హరిచేమడసితివి. ఇదియేకడసారిజన్మంబు. ఈజన్మంబున భగవంతుండగు వాసుదేవునిచేఁ బరాజితుండవై కర్మభూయిష్ఠంబగు నీశరీరంబు విడనాడి మహాయోగీంద్రులకైనను

నందరానియపవర్గంబు నధిష్ఠింపఁగలవనిన నారాజన్యుఁడు
ముకుళిత కర కమలాంజలుఁడై. 114

చ॥ ఎఱుఁగుదు వాసుదేవుఁడుర ♦ మేశుఁడు చక్రధరుండు నాఁట, నే
నెఱుఁగుదు రుక్మిణీమణి మ ♦ హేశునిపుత్రిక లక్ష్మిగాఁగ, నే
నెఱుఁగుదు నాకు నాయదుకు ♦ లేశ్వరు జేతి వధ క్రమంబు. ని
ల్లెఱిఁగియు భైష్మిఁ బెండ్లిఁగొన నేగెదఁ గృష్ణుఁడు గిన్క వొందఁగన్

వ॥ అని నిజమనోగతంబైన రహస్యంబు లన్నియు నమ్మునీంద్రునికి విన్నవించి రుక్మిణీ కరగ్రహణాభిమతుండై చెలంగెడి తెఱంగున లోకంబునకెఱుంగం జేయుసమకట్టి, భేరీమృదంగ కాహళధ్వనులుఁ బోరుగొల్ప వందిమాగధులు కైవారంబు సేయ చతురంగబలసమేతుండై కుండిన నగరంబునకుం జనియెనని. 116

గీ॥ ఎఱుఁగఁజేసెను సూతమా ♦ నీంద్రుఁ డలరి
శౌనకాదుల కారీతి ♦ జ్ఞానవరేణ్యుఁ
డైన భరతకులాధీశు ♦ కటుల శుకుఁడుఁ
దెలుప నవ్వలికథ రాజు ♦ తెలుపఁ గోరె. 117

చ॥ హరనుతదివ్యలీల వితా ♦ తాంబుజమిత్రకులీన! ధీర! సుం
దర దరహాస! మేరుగిరి ♦ ధైర్య! విశారద! దేవదేవ! భూ

తరుణిసుతాసమేత! పర ♦ తత్త్వవిచారణ! మానిసన్నుతా
భరణ! వినీలగాత్ర! సుర ♦ వందిత! రాఘవ! రామభూవరా!

మాలినీవృత్తము

పరమకరుణశీలా ♦ భక్తసందోహపాలా!
సురమునిపరిపాలా ♦ సూరిసంస్తుత్యలోలా!
తరణికులవిశాలా ♦ ధారుణీజాతలోలా!
భరితగుణసముద్రా ♦ పాహిమాం రామచంద్రా! 119

ఇది శ్రీహనుమద్దేవ దయారస లసత్కటాక్ష
కవితాధురీణ పంతము గోపనార్య పుత్ర
ఆంజనేయకవి కృత శ్రీ రుక్మిణీ
కళ్యాణమను కావ్యంబునఁ
ద్వితీయాశ్వాసము
సంపూర్ణము.

———

శ్రీరామచన్ద్ర పరబ్రహ్మణేనమః.

# శ్రీ రుక్మిణీ కల్యాణము

## తృతీయాశ్వాసము.

శ్రీ సీతామహిళాహృది
కాసారవిహారహంస ♦ కౌస్తుభభరణా!
వాసవ శివ సురహిత
దాసార్చిత పారిజాత ♦ దశరథరామా! 1

వ॥ అట్లు సూతుండు శౌనకాది మహామునులకుఁ జెప్పినట్లు శుకుండు పాండవాన్వయ కులాభరణుండగు పరీక్షిన్నరేంద్రునితోఁ జెప్పెడి కథావిధానం బెట్టులన. 2

చ॥ పలుతెఱఁగుల్ ప్రయాసపడి ♦ భైష్మిని యా శిశుపాల భూపుకే
కలఁతయు లేకఁ గూర్పఁదగు ♦ కాంక్షమదిన్ గలవారలయ్యుని
స్తులచతురంగసైన్యమునుఁ దోడ్కొని పౌండ్రకదంతవక్త్రులున్
జలమున సాళ్వుఁడున్ జరని ♦ శాచరపుత్రుఁడు వచ్చిరెంతయున్.

వ॥ శిశుపాలుఁడు చతురంగబలసమేతుఁడై కుండిన నగరంబునకుఁ జనుదెంచిన వార్త నెఱింగి రుక్మిణీమణి తనమనంబున నిట్లు వితర్కింపఁదొడంగె. 4

ఉ॥ అక్కటసోదరుండిటుల ♦ నాడిఁబెట్టఁదొడంగెఁ దండ్రియున్
మక్కువఁజూపి యాకుటిల ♦ మార్గమునే ననుఁ జైద్యుచేతికిం

దక్కఁగఁజేయ నెంచెడును,♦దైవముఁగూడనువారితోడనై
చిక్కువడంగఁజేయు విధి♦చేత లెఱుంగ తరంబె యేరికిన్.

వ॥ అనియిట్లు పరిపరి విధంబుల డోలాయమాన మానసయై
ముఖంబున విన్నదనంబుఁదోప మందగమనంబున నాసుం
రాంగి యొంటరిగా నిజాంతికంబునుంబాసి కేళీవనంబు
నుంజేరి. 6

గీ॥ కూరిమినివీడి తుమ్మెద ♦ కొదమ కదుపు
రాయిడిని వీడి రేకులు ♦ రాలినట్టి
ప్రసవదళములు పఱువని ♦ పఱుపుగాఁగ
వెలఁది రుక్మిణి యచ్చోట ♦ విశ్రమించి. 7

ఉ॥ అక్కమలాక్షి యప్డు దను♦జారిపదంబులు చిత్తమందునన్
దక్కఁగఁజేసి నిశ్చలపు♦తత్త్వనిరూఢినిఁ జొక్కియుండఁగా
నక్కజమయ్యె దేవతల ♦ కందఁగరాని మహావిభూతిచేఁ
జొక్కెడి రుక్మిణీసుదతి♦చూడ్కులచంచలమై వెలుంగఁగన్

మ॥ లలితాంభోరుహనేత్రు గోపరమణీ♦లావణ్యపాత్రున్ సము
జ్జ్వలమై వెల్గెడి నీలగాత్రుఁ గబరాం ♦ చత్పింఛలీలు న్ని
శ్చలవేదాంతరహస్యతత్త్వనిలయున్♦జర్చించిపూజించిహృ
న్నిలయంబందున నిల్పఁగాఁదొడఁగె నా♦నీరేజపత్రేక్షణన్

వ॥ అనంతరమా రాచకన్నియ శ్రీకృష్ణస్తోత్రంబుఁ జేయు తెఱంగెట్టిదనిన. 10

శా॥ బృందారణ్య తరుప్రదేశముల గో ♦ విందుండు సానందుఁడై
యందంబొప్పఁగ గోపికామణుల కా ♦ హ్లాదంబుసంధించి యా
నందబ్రహ్మము నందఁజేసి మురళీ ♦ నాదాను కూలంబునన్
విందుల్ గూర్చినమాధవాంఘ్రియుగముల్ ♦ వీక్షింపఁగానేర్తు నే.

మ॥ భగవంతున్ వసుదేవసూనుని హరిన్ ♦ బద్మాక్షులోకేశ్వరున్
సుగుణభ్రాజితు భక్తరక్షకుఁ బరం ♦ జ్యోతిన్ బ్రభున్ మాధవున్
జగదానంద పదార్థమూల నిలయున్ ♦ సద్భక్తిమైమ్రొక్కి నే
ఖగరాడ్వాహుని నిత్యమంగళునుతుల్ ♦ గావింతు శశ్వద్గతిన్.

శా॥ భూనాథుండును రుక్మి చైద్యుఁ బిలువం బోనంపె నవ్వాఁడునున్
సేనల్ దోడ్కొని వచ్చెనేఁడిలికి, నా ♦ చిత్తంబునున్ భీతిచే
నానావస్థలఁ బొందుచున్నయది, యు ♦ న్నాథుండు కృష్ణుండు సై
న్యానీకంబులఁ గూడి వచ్చునఁగదా ♦ నాకోర్కె లీడేరెడిన్

రగడ॥

దేవకినందన- దేవాశ్రితపద । పావననుతగుణ - భక్తజనావన*
నిరుపమకరుణా-న్వితగుణభూషణ । ధరచక్రాంకిత - దానవ
మర్దన*గోవిందాచ్యుత - గోపరిపాలన । భావాతీతశుభంకర
వర్తన*నారదసనకస-నందనవందిత । సారససంభవ - సన్నుత

చరితా*నిగమములెన్నఁడు – నినుఁగనఁజాలవు । పగతులునిను
గన–భస్మమయ్యెదరు*కలుషరహితనీ । ఘనమహిమంబును ।
తెలియఁగఁజాలరు । దేవతాళిమది*నద్భుతంబునీ । యఖిలజగం
బులునుద్భవవృద్ధిల । యోపాయంబులు*నరయఁగనీచే । నగు
నిశ్చయముగ । చిరకాలమును । స్థిరుఁడవుజూడఁగ*నంతటికినినీ
వంతర్యామివి । శాంతిరూపుఁడవు । శాస్త్రనుతుండవు*నీవేయ
నిగద । నినుఁబూజింతురు । దేవదేవ! మది । దేవతలెప్పుడుఁ*
బ్రాణులకెల్లను । ప్రాణసముండవు । రాణఁజెందిసుర ।' రాజ
రాజవట*అజరుద్రాదుల । కన్నివేళలను । భజనీయంబగు । పర
మమూర్తివట*సత్యసంధుఁడవు । సర్వోత్తముఁడవు । నిత్యుఁడ
వజుఁడవు । నిరుపద్రవుఁడవు*వేదమయుండవు । విశ్వాతీతుఁడ।
వాదియునంత్యము । లమరఁగగానని*యక్షరరూపుఁడ।వభవని
రంజన । పక్షీంద్రధ్వజ । భవభయభంజన * మాధవకృష్ణా ।
మధుసూదనహరి । సాధుజనాశ్రిత । సన్నుతిఁజేతును*కన్నతం
డ్రియును । ఖలుఁడుసోదరుఁడు । పన్నగననుశిశు । పాలమూ
ర్ఖునికి*నీయఁదలంచిరి । నీతిఁదప్పిననుఁ । గాయజరూపా । కాల
హరణముఁ*జేయనెంచకుము । శ్రీహరిమ్రొక్కెదఁ । బాయని
ప్రేమను । బాలించుమునను*సన్నుతిఁజేసెదఁ । జయ్యనరావే।
ఖిన్నురాలహరి! కేశవ! దయతో*మన్నించుమునను । మరిమరి

వేడెద । కన్నులుగానని । గర్వోన్మత్తుల*ననిఁదునుమాడియు ।
హరి! నన్నుఁజేకొన । మనమునఁజింతులు । మంజులభాషా!*
త్రాహిత్రాహియని । తల్లడిల్లినిను । పాహిపాహియని । ప్రణు
తిఁజేసెదను * దిక్కులేమినీ । దిక్కనజేరితి । మ్రొక్కెదనీపద ।
ములకును దేవా! * పక్షివాహనా । పరమదయాళూ । రక్షరక్ష
జగ । ద్రక్షక వేడెద*వలసితినీసే । వలనుజేయుఁగను । తెలియ
లేవయీ । దీనురాలిమొర*హరిసర్వోత్తము ।డంచునిన్నుమది
పరిపరివిధముల । ప్రార్థనఁజేసెద. 14

చ॥ నిరతము తావకీయ పద ♦ నీరజయుగ్మవు సేవనంబు ను
స్థిరతర నామకీర్తనము ♦ జేసెడి భక్తులకింద్రియంబులీ
శ్వర! భవదర్పితంబులయి♦సాత్త్వికనిశ్చలమోక్షమార్గమం
దురువడిఁజేరికృష్ణ!మహి♦మోన్నతిఁజెందునుగాదె మేదినిఁ

వ॥ అని యనేకప్రకారంబుల వాసుదేవస్తవంబునుం జేయుచు
నారాచమిన్న యోగనిద్రిందగిలిన మహాయోగినివోలెఁ
గనుంగవమూయుసమయంబున. 16

సీ॥ విరులపానుపుఁజేరి ♦ హరినిఁజింతించుచుండ
వరదుఁడై కృష్ణుండు ♦ వచ్చినట్లు
వచ్చిన నాథుని ♦ వదన పద్మముఁజూచి
ప్రాణేశు పదములఁ ♦ బడిన యట్లు

పదములకెఱఁగిన ♦ పడతిమెల్లన నెత్తి
గుచ్చికౌఁగిటఁ జేర్చ ♦ గొన్నయట్లు
గ్రుచ్చికౌఁగిటఁ జేర్చి ♦ కోరి రుక్మిణిమోము
ముద్దాడి చికురముల్ ♦ దిద్దినట్లు
గీ॥ దిద్దినాథుండు గడు బ్రేమఁ ♦ దిగిచి తేరఁ
దన్నుఁ జేర్చుకు పురికేగు ♦ చున్నయట్లు
నిదురయందున రుక్మిణీ ♦ నీరజాక్షి
మేలుకలఁ గాంచి యంతట ♦ మేలుకొనియె. 17

క॥ ఇది శుభమగు కల యని వడి
మదిలోఁ దలపోయుఁ బ్రియుఁడు ♦ మాధవుఁ డకటా
యదియేల రాఁడొకో యను
సదమలుఁ డా విప్రవరుని ♦ జాడఁ దలంచున్ 18

చ॥ అతిదురితక్రియాభిరతుఁ ♦ డైన మదీయసహోదరుండు న
న్నతిచెడి చేదిపాలునకు ♦ మానినిగా నొనఁగూర్ప నెంచి యా
క్షితిపతిఁ బిల్వనంపె నికఁ ♦ జేయువిధంబది యెట్టులౌనొ మ
ద్గతిపతియైన కృష్ణపద ♦ కంజయుగంబును జూడనబ్బునో!

ఉ॥ ఎన్నఁడు చూడఁగాంతు దరలేక్షణు మాధవు ముద్దుమోము, న
న్నెన్నఁడు పెండ్లియాడు, మన ♦ మింపుఁదలిర్పఁగ సంతసిల్లి నా

వెన్నుని మస్తకంబున న ♦ వీనముతో తెలిముత్తియంపుఁ బ్రా
వెన్నుఁడునింతుభక్తి హృద♦యేశ్వర!యంచని ముచ్చటింతువో!

వ॥ అనియనేక పరిశారంబులఁ దలంచుచు నమ్మించుఁబోఁడి యించుకఁదలవంచి తలవనితలంపుగా శ్రీకృష్ణసందర్శనాతురత మనంబున నగ్గలంబుఁజేయ. 21

సీ॥ నిట్టూర్పు లెంతయో ♦ నిబిడమై జనియింప
హామాధవా! కృష్ణ! ♦ యంచుఁబొరలు
మోహాగ్నిచేఁ గ్రాగి ♦ ముదిత విెక్కిలినొచ్చి
హాపద్మదళనేత్ర! ♦ యంచుఁబొక్కు
దనువల్లి కెంతయుఁ ♦ దాప మగ్గలమైన
వడవడఁ గృశియించి ♦ వనటఁ గుందు
ఘర్మాంబువులతోడఁ ♦ గాయంబు నిండిన
నళినాక్షుపైఁ గిర ♦ నములఁబాడు

గీ॥ హరినిఁ బతిఁజేయఁ బార్వతి ♦ నాత్మనెంచు
బద్మనాభుండు తనపాలి ♦ భాగ్యమనుచు
సంతసించును నంతలోఁ ♦ జైద్య నృపుఁడు
దలఁపునిల్చిన భీతిచేఁ ♦ దత్తరిల్లు. 22

సీ॥ భృంగంబు లన్నియు ♦ సింగమ్ములై దోఁచె
గాలిబాలకు నుగ్ర ♦ కీలయయ్యెఁ

బికములన్నియుఁ గూడి ♦ మొకముత్తై కనుపించెఁ
జూతపల్లవములు ♦ భీతిఁ గొలిపె
బన్నీరు గాల్వలు ♦ మున్నీరు గాఁదోచెఁ
గలువలు చెలియకుఁ ♦ జిలువలయ్యె
శారికంబుల పిండు ♦ మారిగాఁ గనుపించెఁ
దామర తూడులు ♦ త్రాచులయ్యె

సీ॥ నేమి సెప్పఁగవచ్చు రా ♦ కేందు ముఖికిఁ
బీతినొన గూర్చు సవియన్ని ♦ భీతిఁగదుపఁ
దాళఁగాలేక హృదయంబుఁ ♦ దల్లడిల్లె
భాసురాంగికి శ్రీకృష్ణు ♦ ప్రణయమందు. 23

వ॥ అంతనంతఃపురంబున రాకన్నియ లేనికారణంబున నెచ్చె
లులు తత్తరపడి.

ఉ॥ బాలికయింటలేదు మరు ♦ బాణపుఁ దాకునకోర్వలేక యా
జ్వాలల మేనుఁగంది వన ♦ వాటికి నేగెనొ యెందుబోయెనో
వైళము జూడనేగెదము ♦ వావిరి వచ్చెద రమ్మయంచు న
బ్బాలిక నెచ్చెలుల్ చనిరి ♦ వారిజనేత్రి విహారసీమకున్. 

వ॥ అట్లుజని వనంబున రుక్మిణీమణి నన్వేషింపదొడంగి. 26

సీ॥ ఈత్రోవనే యేగె ♦ నిందీవరేక్షణ
చరణాంచలంబుల ♦ జాడఁ గనుఁడి

లేమావి ఛాయల ♦ లేమ విశ్రమమొంది
లేఁజిగుళ్లు మేఁ పిక్క ♦ లీలఁ దోఁచె
రాజిల్లు జాబిల్లి ♦ రాతిన్నెపైఁ గొమ్మ
కూయుచుండఁగఁ దోఁచెఁ ♦ గోరికలర
నీమహీజము చెంత ♦ నించుక తడవుఁదా
సేద దేరఁగఁ దోఁచెఁ ♦ జెలియ! కనుమ

గీ॥ తూనిగారపు సూనము ♦ లింతిచేత
పద్మదళనేత్రి! కర్పింపఁ ♦ బడిన యటుల
గానఁగావచ్చె నొకక్రమ్మోలఁ ♦ గాంచనములు
పొగడ మల్లెలు విరజాజి ♦ ప్రోగు వడుట. 27

సీ॥ అక్కజంబుగ పాన్పు ♦ నెక్కనేరని బాల
యీకప్పురపుఁదిప్ప ♦ లెట్టుల నెక్కె
విరిదీగె సోకిన ♦ వెరపు నొందెడి కన్య
మీఱి యీ పొదరిండ్ల ♦ దూరె నెట్టుల
వీణవాయింపంగ ♦ వినలేని సుకుమారి
శుక పిక రవములే ♦ చొప్పు వినెనొ
వింజామరము వీవ ♦ విసుగు నొందెడి లేమ
యేరీతి నుడిగాడ్పు ♦ కెదురనిలచె

సీ॥ పిల్ల లాటలఁ ద్రవ్విన ♦ పిల్లకాల్వ
దాట వెరఁగొందు చుండెడి ♦ తలిరుబోణి
మేటిగొజ్జంగి పూనీటి ♦ వోటికాల్వ
దాటనోపెను చిత్రంబు ♦ బోటులార! 28

వ॥ ఇట్లు వెదకుచు రుక్మిణీదేవినిడాయంజన నత్తలోదరి. 29

గీ॥ హరహరీయంచు గృష్ణుని ♦ నాత్మఁ దలఁచు
భ్రమరములు జేయుధ్వనులకు ♦ భయము నొందు
చిలుక పలుకల కొకయింత ♦ యులికి పడును
మదనవేదన కతమున ♦ నుగువ యపుడు 30

వ॥ అంతనచ్చెలులు వైదర్భినింగాంచి. 31

ఉ॥ కొమ్మరో! మోహముందగిలి♦గుందుచునిట్లెడఁబాసియిమ్మె
మమ్మలఁజేసి యొంటరిగ♦మానినివచ్చుటపాడిగాదునె [యిక
త్తమ్ములగేరు నీమృదుప ♦ దంబులుఁ గుందెఁగదమ్మ! దిట్టవా
దమ్మ! తలంపరాని పను ♦ లక్కట చేయఁగవచ్చునే చెలీ! 32

ఉ॥ చెంతకుఁజేరి యాడిగపు♦చేడెలు రుక్మిణిఁగాంచి ప్రేమతో
నెంతయుమక్కువన్ బెనచి♦యిద్ధమయూరమరాళశారికా
సంతతిఁగాంచి భీతిలుచు ♦ సారెకు వాటినదల్చె దేల (శ్రీ
కాంతునిమోహముఁదగిలి♦కామిని!నిర్దయఁజూపనొప్పునే!

చ॥ మదనసమానమూర్తి యగునూధవు పాదసరోజయుగ్మముఁ

మదిఁదలపోసి యిట్లుపలు ♦ మారు స్మరించి కృశింపనేల స
మ్మదము నసీమనోహరుఁడు పూజ్యుఁడు తప్పక వచ్చునింతలో
మదకలహంసయాన! విను ♦ మా యనుమాన మదేలరుక్మిణీ!

చ॥ చెదిరినముంగురుల్ మిగుల ♦ జెమ్మటచేతను నిండు జెక్కులున్
వదలిన వేణిబంధమును ♦ వాసి వొరంగెడి మేనుదీవయున్
బదములదొట్రుపాటుఁగల ♦ భామిని రుక్మిణిఁ గాంచి నెచ్చెలుల్
పదిలము నొందఁ జేసి మృదు ♦ వాక్కుల ధైర్యముఁ గొల్పిరెంతయున్

గీ॥ విరహవేదన పీడిన ♦ వేణిఁ జుట్టి
చికురముల్ దిద్ది హారముల్ ♦ చిక్కు విప్పి
కామబాణాగ్నిఁ గుందిన ♦ మోముఁ దుడిచి
తిలకముం బెట్టిరా సతీ ♦ తిలకమునకు 36

ఉ॥ అంతట రుక్మిణీమణిని ♦ నంతిపురంబునఁ జేర్చి మోహమా
క్రాంతముగాగ చిత్తమునఁ ♦ గ్రాగెడియా సరసీరుహాక్షినిన్
మంతనమందుఁ జేరి, చెలి! ♦ మానుము సంశయ మచ్యుతుండు న
త్యంతముదంబునన్ బురము ♦ నందున బౌరులు జూడ వచ్చెడిన్

వ॥ ఇట్లు భీష్మకరాజపుత్రికి మృదూక్తుల శ్రీకృష్ణాగమన ధై
ర్యంబు నిచ్చుచు వాసుదేవుం డెప్పుడు వచ్చునో యని తదేక
దీక్షగా నంతిపురాంగనలుండి రచ్చట రుక్మిణీదేవివలన నను
పంబడిన భూసురోత్తముం డత్త్వరితంబుగాఁ జని. 38

మ॥ చనివిప్రోత్తముఁ డంతఁ గొంతవఉర్వీసాంద్రద్రుమాకీర్ణకా
ననముల్ గొన్నిటిఁ దాటి గోపవనితా ♦ నందంబు దనర్ వెల్గు హ
ర్మ్యనికాయంబులఁ గల్గు ద్వారవతినిర్ ♦ రంజిల్లుచుం జొచ్చి శ్రీ
వనజాక్షుండు వసించు నంతిపుర స ♦ ద్ద్వారంబునుం జేరియున్.

వ॥ తన రాక రాజభటులచే నెఱింగింప. 40

చ॥ వినిముద మొంది కృష్ణుఁ డరవిందభవాన్వయుఁ దోడి తెండటం
చని తగువారలం బనుప ♦ జయ్యన వారలమేయ భక్తితోఁ
జని హరియాజ్ఞ విప్రునకు ♦ సౌమ్యతఁ దెల్పుచు మ్రొక్కి ప్రేమ న
వ్వనజదళాయ నేత్రు సుర ♦ వంద్యుని నద్దకు దెచ్చి రెంతయున్.

వ॥ ఇట్లు వచ్చిన విప్రోత్తముని కెదురుగా శ్రీహరి చని తోడ్కొని వచ్చి పరిరంభణ మాచరించి దైవభక్తి స్ఫురణంబున నమ్మహాత్ముని కుచితాసనం బొసంగి పూజించి, మహాత్మా! భవదీయదర్శనంబున ధన్యుండ నైతి ననిన నగ్నిద్యోతనుండు శ్రీకృష్ణపరమాత్మునికిఁ బ్రతివందన మాచరించి యిట్లనియె

సీ॥ స్వస్త్యస్తు నీకు నో ♦ జలధిపన్నగతల్ప!
శ్రీరస్తు యదువంశ ♦ శ్రీవిలాస!
దీర్ఘాయురస్తు పృ ♦ థ్వీశ సన్నుతకళా!
కల్యాణమస్తు వి ♦ క్రమవిశాల!

ఐశ్వర్యమస్తు! దైత్యారి! ♦ మాధవ! హరీ!
విశ్వసన్నుతిరస్తు ♦ వేదవినుత!
సౌభాగ్యమస్తు! స ♦ జ్జన పాలనాధ్యక్ష!
భూరిసుకీర్త్యస్తు ♦ పుణ్య చరిత!

గీ॥ నిగమ లోకవిహార వి ♦ నీలగాత్ర!
లలిత శ్రీవత్స లక్షణ ♦ లక్షితాంగ!
హారవనమాలభాసిత ♦ చారువక్ష!
అవ్యయానంద! పరమేశ! ♦ యాదిపురుష! 43

సీ॥ వందనంబొనరింతు ♦ వంశగానవిలోల
యంజలి యొనరింతు ♦ నాదిమూర్తి
జోహారు గావింతు ♦ సుత్రామ వందిత!
దండంబు లిడుదునే ♦ దైత్యహరణ!
ప్రణుతి జేసెదనీకు ♦ ఫాలాక్ష నుతలీల
కైమోడ్పు విరచింతు ♦ కంస దమన!
సాష్టాంగము ఘటింతు ♦ సర్వాఘ సంహార
సన్నుతి సేసెద ♦ సారసాక్ష!

గీ॥ దాస్యమొనరింతునీకునో ♦ దానవారి
శరణుజొచ్చెద లోకైక ♦ శరణనీకు

ధన్యుఁడైతిని భవదీయ ♦ దర్శనమున
నిగమసంచార శ్రీకృష్ణ ♦ నీరజాక్ష! 44

చ॥ సరస మునీంద్రవంద్య! బుధ ♦ సంఘసుసేవితలీల, దేవకీ
తరుణితపఃఫలంబ! నిజ ♦ దాసమనోహర! గోపకామినీ
వరద! యశోదబాల! సుర ♦ వందితపుణ్యసుశీల! సుప్రభా
కర! కరుణాలవాల! హరి ♦ కంసవిదారణ! లోకపాలనా!

దండకము.

శ్రీమన్మహాదేవ దేవోత్తమా నాగ్వభామా! రమా మానినీ మానసాంభోజసారంగ! రంగద్దళత్పద్మనేత్రా! మహా మాయ! లీలావతారా! యుమానాథవంద్యా! లసద్దివ్యరూపా! జగద్వ్యాపకా! భక్తబృందావనాకంది! గంభీర! ధీరా! దయారూప! గోవింద నారాయణా! సర్వకల్పాంత కాలంబునం దీవు సద్యోగ నిద్రావశత్వంబుచేఁగొంత కాలంబుఁబోనిచ్చి యాపైనినీచిత్తమందీవు నీలోకనిర్మాణముం జేయ సంకల్పముం బూన నీనాభిమధ్యంబునందొక్క బంగారుపద్మంబు నుత్పన్నమయ్యెంగదా, దానిలో శారదాజానియుంబుట్టియాపద్మనాళంబునుంజొచ్చి యందుం విలోకించి నీలీలఁదా గానఁగాలేక యాపద్మముంజేరి దీనాత్ముఁడై నీదుపాదారవిందంబు లందంబుగాచిత్తమందుం దగంనిల్పి వేయేండ్లుధ్యానింప నీవుం బ్రి

సన్నుండవై సృష్టినిర్మాణముం జేయు శక్తిన్ బ్రసాదించియా బ్రహ్మరూపంబునఁ లోకసృష్టిఁ బ్రకాశింపఁగాఁ జేయఁగానంత విష్ణ్వాఖ్యచేఁ గాలనాధిక్యతంగాంచి యీశానురూపంబునఁ సృష్టినిఁ బాపితీరీతి నీలీల లెంతేని గూఢంబుగానుండ నేకాకివై నామ రూపంబులుఁ లేక లోకాళి నీకుక్షిలోఁ జేర్చి సానంద బ్రహ్మంబవై రూపనామంబులుంగల్గి రూపించు నిఁ గానఁగా లేకఁ జిత్తంబునఁ నెందరెన్నేనిమార్గాలనూహించినఁ గోయు కుంభాంతరాళంబు నందొక్క సూర్యుండు పెక్కండునైగాఁ దోచుభంగిఁ దలంపంగ బంగారముఁ బెక్కురూపంబులఁ సొమ్ములై దోచు చందంబునఁ నీవునానాప్రకారంబులఁ దోచి నఁగాని నే యుల్ తుదిఁ సింధువుఁ జేరురీతిఁ రమానాధ నీకున్న దేభేద మజ్ఞాను లూహింపఁ గాలేక నానావిధుల్ సేతు రో దేవనీదివ్య లీలావతారంబు లీభూమిపై నెత్తి ధర్మాత్ములఁ బ్రోచి దుష్టస్వభావాత్ములఁ ద్రుంపవే! కృష్ణ! గోవింద! నీ దివ్యశ్రీపాదపద్మంబులంగంటి నాజన్మసాఫల్యముం జెందె నీలీల లాదేవదేవుల్ స్మరింపంగ లేరన్న, నేనెంతవాఁడఁ నరుండఁ జడుండఁ కృతార్థుండనైతిఁ, నినుఁ జూడఁగంటిఁ ననుఁ లెస్స రక్షింపు మోదేవదేవా! హరీ! వాసుదేవా! నమస్తేనమస్తే నమస్తే నమః.

46

క॥ అంచితముగ హరినిల్లు ను
తించుచుఁ గొనియాడు విప్ర ♦ తిలకుఁగని విశే
షించియు ముదమున హరితా
నెంచుచు నీవిధిని నడుగ ♦ నెంచెను భూపా! 47

చ॥ వననిధిదాటఁగల్గి సుర ♦ వర్యులకున్ జొరరాని దీవికిన్
మనుజకులావతంస! బుధ♦మాన్యుఁడ! యెట్టులవచ్చితయ్య! యే
జనవరుపట్టణంబునను ♦ సాధులుమీరలునుందురయ్య! యా
మనుజవరేణ్యుఁ డెంతయును ♦ మాన్యుఁడుఁబూజ్యుఁడు మాకుఁ [జూడఁగన్.

గీ॥ అనిన విప్రుండు కేల్మోడ్చి ♦ యనియె నిట్టుల
బరమపావనచరిత గో♦పాలకృష్ణ!
వినుము నాయున్కి భీష్మక ♦ జనవరేణ్యు
పాలితంబైన కుండిన ♦ పట్టణంబు. 49

క॥ ఆనరనాథునిపుత్రిక
గానఁగ భవదీయసేనఁ ♦ గాక్షించిమదిన్
దీనావన! శుభవార్తను
మానుగఁబంపించె వినుము ♦ మాధవ! ప్రీతిన్. 50

క॥ నీకంటె నొండెఱుంగను
నీకంటెం బరుఁ జూడ ♦ నేరదుకనులన్

నీకళ్యాణ చరితమనయము
లోకస్తుత! చదువు లోల ♦ లోచనభక్తిన్. 51

వ॥ పురుషోత్తమ! రుక్మిణీమణి భవత్పాదారవిందములకు వంద
నములాచరించి నాచేఁబుత్తెంచిన ప్రార్థనంబెద్దియన. 52

క॥ హరికీజన్మంబున నే
కోరగామిని యాదునేని ♦ కుంభినిలోనన్
మరుజన్మమెత్తి శ్రీహరి
వరియించెదఁగాని పరుల ♦ వరియించెద నే! 53

గీ॥ అంతిపురమున నేనుండ ♦ నచటిబంధు
వర్గముంజంపి తెచ్చుట ♦ పాడిగాద
టంచుఁ బల్కిన మరి యుపా ♦ యంబుఁగలదు
విన్నవించెద వినుము సం ♦ పన్నమతిని. 54

గీ॥ పరిణయమునకు ముందు నన్ ♦ భవునిరాణి
యాలయమ్మునకు మావార ♦ లధిప! పూజ
సేయఁబంతురు నీవునా ♦ చెలువ మెఱిఁగి
వేగఁ గొనిపొమ్ము నీవెను ♦ వెంట కృష్ణ! 55

వ॥ అదియునుంగాక, 56

సీ॥ విమల మానస సరో ♦ విహారణంబులఁగోరు
మదహంస చేరునే ♦ మడుగులకును!
ఘనమేఘముల నీరుఁ ♦ గాంక్షించు చాతకం
బరుగునే ఖారవా ♦ వారిఁ గోరి!
నరవింద మకరంద ♦ మాసించు రోలంబ
మిక్షురసంబుపై ♦ నిచ్ఛఁగొనునె!
మాకందఫలముల ♦ మాధుర్యముంజొక్కు
రాచిల్క పెనువేప ♦ రసముఁగొనునె!

గీ॥ పద్మదళనేత్ర! భవదీయ ♦ పాదపద్మ
చింతనమునందుఁ జొక్కెడి ♦ చిత్తమన్యుఁ
జేరనెంచునె నిత్యసు ♦ స్థిరతనొంది
భక్తమందార! గోవింద! ♦ పరమపురుష! 57

వ॥ అనియిట్లు రుక్మిణీదేవి ప్రార్థనంబెఱింగించి. 58

క॥ ఆసతికి నీవె నీకిల
నాసతియే తగును చూడ ♦ నంబుజనాభా!
వాసిగ మీగలకును శుభ
వాసరమునఁ బెండ్లియాను ♦ వాసవవినుతా! 59

మ॥ హరిణంబాకమలాక్షి నేత్రముల సా♦మ్యంబందఁగాలేక దు
ష్కరమై చెల్లువనప్రదేశముల ని♦చ్ఛారీతిగాఁ జొచ్చియున్
దిరుగంజాలక యాసుధాకరుని బాం♦దేన్ గాని లేకున్న నా
హరిణంబెక్కడ చంద్రుఁడెక్కడ తదీయాంకుండు వాఁడెట్లగున్

క॥ ఆకలికి మధురవాక్కుల
కా! కలియఁగ లేక చిలుక ♦ గమి గర్వంబున్
జీకాకయి ఫలములఁ దిని
వ్యాకులతన్ సంచరించె ♦ వనముల నెపుడున్. 61

ఉ॥ సారసవైరి యీయబల♦చారుముఖద్యుతిఁ బోలు తేజమున్
గోరి తపంబొనర్ప శివుఁ ♦ గోరి శిరంబున నెక్కఁగాని, కా
మారియు నట్టిసత్కళ ను♦దంచితరీతి నొసంగ కుంట, నీ
తీరు కళంకుఁడై నిశలఁ ♦ దెంపరియై తిరుఁగాడ జొచ్చెడిన్.

క॥ కుందములందములగు నే!
బృందాగనలోల! భ్రమర ♦ బృందము ఘనమే!
యిందీవరలోచన కులు
చందమునకు మరియు కురుల ♦ చందంబునకున్. 63

ఉ॥ కమ్మనిదావియుంగలిగి ♦ కాంత తనుద్యుతినొంద జాతరూ
పమ్మనిశమ్ము తప్తమయి ♦ వహ్నిఁబడై నెలఁజక్కి దానిసా

మ్యమ్మునకందర్ మణిస ♦ హాయముఁగోరి యనేకరీతులర్
సొమ్ములుగాఁదదంగమునుజొచ్చెనుగాఁగులఁగాకమాధవా

సీ॥ భువినుండఁగాసిగ్గుఁ ♦ బొందఁగావలెనంచు
జదలఁబ్రాకెఁ దొడంగె ♦ జంద్రుఁ డకల
పట్టణంబులనున్న ♦ పరువు దక్కదటంచు
సింగముల్ గుహలలోఁ ♦ జేరుకొనియెఁ
దడవున్న నను రిత్త ♦ తగవుఁ దించెదరంచు
నురుమేఘముల మాటు ♦ కరిగె మెరుపు
చనుచున్న మనకు వం ♦ చనమంచు నెంచి రా
యంచలు నీట నీ ♦ దాడఁదొడఁగె

గీ॥ ననగఁ గనుపెట్టె ముఖకాంతి ♦ యబ్జనేత్రి
మధ్యమంబును తనులతా ♦ మహిత దివ్య
కళల నానాతి గమన సం ♦ గతులు జూడ
సమములేవెవ్వి పృథ్విలోఁ ♦ జర్చసేయ. 65

క॥ అనవిని హరిముదమున
వినయంబున విప్రుతోడ ♦ వివరించె నిటుల్
అనఘా! వినుమాభీష్మక
జననాయకుఁ బుటికినచ్చి ♦ సతిఁజేకొనెదర్. 66

ఉ॥ మానినిమీఁద నాతలఁపు♦మగ్నము నొందుటచేత నెమ్మదిన్
బూనను సౌఖ్యచింతనము ♦ భోగములెవ్వియుఁగోరనొల్ల నే
భూనుతమైన భోజసుత ♦ భూసుర! నేనిటఁదెచ్చి రుక్మినిన్
మానవనాథులై వెలయు♦మాగధ చైద్యులఁ గూల్తునెంత
వ॥ అనియిట్లుజెప్పి వాసుదేవభూసురవరులిరువురు [యున్.
గీ॥ గరుడకేతన రథమునఁ ♦ గట్టఁజేసి
సైన్య సుగ్రీవ మేఘపు ♦ ష్పక వలాహ
కంబులను నశ్వములను వి ♦ ఖ్యాతివెలుఁగు
నరథమందున నెక్కిరి ♦ హరియు ద్విజుఁడు. 69
చ॥ అరదపు రథ్యముల్ మణిగ♦ణాంచిత భూషణ భాసితంబులై
వరలెడి వాసుదేవుని వి♦వాహమహోత్సవ దర్శనార్థమై
నరిఁగడిరీతిఁ దారకుని ♦ హస్తపు సంజ్ఞలెఱింగి తీవ్రతన్
బఱుఁగిడి జేరెకుండినపుఁ♦ బౌరులుసంతసమొందిజూడఁగన్.
వ॥ ఇట్లు శ్రీకృష్ణుండేకాకియై విరోధులగు సాళ్వజరాసంధ
పౌండ్రక శిశుపాలురఁగూడియున్న ప్రదేశంబునకుంబోయె
నని తెలసిబలరాముండు చతురంగబల సమేతుండై కుండిన
నగరంబునకువచ్చి వాసుదేవునింగలిసెనని, 71
క॥ ఘనుఁడగు సూతుఁడు మునులకు
వినిపించినగతిని శుకుఁడు ♦ వివరించి పరీక్షి

జ్జనపతికిఁదెల్పి భూపతి
విని యవ్వాలకథను భక్తి ♦ వినఁగోరుటయుర్. 72

క॥ ఇనవంశజలధి హిమకర
ఘనవారధిసేతురచన ♦ కల్మషహరణా!
మునిలోకవినుత రాఘవ!
జనకాత్మజ హృదయలోల! ♦ జానకిరామా! 73

మాలిని
శరనిధి గభీరా♦శత్రు వన్యాగ్నిరూపా!
గిరివర సమధైర్యా♦ కేవలానందభూపా!
ఖరదనుజ విరామా ♦కామితార్థప్రదీపా!
సురుచిరమృదుభాషా♦క్షోణిజాచిత్తవాసా! 74

ఇగి శ్రీహనుమద్దేవ దయారస లసత్కటాక్ష
కవితాధురీణ పంతము గోపనార్య పుత్ర
ఆంజనేయకవి కృత శ్రీ రుక్మిణీ
కళ్యాణమను కావ్యంబునఁ
తృతీయాశ్వాసము
సంపూర్ణము.

శ్రీరామచన్ద్ర పరబ్రహ్మణేనమః.

# శ్రీ రుక్మిణీ కళ్యాణము

## చతుర్థాశ్వాసము.

శ్రీమద్రాజకులాంబుధి
సోమా! రఘురామచంద్ర ♦ సూరివరేణ్యా!
భీమాసుర భంజన రఘు
రామా! భూజాతహృదయ ♦ రాఘవ రామా!

వ॥ అట్లుసూతుండు శౌనకాదిమునీంద్రులకు జెప్పెడి తెరంగున వ్యాసపుత్రుండర్జును పౌత్రునితోనిట్లనియె రుక్మిణీమణి హరిభూసురులజాడందెలియక నిజమనంబున నిట్లువితర్కింపందొడంగె. 2

గీ॥ లగ్నమాసన్నమయ్యెను ♦ రాడు హరియు
బ్రాహ్మణుండును ద్వారకా ♦ పట్టణంబుఁ
జేరెనో లేదో! కృష్ణుండు ♦ చిత్తమందు
వినియుఁ దప్పగదలఁచెనో ♦ విధియెటుంగ. 3

గీ॥ ఇటులఁజింతించుచుండెడి ♦ యింతికడకు
ధరణి సురవర్యుఁడరుదెంచి ♦ సురుచిరాంగిఁ

గాంచి సంతోషహృదయ సం ♦ కలితుఁడగుచుఁ
బలికె నిట్లని రుక్మిణీ ♦ భామఁ జూచి 4

మ॥ సనకాదుల్ కనలేని మాధవు హరిన్ ♦ జక్రిన్ ఘనున్ దుర్లభున్
వనితా! తెచ్చితి మెచ్చె నాతఁడు నినున్ ♦ వారిన్ జరాచైద్యులన్
ఘనుఁడై యుద్ధతిఁ బోరి రాక్షసులస ♦ త్కళ్యాణయుక్తి న్నినున్
వనజాక్షుండు వరించి చేకొను శుభ ♦ వ్యంబయ్యె నీజన్మమున్ 5

గీ॥ పూసగ్రుచ్చిన కైవడి ♦ పొంగితి నీదు
చరితమంతయుఁ జెప్పితిఁ ♦ జక్రధరుఁడు
తరుణి! నినుఁబోలి నీపైనిఁ ♦ దగిలియున్న
చిత్తముంగల్గి యున్నాఁడు ♦ చెలువ వినుము! 6

సీ॥ ఇంద్రనీలపుకాంతు ♦ లెనయు దేహంబుపైఁ
బీతాంబరద్యుతి ♦ పిక్కటిల్ల
మేఘంబుతో నుండు ♦ మెఱపుఁ దీగెనుఁబోలి
వక్షస్స్థలిని కౌస్తు ♦ భము వెల్గుంగఁ
గమలాప్తకోటి సం ♦ కాశమై జెలఁగుచు
ఘనకిరీటపుకాంతి ♦ క్రిందు కొనఁగ
నఖిల లోకంబుల ♦ కానంద మొనఁగూర్చు
కరుణాకటాక్షంబుఁ ♦ గ్రాలుచుండ

గీ॥ చారు కేయూర మణిమయ ♦ సారహీర
హారకుండల కాంతుల ♦ నతిశయింప
బర్హి బర్హావతంసుఁడై ♦ ప్రబలు కృష్ణు
నరిది పొగడంగ నెవ్వారి ♦ కైనఁదరుణి! 7

మ॥ జగతిన్ జైద్యనృపాలపౌండ్రకజరాసంధాదిమందాత్ములన్
జగతీశుండగుకృష్ణభూవిభుఁడనిన్ ♦ జక్కాడినిన్ గొంచుఁబో
వఁగనేయున్నయదంద్రియున్ వగచుచున్ వైవర్ణ్యముంబొందిమా
ర్గ్రాగముల్ పెట్టరె ధీరతన్ విడువరే! ♦ మోదంబునుందప్పరే

వ॥ అనవిని రుక్మిణీమణి ౯

ఉ॥ తల్లియుఁదండ్రియున్గురువు ♦ దైవముభ్రాతయుజుట్టమీవెనా
కెల్లవిధంబులన్ ద్విజకు ♦ లేశ్వర! యీవిపదబ్ధిఁదాటి నీ
వల్లనుఁగాదె నేమగుడఁ ♦ బ్రాణములందగనిల్పుకొంటినా
వల్లభుఁజూడఁగంటి నిక ♦ భవ్యతనీఋణమెట్లు దీర్చెదన్ 10

మ॥ సరసీజోద్భవశౌనీమహిమను ♦ సంస్తుత్యముం జేయనె
వ్వారిసాధ్యంబుః మహాత్మ గోపవిభునిన్ ♦ వరిష్ణునిన్ మాధవున్
బరమాత్మున్ జనితోడితెచ్చితివి మ ♦ త్ప్రాణంబుఁగాపాడి నన్
గరమొప్పన్ బ్రతికించునీకిదె నమ ♦ స్కారంబుఁగావించెదన్.

వ॥ అని యిట్లావిప్రునకుం దు జేసినమహోపకారంబునకు రుక్మిణీ
దేవి మనస్ఫూర్తిఁగా పునఃపునర్వందనంబు లాచరించి

వలయుపసదనంబులొసంగి పంపుసమయంబున బలరామకృష్ణు లరుదెంచిరనువార్త విని భీష్మకుండెదురేగి పూజించి తోడ్కొని వచ్చుతరిగోవింద సందర్శన కుతూహలంబునం బౌరసుందరులు గృహకృత్యంబుల వర్జించి మహాభక్తిని వస్త్రాభరణమాల్యానులేపనంబు లమ్మహాత్మునికి నర్పింపం గైకొనివచ్చి మంగళహారతులు నివాళులిచ్చుచు నిట్లుముచ్చటించిరి. 12

సీ॥ పసిబాలుఁడై యుండి ♦ బండిరాకాసుని
నీడ్చితన్నిన నాతఁ ♦ డితఁడు కాఁడె!
కాళీయఫణిఁ గాలఁ ♦ గజ్జలందెలు మ్రోయ
నృత్యమాడిన యాతఁ ♦ డితఁడు కాఁడె!
వ్రేతలఁ జిత్తముల్ ♦ ప్రీతితో హరియించి
నేనుగానను నాతఁ ♦ డితఁడు కాఁడె!
గోగోపకులఁ బ్రోవ ♦ గోవర్ధనము వ్రేల
నెత్తిన మహనీయుఁ ♦ డితఁడు, కాఁడె!
గీ॥ బ్రహ్మవిద్యకు నితఁడు పో ♦ పట్టుఁ గొమ్మ
నిఖిల పురుషార్థ హేతువై ♦ నెగడు నితని
మగనిఁ గాఁగోరు రుక్మిణీ ♦ సుగుణ నోము
ఫలము వర్ణింపఁ దరమానె ♦ బ్రహ్మకైన. 13

వ॥ అని తదీయ రూపరేఖా విలాస విభ్రమంబులఁ బ్రసంగించు
చుఁ బురంధ్రీమణులు సంతసింపుచుండెడి సమయంబున
భీష్మకుండు నిజాంతికంబునుం జేరి రుక్మిణీమణి నలంకృతిఁ
జేయ నంతఃపురవాసుల కాజ్ఞ నొసంగ నవ్వారలు. 14

చ॥ సరసిజనేత్రలంత మది ♦ సంతసమొందుచు రత్నకంకణా
భరణ, వినీలగాత్రి నవ ♦ పద్మదళాక్షిని రుక్మిణీమణిన్
సురుచిర పీఠమందుఁ గడు ♦ సొంపుఁదలిర్పఁగ నుండఁజేసి రా
దరమున మంగళాకరమ్ము ♦ దంగ నినాదములుప్పతిల్లగన్

మ॥ లలనారత్నములంత మోదమలరన్ ♦ లావణ్యతన్ బాడఁగా
దొలుకార్మేలు పసిండిపళ్లెరమునన్ ♦ దోరంపు రాగిన్నెలోఁ
జెలఁగన్ సంపగినూనె దెచ్చి యొకరా ♦ జీవాక్షియా లేమకున్
దలయంటెన్ గరకంకణంబులఝుణ ♦ త్కారంబులింపారఁగన్

మ॥ అలివేణుల్ దగ రుక్మిణీమణికి నె ♦ య్యంబార పీఠంబుపై
నలుగుంబెట్టియు మేలుగందముల యా ♦ నారీశిరోరత్నమున్
జలకంబార్చిరి హేమపాత్రమున భా ♦ స్వత్పాణ్యతీర్థంబులన్
విలసన్మూర్తులు భూసురోత్తము లటన్ వేద ♦ స్మృతుల్
(సేయఁగన్. 17

సీ॥ మణిమయంబులు నగు ♦ మంజీరములు పాద
కంజాతములఁ గూర్చి ♦ గరిత యొర్తు

హారిమధ్య మధ్యమ ♦ మందురత్నపు మేఖ
లమును బంధనఁ జేసె ♦ లలనయోర్తు
కంఠస్థలిని మౌక్తి ♦ కముల హారంబులఁ
బరిఢ విల్లఁగ నేసె ♦ భామ యోర్తు
కరములందున రత్న ♦ కంకణంబులఁ గూర్చి
భాసురంబుగ మృదు ♦ పాణి యోర్తు

గీ॥ కర్ణయుగమున వజ్రంపు ♦ కమ్మలలర
నాసికంబున ముత్యంబు ♦ భాసిలంగ
విరి సరంబులఁ బెన్నెఱి ♦ వేణిఁ జుట్టి
కాంత యోర్తురాసుత కలం ♦ కారమేర్చె. 18

వ॥ ఇట్లన్నివిధంబుల రుక్మిణీమణి నలంకరించి పెండ్లికుమార్తె
నుంజేసి భీష్మకునికిం దెలుప నారాజేంద్రుఁడు భవానీపూ
జంజేయఁ గూతునుంబంప నాకన్నియ బంధుజనయుతం
బుగా దేవీమందిరంబునకుంజని శర్వాణినింబూజించి ప్రణ
మిల్లి. 19

ఉ॥ పార్వతి! లోకమాత! నవ ♦ పద్మదళాయతనేత్ర! గౌరి! శ్రీ
సర్వజగన్నిధామకవి ♦ శారద! శాశ్వత! సర్వలోకముల్
పర్వఁగఁజేయునేత! శివ ♦ భార్గవి! మేటిపురాణి! దుర్గ! శ్రీ
పర్వతరాజపుత్రి! మృదు ♦ భాషిణి! కాళిక! భద్ర! శాంభవి!

శా॥ అంబా! మాయిల వేల్పువీవనచు నె♦య్యంబార నీపాదయు
గ్మంబుల్ గొల్చెడిదీనురాల, విలస ♦ త్కారుణ్యముంజూపి స
న్నుంబాలించియదూద్భవున్ బతిగసంతోషంబునంగూర్చుమా
ర్గంబున్నీవ తలంపఁగా వలయునో ♦ గౌరీ! దయాంభోనిధీ! 21

వ॥ అనియిట్లు దేవీస్తోత్రంబునుం జేసి యారాచకన్నియ దుర్గా
మందిరంబువీడి వచ్చుసమయంబున. 22

క॥ హరిఁజూడఁ ద్వరిత మెందెడి
తరుణి పయిన్ జేసలిడిరి ♦ తరుణేందుముఖుల్
పరమంబగు రూపంబునఁ
దరుణీమణి వెలుఁగఁ దొడఁగె ♦ ధాత్రీవరేణ్యా! 23

క॥ రాజీవాక్షినిఁ జూచిరి
రాజిలి చైద్యాది నృపులు ♦ రమణీయముగన్
రాజీవాక్షి కనుంగొనె
రాజులఁ గడకంటిచూడ్కి ♦ రాజవరేణ్యా! 24

వ॥ అంత నొకదెస. 25

చ॥ కనియెను రుక్మిణీసుదతి ♦ కాంచనచేలుని నీలదేహునిన్
ఘనుని యదూద్వహుని ♦ గంజదళాక్షుని మందహాస ముం
దని పెడి మౌళిపింఛుని సు♦ధామధురోక్తునికృష్ణుమాధవున్
మనములరార భక్తజన ♦ మానసవాసుని నందసూనునిన్

వ॥ అంతనిఖిలలోకనాయకుఁడగు గోవిందుఁడరణ్యంబున జంతుహృదయాందోళనంబొనర్చు సింహంబు పగిదియచ్చటఁగల నృపమండలంబాతయు నివ్వెరఁబడుచుండ రుక్మిణీమణినిఁ జేరంజని. 27

చ॥ హరి రభసంబునుంగలిగి ♦ యంబుజనేత్రను గ్రుచ్చియెత్తి తా
నరదమునందుఁ జేర్చె నృపు ♦ లందరు నివ్వెరవోయి చూడ స
చ్చరితుఁడు రాముఁడప్పునిజ ♦ సైన్యముతో నటవచ్చితోడ్త డెక్
హరితన పాంచజన్యమును ♦ నచ్చత మొప్పఁగనూదె భూవరా!

వ॥ అనియిట్లు. 29

గీ॥ సంతసంబున సూతుఁడు ♦ సకలమునుల
కెఱుఁగఁ జేసినరీతి నా ♦ క్షితివరునకుఁ
దెలియఁ బరచెను శుకుఁడును ♦ దెలిసి నృపుఁడు
నవల కథఁగోరె వినఁగ తా ♦ నమితభక్తి 30

క॥ వాసవవందితపద, ప
ద్మాసన వినుతచరిత! ♦ యఖిలేశ యశో
వాస! పరాత్పర రఘువర
దాసావనపారిజాత! ♦ దశరథరామా! 31

మాలిని.

నయసుగుణ విభూషా ♦ నాకలోకేశపోషా!
నియతిసుకృతకృత్యా ♦ నిర్వికారా! బుధేశా!
జయజయనుతరూపా ♦ జానకీచిత్తచోరా!
భయజనధృతిరక్షా! ♦ పాహిమాంరామచంద్రా! 32

ఇది శ్రీహనుమద్దేవ దయారస లసత్కటాక్ష
కవితాధురీణ పంతము గోపనార్య పుత్ర
ఆంజనేయకవి కృత శ్రీ రుక్మిణీ
కల్యాణమను కావ్యంబునం
చతుర్థాశ్వాసము
సంపూర్ణము.

శ్రీరామచన్ద్ర పరబ్రహ్మణేనమః.

# శ్రీ రుక్మిణీ కల్యాణము

## పంచమాశ్వాసము.

శ్రీ జానకీశ పురహర
పూజిత సద్గుణవిశాల ♦ పురుషోత్తమ! భూ
రాజాధిరాజ రఘుపతి
రాజాన్వయ పారిజాత ♦ రామ నరేంద్రా. 1

వ॥ అట్లు సూతుండు నైమిశారణ్యమున శౌనకాది మునీంద్రులకు జెప్పెడిగతి శుకమునీంద్రుండు పార్థపౌత్రునితో నిట్లనియె. 2

చ॥ అనవుడు పౌండ్రకాదులుము♦రారిజయంబునకోర్వలేక జే
ధనువులఁబూనిఘోటకర ♦ థంబులుమత్తకరీంద్రయుక్తులై
జనపతులెందరోతమకు♦సాయమొనర్పగఁబోరఁజొచ్చి రా
వనజదళాయతాక్షు బల ♦భద్రులు సాత్యకిలోడ నుద్ధతిన్.

క॥ అని సైన్యంబులుఁ గ్రమ్మగ
గనుఁగొని నేత్రముల నగ్ని ♦ కణములు రాలన్
ఘనమద గజముల మీఁదకుఁ
జను సింగములనఁగ బలుఁడుఁ ♦ జక్రియుఁ దాకెన్. 4

వ॥ ఇవ్విధంబున శ్రీకృష్ణుండు శిశుపాలుని, హలాయుధుండు జరాసంధుని, సాత్యకి పౌండ్రక దంతవక్త్రసాల్వాదులం దాకి ప్రళయకాలానల విజృంభమాణ పరాక్రమాభీల తేజులై పవనజవంబుఁగల రథరథ్యంబుల నుగ్గునూచం జేయుచు మహారుద్రుల చందంబున నెదరించి మత్తకుంజరంబుల గండస్థలంబుల రక్తంబుఁ జొనుపుచు గజారోహకుల విదళించుచుఁ బరిఘాయుధంబులు భస్మంబు సేయుచుఁ గుఠారంబుల ఖండించుచుఁ దోమరంబులఁ దూలించుచుఁ బ్రాసంబులఁ బట్టుచు మహారభసంబున దేవాసుర సంగ్రామసన్నాహంబుమాడ్కిఁ దోఁచుచున్న సమయంబున వివిధ భేరీరవంబులుఁ జెలంగఁ దెగినమస్తకంబులును విరిగిన యూరుదేశంబులును బగిలిన ఫాలంబులును విచ్ఛిన్నంబులైన నాసికంబులును విసంధులైన శరీరంబులును నలిగిన జానుదేశంబులును వ్రస్సిన యురంబులును విరథులైన రథికులునుఁ బాఱెడి రక్తప్రవాహంబునఁ దెగిపడి బొబ్బలిడు మస్తకంబులును సాంద్రంబుగా మహార్ణవంబే కార్ణవంబుగా వర్షించుగతి శరంబులఁ గురియుచు మహాభయంకర సంకుల సమరంబున.

చ॥ తనువులుఁ దూలనేయుచు నుదద్దయుసైన్యముమీఁది కేగుచుం
గనులను విస్ఫులింగములు ♦ గ్రక్కనరాలఁగ నట్టహాసముల్
బెనుగొన బాణముల్ వడిగ ♦ వేయుచు సాత్యకి కోపదీప్తుఁడై
యనినటఁ బౌండ్రకుం గదసి యద్భుతమొప్పగణంబుఁ జేయఁగన్

చ॥ తగు కవచంబుఁ జించి యర♦దంబును గూలఁగ నేసి యుద్ధతిం
ఖగపతి సర్పముం గదిసి ♦ గర్వముఁ బాపియుఁ జంపురీతినిం
దెగిపడ నట్టి లాస్నృపతి ♦ దేహము ఛిద్రములొందఁ జేయఁగా
దిగులునఁ బోరుటల్విడిచి తేకువఁ దప్పియు వాఁడుఁ బాఱఁగన్

చ॥ మఱియుజరాసుతుండుజనమాన్యుఁడు నౌబలభద్రుతోడసం
గరమ్మునుఁ జేయఁగా విపుల ♦ కార్ముకముం ధరియించి బాణముల్
వరలఁగఁ జేయ, రాముఁడును ♦ వాని విదల్చి హలంబుఁ బూని త
చ్ఛిరమున వేయ సొమ్మసిలి ♦ చెచ్చెరఁ బఱ్వెడెఁ బ్రాణభీతిచేం,

వ॥ అంతకృష్ణుండు శిశుపాలుదెస రథంబుఁ బోవనిచ్చి. 9

చ॥ నిలునిలు చైద్య! నీబిగువు ♦ నీవును నీదగుసైన్యమెంత! నే
గెలుతును మూఁడులోకముల, ♦ క్రిందికిఁ ద్రొక్కెద భూతలంబునుం
జలనిధి నింకఁ జేసెదను, ♦ సత్వరమా కనకాద్రి వ్రేలుపై
నిలుపుదు, నన్ను గెల్వఁగను ♦ నిర్జరు లోసగలేరు దుర్మతీ!!

వ॥ అనినవిని. 11

చ॥ పకపక నవ్వి చేదిపతి ♦ శౌరిమొగంబున నోయదూద్వహా!
సుకరముగాదు నీకు, రణ ♦ శూరుఁడ ఖడ్గశరాసనాది సా
ధక నిపుణుండనైన నను ♦ దార్కొన లేరిల నెవ్వరేనియున్
వికలము నొందుటల్విడిచి ♦ వ్రేతలఁ జేరుము పొమ్ము గోపకా!

క॥ అనియిటుల తూలనాడుచు
సునిశిత మార్గణము లేయు ♦ శౌరిఁ గని యా
మనుజాధిపుతో హరి యి
ట్లనియెన్ జిరునగవు మోము ♦ నందలరారన్. 13

మ॥ వినరా చైద్యనరేంద్ర! నేనిటనిదే ♦ విల్లంది యున్నాఁడ నీ
ఘనసామర్థ్యముఁ జూపరా యని నినున్ ♦ ఖండించి భూతాళికిన్
మనమింపొందఁగ విందుఁగూర్చెదను నీ మాత్సర్యమున్ సాగునా?
మనఁగా లేవిక కాలమున్ సమసె ర ♦ మ్మా చావఁగా నెంచినన్.

వ॥ అనియిట్లు. 15

మ॥ తనవుల్నెత్తురుఁగారఁగా నిరువురు ♦ ద్యద్దీప్త బాణంబులన్
బెనగన్ వేయుచు ఢీయుచున్ జెలఁగుచున్ ♦ భేదించి కోదండముల్
ధ్వనిమార్విన్ గలుగంగఁ జేసి శరముల్ ♦ సంధించి పోరాడఁగన్
జననాథోత్తమ! రామ రావణ మహా ♦ సంగ్రామమట్లై దోచెడిన్

చ॥ బలముల నెన్నుచున్ నిశిత ♦ బాణము లేయుచు దృష్టిఁ జక్కఁగా
నిలుపుచు నిల్వు నిల్వుమని ♦ నిర్భరవృత్తిని సింహగర్జనల్

జలుపుచుఁజక్రిచైద్యుఁడును ♦ సంగరరంగమునందు రుద్రులై
నిలుచుచుఁబోరఁగాఁదొడఁగ ♦ నిర్జర లోకము తల్లడిల్లఁగన్.

క॥ ఇరువురు సమబలవిక్రమ
వరులై పోరాడి విశిఖ ♦ వర్షముఁ గురియన్
జరిపిరి, వారల నేర్పున
కరుదొందుచుఁ జూడఁదొడఁగ ♦ నమరులు మింటన్. 18

క॥ విలసిల్లు వైష్ణవాస్త్రము
బలభద్రుని సోదరుండుఁ ♦ బౌరుషమతుఁడై
దలపడి యేయఁగ జైద్యుఁడు
బలముడిగియుఁ జాపఁదొడఁగెఁ ♦ బార్థివముఖ్యా! 19

వ॥ ఇట్లు శ్రీకృష్ణపరమాత్మునిచే విడువంబడిన వైష్ణవాస్త్రంబున వెడలిన మహాగ్నిజ్వాలలకు నిలువంజాలక రణస్థలిని విడిచి నిఖిలభూపతులు చేదిపతిసహితంబుగా హతశేషమగు తమ తమ సైన్యంబులఁదోడ్కొని నిజ నివాసంబులకుంజనిరి. పిమ్మట రుక్మి ప్రచండుఁడై వాసుదేవుని రథంబునకెదురుగాఁ దనరథంబునుం బోవనిచ్చి. 20

చ॥ కలవర మొందు సైన్యములఁగన్గొని ధైర్యముగొల్పియంతటన్
నిలునిలుమాధవా! యిదుగో ♦ నేఁజను దెంచితిరమ్ము మద్భుజా

బలమది యెట్టిదో తెలియ ♦ వచ్చును దుర్బలకోటిమీఁద నీ
చలమును జూప నెంచితివే! ♦ సాగునె! రుక్మి నెదిర్చి పోరఁగన్

ఉ॥ ఆకులు కాయలన్ దినుచు ♦ నద్రులయందు చరించు గొల్లవై
భీకరమూర్తి వోలె నిటఁ ♦ భీష్మకు రాజ్యముఁ జొచ్చి రుక్మిణిన్
దేకువఁ దప్పి తీసుకొని ♦ తెంపరివై యెటుబోవ నెంచెదో
పోకిరి! రుక్మిణిన్ విడిచి ♦ పొమ్ము మదస్త్రముచేతఁ జావకన్.

క॥ చతురంగ బలముతోడను
జతురత వచ్చితివి రణము ♦ సల్పఁగ నీతో
మతి బాలుఁడనుచు నన్నవ
మతిఁ జేయకఁ బోరరమ్ము ♦ మాధవ! కినుకన్. 23

ఉ॥ గొల్లలయింటఁ బుట్టితివి ♦ కూళతనంబున సిగ్గుమాలి మా
పల్లవపాణి రుక్మిణిని ♦ పౌరుషహీనుఁడవై హరించుటల్
చెల్లునె! నీకు నీకుటిల ♦ చేష్టలమాన్పెద! యుద్ధమందు నిం
ద్రెల్లఁగ సేయువాఁడ నని ♦ తీవ్రశరంబుల నేయ నెంచినన్

గీ॥ అంత మాధవుఁడా రుక్మి ♦ నట్టెఁ జూచి
బాలుఁడవు నీవు నాతోడ ♦ బవరమాని
నిలువఁగాలేవు నీవేల ♦ నిర్జరాది
మేటిబలులైనఁ బోరాడి ♦ మించఁ గలరె! 25

వ॥ అదియునుంగాక నీతోడిసహచరులగు సాల్వ జరాసంధ పౌండ్రిక శిశుపాల నృపులును, తత్సైన్యంబులును మచ్ఛరాహతి కోర్వఁజాలక విముక్త కేశులగుచు బరాజితులైరి. ఇదియెఱింగి సమరంబునకు రాదగునె! సంగ్రామంబున కర్హుండవుగావు కావున నీయందు నాకువైరంబులేదు. సమరక్రియ లెఱుంగని కట్టుండవు. సుఖంబుగఁ దలిదండ్రుల దండనుండుపొమ్ము శీఘ్రంబున. 26

క॥ అనిపలికిన హరిపలుకులు
మనమునఁ జర్చింపకమిత ♦ మదమత్సరుఁడై
కనలుచు హరిదెస రథమును
జనఁజేసియు నిటులఁబలికె ♦ రుక్మినాథవరా! 27

క॥ హరి నీవు నీదుమాయనుఁ
బరికింపఁగ నాదుమ్రోల ♦ బరపకు వినుమా!
దురమందు నీదుబలములఁ
బఱుఁగెత్తఁగఁ జేయువాఁడ ♦ బంకజనాభా! 28

వ॥ అని కోదండపాణుండై ఘనాఘున గర్జితంబులట్లు జ్యాఘోషంబులొనర్చుచు రుక్మి క్రోధారుణ వీక్షణుండగుచు శరపరంపరల రోదసీకుహరమండలంబున జెల్లుంగప్పిన వాసుదేవుండవియన్నియు నివారించి రుక్మి బాణంబున నారా

కుమారుని శరాసనంబు ఖండించిన నంతవాఁడా భగ్నంబగు
చాపంబువిడిచి వేరొండుధనువుంగొని నిశితఁపుటంపగముల
నిగుడించిన. 29

సీ॥ వానినెల్లను ఖండించి ♦ వాసుదేవుఁ
డతని రథము రథ్యంబుల ♦ నంతమొందు
మార్గణంబులనేసిన ♦ మండివాఁడు
వేరురథమునుఁ గైకొని ♦ పోరుచుండ 30

క॥ హరినాగాస్త్రము గేలం
బరగన్ గొని వైవనదియు ♦ భాస్కరులీలన్
ధర విషమునుఁ గ్రక్కుచునని
కరచరణములొడసిగట్టె ♦ గదలక రుక్మిన్ 31

వ॥ ఇట్లు సర్వశత్రుబంధనంబగు పన్నగాస్త్రముచేతఁ గట్టువడి రుక్మి నిశ్చేష్టుఁడై యుండ, శ్రీహరి రుక్మిణీప్రార్థనంబంగీకరించి వానిం జంపక గడ్డంబును మీసంబును దలయునుం గొఱిగి విరూపుంజేసి యిక నీపురి త్రోవంబట్టి పొమ్మనిన, బలభద్రుండు జాలింగొని త్వరితంబుగ నారుక్మిరథంబునం జేరి యవ్వానిని బంధవిముక్తుంజేసి విడిచిపుచ్చి శ్రీహరి నింగని యిట్లనియె. 32

క॥ చుట్టంబుల దలమూఁతుల
కట్టా గోఁలుగంగఁ దగునె ♦ కమలాక్ష! ధరన్
బట్టియు జంపుటకన్నను
జెట్టగదా వానినటులఁ ♦ జేయుట కృష్ణా! 33

క॥ పగ చెలిమియు నీకిలలోఁ
నగధర! సమమయ్యునిఁటుల ♦ న్యాయమె నీకున్
దగురీతి రుక్మిననుపక
వగఁబొందఁగ జేయదగునె ♦ వారిజనాభా! 34

వ॥ అనియిట్లు బలభద్రుండు శ్రీకృష్ణునితర్జించుచు రుక్మిణీ దేవినింగాంచి, తల్లీ! భవత్సహోదరు భంగంబునుం గూర్చి వగచెదవేల; సమస్త ప్రాణులకు సుఖదుఃఖంబులవశ్యభోక్తవ్యంబులు నీయగ్రజుఁడు పరమకళ్యాణ గుణాభరణుండగు గోవిందునిచేత విగత కల్మషుండయ్యెనని దుఃఖోప శమనంబుఁ జేసె నిమ్మాట. 35

చ॥ అనుజులు బంధువుల్సచివు♦లాప్తులుమిత్రులు సంతసింప మే
దిని నవపుష్ప వర్షములు ♦ దేవతలుం గురియింప దుందుభి
స్వనముచెలంగ భూసురులు♦స్వస్తివచః పరనంబు సేయుఁగా
దనుజహరుండు శ్రీహరి ము♦దంబునఁ జేరెనుద్వారకాపురిన్.

వ॥ ఇట్లుచనుదెంచి తలిదండ్రులకును నిఖిలబంధు గురుపురో
హిత పండితప్రవరులకు వందనంబులనాచరించి యొకశుభ
ముహూర్తమునందు. 37

సీ॥ భూసురాశీర్వాద ♦ ములు జేయుచుండంగ
వందిమాగధులు కై ♦ వారమొసఁగ
గర్గాది మునులెల్ల ♦ గౌతుకంబునఁ జూడ
సామంత రాజులు ♦ సన్నుతింప
బంగాళ నేపాళ ♦ పాంచాళ నృపవర్యు
లాంధ్ర దేశాధీశు ♦ లభినుతింపఁ
బుణ్యాంగనామణు ♦ ల్వొసగ నారతులీయ
బంధువర్గంబెల్ల ♦ బలసికొలువ

గీ॥ కనకనిర్మితరత్న వి ♦ రాజమాన్య
మహిమఁ జెన్నొందు కళ్యాణ ♦ మంటపమునఁ
జేరి కృష్ణుండు భూసుర ♦ చిత్తమరసి
ప్రీతిఁ గూర్చుండె లగ్నంపు ♦ పీఠమందు. 38

సీ॥ భవురాణి సారస ♦ భవురాణియుంగూడి
మంగళహారతుల్ ♦ మరినొసంగ
శివుఁడు దెచ్చియునిచ్చె ♦ శివ శివాంకితమైన
రుద్రాక్షమాలని ♦ రూఢిమెరయ

నలుఁడొసంగెను భక్తి ♦ నమర పూజితమైన
మణికంకణంబులు ♦ మాధవునకు
వరుణుండు నొసఁగెను ♦ సురలకలభ్యమౌ
రత్నహారము రమా ♦ రమణునకును

గీ॥ సురలు నరులును నొకరీతి ♦ హరికిఁ గాన్క-
లర్పణముఁజేసి రావేళ ♦ నద్భుతముగ
వెలఁగి కృష్ణుండు నయ్యావి ♦ స్వీకరించి
సంతసిల్లుచునుండె నా ♦ సమయమందు. 39

ఉ॥ అంతట రుక్మిణీమణిని ♦ నంచితపుష్ప సుగంధ దివ్యని
ర్వాంత విభూష ణావళుల ♦ వేడుక మీర నలంకరించి యా
త్యంతముదంబునుంగొలువు ♦ నట్టిమృదంగపు తాళధ్వనుల్
కాంతలు వెంట రాఁగఁగుతుకంబునఁదోడ్కొని వచ్చి రంతయున్

సీ॥ నీలవర్ణంబున ♦ నిగుడు పెన్నెఱవేణి
కాంత నన్నడుమునఁ ♦ గ్రాలుచుండెఁ
కర్ణయుగ్మంబులఁ ♦ గాంతిలు వజ్రాల
తళుకు కమ్మల దీప్తి ♦ దనరుచుండ
గబ్బి గుబ్బలఁగుల్కు ♦ కంగుల రవికపై
రత్నాలహారముల్ ♦ రాణఁజెంద

చిలుకల్ గూర్చినకొల్లయందమలరన్ ♦ జెల్వొందుమంచంబుపైఁ
జెలువొప్పారెడి పాన్పునన్ హరివసిం♦చెన్ బ్రేమ రెట్టింపఁగన్

గీ॥ అంత రుక్మిణీ దోడ్కొని ♦ యనుగు చెలులు
భాసురంబుగ గేళికా ♦ భవనమునకుఁ
జేరి రంతట వారికిని ♦ జిత్తమందు
నిముస నిముసంబు యుగమునై ♦ నెగడుచుండ. 51

వ॥ అంత నచ్చెలులు రుక్మిణీదేవినిం గాంచి 52

క॥ ఎలనాగ! నీవు కోరిన
చెలువుఁడు నీకబ్బెనింకఁ ♦ జిత్తమునన్ బె
గ్గిలియుండకు మదనకళా
కలితంబగు లక్షణములఁ ♦ గలయుము కృష్ణున్ 53

సీ॥ శ్రీహరి కేల్వట్టి ♦ సెజ్జకు దిగిచిన
బెనగాడఁగారాదు ♦ బిసరుహాక్షి!
కపురంపు వీడెముల్ ♦ కలికి! కాంతుఁడొసంగ
మొగమోటఁ ద్రిప్పఁగరాదు ♦ మోహనాంగి!
కస్తూరి గంధముల్ ♦ గాంతి! నీచనుదోయి
నలఁద నెంచిన కృష్ణుఁ ♦ దలఁగకమ్మ!
ప్రియుఁడు నీ సరిగొప్ప ♦ ప్రేమవిరుల్ నింపఁ
గెరలఁగాఁ దప్పది ♦ కీరవాణి

గీ॥ మనసుఁ గని పెట్టి మగనితో ♦ మరలు కొనఁగ
వలయుఁగావున విసికింప ♦ వలదుసుమ్మీ!
పతియె దైవంబు సతులకుఁ ♦ బద్మనేత్రి!
తెలుపఁ గలవన్ని నీతోడఁ ♦ దెలిపినాము. 54

ఉ॥ అంటిమిగాని మాధవుని ♦ యందలి నీయనురాగ మంతయుం
గంటిమి కాదె మున్ను! బుధ ♦ గణ్యుని నీవటఁ బిల్వనంపు బ
ల్దంటవుగావె! సూనశర ♦ ధాటికిఁ జిక్కఁగనీకఁ గృష్ణుఁ; వా
ల్గంటిరో! నేలుమాయిపుడు ♦ కాముకు కేళినిఁ దేల్చి కామినీ.

ఉ॥ కన్నియ! నీవు రాజకుల ♦ కాంతవు చిన్నతెఱంగ నేర్తు! మా
వెన్నుఁడు మందు గొల్లపృథి ♦ వీ మరియాద తెఱంగ లేదు నీ
వన్నెలకుం సమానమగు ♦ వన్నెలు నేర్చిన పింఛధారి, నే
మన్నను నోర్చుకోవలయు ♦ నమ్మ! మనంబున రుక్మిణీమణీ.

క॥ సూటిగఁదా బరిహాసపు
మాటల నాడంగ వేరు ♦ మానిని యపుడా
బోటినిఁ గని యెంతటి
చేటివె! నీ నేర్పుఁ జూడఁ ♦ జిత్రముఁ దోచెన్ 57

క॥ పదియారు వేలగోపిక
మదవతులకు దగులుకొన్న ♦ మాధవు నెంతో

ముదమునఁ దెలియనివానిఁగ
జమువంగాదగునె! రతివి ♦ శారదుఁడరయన్. 58

సీ॥ సిగ్గుచేనిండి తలవాల్చి ♦ బెగ్గడిలెడి
భోజకన్నియఁ దోడ్కొని ♦ భుజగశయనుఁ
జేర్చి చిరునవ్వు లలరుచుఁ ♦ జేటి యొకతె
యింపుదళకొత్త హరితోడ ♦ నిట్టులనియె. 59

గీ॥ చల్ల లమ్మెడి ప్రేతల ♦ సరణి నీవు
రాచకన్నియ రుక్మిణీ ♦ రాజ వదనఁ
బోల జూడకు మీరలేమ ♦ పుష్పగంధి
మాట మర్యాదఁగని పెట్టి ♦ మరులుఁగొలుపు. 60

చ॥ అనియిటునచ్చ జెప్పియును♦రాచపదంబుల మ్రొక్కఁజేసి వే
డ్కను హరిస్రాల సెజ్జకడఁ♦గామిని నుంచియుఁ గృష్ణ! రుక్మిణీ
వనజదళాయతాక్షిని న ♦ వారిత ప్రేమను నేలుకొమ్ము కొ
మ్మని తగనప్పగించి పని♦యన్ మిషఁజూపి తొలంగిరందరున్.

క॥ మెల్లఁగ బాన్పున రుక్మిణి
పల్లవదళపాణిదగిచి ♦ భాసురమృదు ధ
మ్మిల్లంబును నిమిరియు రం
జిల్లుచుఁ బలుకందొడంగె ♦ శ్రీహరి ప్రేమన్. 62

సీ॥ గజనిమ్మ పండ్లునాఁ ♦ గానవచ్చెడి నీదు
కుచము లంటఁగనిమ్ము ♦ కనురుగంధి!
యలవిద్రుమములునా ♦ యనఁగఁ దోఁచెడినీదు
పెదవి ముట్టఁగనిమ్ము ♦ బిసరుహాక్షి!
మృదులతాదులఁబోలు ♦ మృదువొప్పచుండు నీ
కరములఁ బెనయవే ♦ కంబుకంఠి!
నీలోత్పలంబుల ♦ నెనరుఁజూపెడినీదు
కనులఁ దేలింపవే ♦ కమలపాణి!

గీ॥ యనుచు దరహాస వదనుఁడై ♦ యబ్జనేత్రుఁ
డలరి యానాతికుచముల ♦ నలరు మోవి
గలికి చెక్కిలి పిరుదులు ♦ గనులు బొమలుఁ
గేల నిమురుచు మరుకేళి ♦ బాలఁగూడె. 63

చ॥ మనసిజబారిఁజిక్కితిని ♦ మానిని! ధర్మమె! రమ్ము ప్రీతి మైఁ
బెనగొని మోవిపానకము ♦ ప్రీతిని హెచ్చఁగ నిచ్చియంతటన్
జనులనుబట్టనిమ్ము వెసఁ ♦ జౌసితి రీతులసొక్కి దంతము
ల్మోనయఁగనొక్కిపోయి గనుముచ్చటలాడెదరా వెకోమలీ!

క॥ అనిబుజ్జగించి నేర్పున
వనజాక్షుఁడుదరికిఁగిగిచి ♦ వనురహనేతిప్రీ

మనమలరారఁగ నంతట
వనజాస్త్రుని కేళిఁ దేల ♦ భాసిలు మఱుఁ డై. 65

గీ॥ తళుకు చెక్కుల ముద్దిడి ♦ ధవళనేత్రి
నీవి సడలించి రతిశాస్త్ర ♦ నియతి యధర
సుధలఁ గ్రోలుచుఁ గుచముల ♦ జొక్కి పట్టి
యతుల రతులను గరిగించె ♦ నబ్జముఖిని. 66

ఉ॥ అంతర తాంతమందున ము ♦ రారియు నంకమునందు రుక్మిణిన్
సంతసమొందనిల్పి విరి ♦ జాజులు వేణిరచించి క్రొమ్మెఱుం
వింతగు మేలుచందనము ♦ విప్పుగ చన్నులనద్ది మేలిమా
మంతనమాడు చ సుదతి ♦ మానసముం గరిగించె నేర్పునన్!

ఉ॥ అంతట నంబుజాక్షుఁడు ప్రి ♦ యాంగన రుక్మిణి నొక్కనాఁడు దా
నంతన మాడుఁ జేరి కుసు ♦ మంబులఁ గీల్జడఁ జుట్టి, మానినీ
వింతలఁ గొల్పు దేశముల ♦ వేడ్కఁ దలిర్పఁగఁ జూపువాఁడ నా
గాంతకు నెక్కి వచ్చెద వె ♦ యన్న మనీష ముద మొందె నెంతయున్.

క॥ హరియును భోజాత్మజయును
మురిపంబున నెక్కి గరుడు ♦ మూపురమంతన్
గరువలితీవ్రత నన్నను
తఱితంబున మింట కెగసెఁ ♦ దార్క్ష్యుఁడు వడితోన్. 69